بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡد

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR**

Qadian

సంపుటి: 11 | www.akhbarbadr.in | సంచిక: 30-31

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,

ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.


(సీరతున్నబీ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రత్యేక సంచిక)

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

قُلۡ یٰۤاَیُّہَا النَّاسُ اِنِّیۡ رَسُوۡلُ اللّٰہِ اِلَیۡکُمۡ جَمِیۡعَا ۣ الَّذِیۡ لَہٗ مُلۡکُ السَّمٰوٰتِ وَالۡاَرۡضِ ۚ لَاۤ اِلٰہَ اِلَّا ہُوَ یُحۡیٖ وَیُمِیۡتُ ۠ فَاٰمِنُوۡا بِاللّٰہِ وَرَسُوۡلِہِ النَّبِیِّ الۡاُمِّیِّ الَّذِیۡ یُؤۡمِنُ بِاللّٰہِ وَکَلِمٰتِہٖ وَاتَّبِعُوۡہُ لَعَلَّکُمۡ تَہۡتَدُوۡنَ ﴿۱۵۹﴾

అనువాదం: నీవు ఇట్లనుము " ఓ మానవులారా! నిశ్చయముగా నేను మీ అందరి వైపు అల్లాహ్ ప్రవక్తగా వచ్చినవాడను. భూమ్యాకాశముల ప్రభుత్వము అతనిదే. అతడు బ్రతికించును. చంపును కూడ. కనుక అల్లాహ్‌ను, అతని సందేశహరుడు నిరక్షరాస్యుడైన ప్రవక్తను విశ్వసించుడు. అతడు అల్లాహ్‌ను, అతని వాక్యములను విశ్వసించును. మీరు మార్గదర్శనము పొందుటకు అతనినే అనుసరించుడు. " (ఆరాఫ్ :159)


తేది: 23-30 జులై 2026 క్రీ, శ. 23-30 వఫా 1405 హి, శ. 08-15 సఫర్ 1448 హి,ఖ.


ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

## ప్రార్థనలు, దైవభీతి, మిక్కిలి ఆరాధనలు మరియు కృతజ్ఞతా భావం.

عَنْ زِيَادٍ، قَالَ سَمِعْتُ الْمُغِيرَةَ بْنَ شُعْبَةَ رَضِيَ اللَّهُ عَنْهُ، يَقُولُ: قَامَ النَّبِيُّ صَلَّى اللَّهُ عَلَيْهِ وَسَلَّمَ حَتَّى تَوَرَّمَتْ قَدَمَاهُ، فَقِيلَ لَهُ غَفَرَ اللَّهُ لَكَ مَا تَقَدَّمَ مِنْ ذَنْبِكَ وَمَا تَأَخَّرَ؟ قَالَ أَفَلاَ أَكُونُ عَبْدًا شَكُورًا

**(సహి బుఖారి, కితాబు తఫ్సీర్, బాబ్ లి యఘ్ఫిరలక అల్లాహు మా తఖద్దమా, హదీస్ 4837)**

హజ్రత్ ముఘీర బిన్ షుఅబ రజియల్లాహు అన్హు ఇలా ఉల్లేఖించారు: వారు ఇలా తెలిపారు: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం రాత్రివేళ (నమాజ్ కొరకు) చాలా ఎక్కువ సమయం ఖయామ్ (నిలబడేవారు) చేసేవారు. ఫలితముగా హుజూర్ (స) గారి రెండు పాదాలు ఉబ్బిపోయేవి. కావున హుజూర్ (స)తో ' అల్లాహ్ తాలా మీ పూర్వపు, తదుపరి తప్పిదములన్నింటిని క్షమించివేశాడు కదా (మళ్ళీ ఇంతగా ఎందుకు కష్టపడుతున్నారు)' అని విన్నవించుకోగా, సమాధానంగా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ' అందుకు నేను అల్లాహ్ యొక్క కృతజ్ఞత కల్గిన దాసుడిని కాకూడదా? ' అని తెలిపారు.

## మహోన్నత ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవక్తలందరి కన్నా శ్రేష్ఠులని నమ్మడంను నేను ఒక గొప్ప విశ్వాసంగా భావిస్తాను.

**(ఉపదేశములు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)**

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ ( మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని) అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:

" ఎంతో కాలం గడిచిపోయింది. వారందరూ కలిసి వచ్చినప్పటికీ, అల్లాహ్ యొక్క ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చేసిన కార్యాన్ని, తీసుకువచ్చిన సంస్కరణను వారందరు కలిసికూడ సాధించలేకపోయేవారు. ఎందుకంటే, మన ప్రవక్త(స)కు ప్రసాదించబడినటు వంటి విశాల హృదయం, ధైర్యం, శక్తి వారిలో లేవు. ఎవరైనా దీనిని ప్రవక్తలను నవూజుబిల్లాహ్ అవమానించడం అని భావించినచో అలాంటి వ్యక్తి అజ్ఞాని, అతడు నాపై తప్పుడు ఆరోపణ చేస్తున్నవాడుగును. ప్రవక్తలందరినీ గౌరవించడం, వారికి అత్యున్నత మర్యాద ఇవ్వడంను నేను నా విశ్వాసంలో అవిభాజ్య భాగమని నమ్ముతాను. అయితే, మహోన్నత ప్రవక్త ముహమ్మద్ (స) ప్రవక్తలందరి కన్నా శ్రేష్ఠులని నమ్మడంను నేను ఒక గొప్ప విశ్వాసంగా భావిస్తాను. ఈ విశ్వాసం నా రక్తమాంసాలలో, నా అస్తిత్వంలోని ప్రతి అణువులో నాటుకుపోయింది. దానిని నా నుంచి తొలగించడం నా చేతిలో లేదు. సత్యాన్ని చూడలేని దురదృష్టవంతుడైన ప్రత్యర్థి తనకు నచ్చినట్లు మాట్లాడవచ్చు. కానీ మన మహోన్నత ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం చేసిన కార్యాన్ని ఏ ఒక్కరు వ్యక్తిగతంగా గాని, లేదా అందరూ కలిసికట్టుగా గాని చేయలేక పోయేవారు. ఇది అల్లాహ్ యొక్క అనుగ్రహమే. "అది అల్లాహ్ యొక్క అనుగ్రహం ఆయన తాను కోరిన వారికి దానిని ప్రసాదిస్తాడు." **(మల్ఫూజాత్, సంపుటి 2, పుట 174)**

## దైవ ఏకత్వపు (తౌహీద్) స్థాపన కోసం దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం బోధనలు.

హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ అన్హు ఇలా పేర్కొన్నారు:

"దైవ ఏకత్వపు (తౌహీద్) స్థాపన కోసం దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రపంచానికి అందించిన మొదటి సూత్రంకు మరియు తౌహీద్‌తో దానికి ఉన్నటువంటి సంబంధాన్ని నేటికీ కూడ ఈ ప్రపంచీకులు పూర్తిగా గ్రహించ లేదు. ఆ సూత్రం ఏమిటంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ తఆలా నుండి జ్ఞానం పొంది, ప్రపంచంలోని ప్రతి జాతిలోనూ ప్రవక్తలు వచ్చారని ప్రకటించారు. బాహ్యముగా చూసినచో ఈ విషయానికి తౌహీద్‌తో సంబంధమే లేనట్టుగా అనిపించవచ్చు. కానీ వాస్తవానికి, ఈ సత్యాన్ని అంగీకరించకుండా తౌహీద్ సంపూర్ణంగా స్థాపించబడదు. ఈజిప్ట్, పర్షియా, భారతదేశం, చైనా, జపాన్, యూరప్, అమెరికా వంటి దేశాలలో కూడా అల్లాహ్ తన ప్రవక్తలను పంపాడని విశ్వసించనంత వరకు, తౌహీద్ భావన సంపూర్ణం కాదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అవతరించి ఈ బోధనపై ఎంతో గట్టిగా దృష్టి సారించారు. అందుకే పవిత్ర ఖుర్ఆన్ ఇలా ప్రకటిస్తుంది: " వ ఇన్ మిన్ ఉమ్మతిన్ ఇల్లా ఖలఫిహా నజీర " (ఫాతిర్ :25) అనగా అల్లాహ్ ప్రవక్తలు అవరించనటు వంటి ఏ జాతీ కూడ లేదు. మరొక చోట అల్లాహ్ తఆలా ఇలా తెలిపాడు. " వలఖద్ బఅస్‌నా ఫి కుల్లి ఉమ్మతిన్ రసూలా " (అన్నహల్: 37) అనగా "ప్రతి సమాజంలో మేము తప్పకుండా ఒక ప్రవక్త ను పంపాము." అదే సందర్భంలో తౌహీద్ గురించి ప్రస్తావిస్తూ ఇలా తెలిపాడు. "అనీబుదుల్లాహ్ వజ్‌తనిబుత్తాఘూత " అనగా, "అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి; అన్యారాధనల నుండి దూరంగా ఉండండి." అని ప్రజలకు బోధించడానికే మేము ప్రవక్తలను పంపాము. అందువల్లనే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రపంచం ముందు "సత్యం మా వద్దకే వచ్చింది; మిగిలిన ప్రపంచాన్ని దేవుడు వదిలిపెట్టాడు" అని చెప్పడం తప్పు అనే ఈ మహత్తర సూత్రాన్ని ఉంచారు. వాస్తవానికి, ప్రవక్తలు, సందేశహరులు అవతరించ కుండా ఉన్నటు వంటి ఏ జాతి కూడ లేదు."

**(1929 జూన్ 2న ఖాదియాన్‌లో జరిగిన సీరతున్నబీ (సల్లల్లాహు అలైహి వసల్లం) సభలో హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ తాలా అన్హు చేసిన ప్రసంగం నుండి.)**

**(అహ్మదియ్యా వార్తలు )**

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షును ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

సంపాదకీయం: لَا اِلٰہَ اِلَّا اللّٰہُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰہِ

## “ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవిత చరిత్రకు చెందిన విశ్వాస భరిత సంఘటనలు”

ఈ ఐదవ ఖిలాఫత్ యొక్క ధన్యమైన యుగం అత్యంత ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఎందుకంటే ఇది సృష్టిలో శ్రేష్ఠులైన నాయకుడు, దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి మరియు వారి మహోన్నత సహాబాల (రిజ్వానుల్లాహ్ అలైహిం అజ్మయీన్) జీవితాల నుండి అందమైన సంఘటనలను మనకు అందిస్తోంది. అనేక సంవత్సరాలుగా, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) తమ జుమా ప్రసంగాలలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సహాబాల విశ్వాసాన్ని బలపరిచే సంఘటనలను వివరిస్తూ వస్తున్నారు. వారి త్యాగమయమైన జీవితాలను ఎంతో విశ్వాస భరితముగా వివరించడం ద్వారా, అహ్మదీయులమైన మనం మన జీవితాలలో ఆధ్యాత్మిక పరివర్తనను తెచ్చుకొని, సహాబాల అడుగుజాడల్లో నడవాలని వారు కోరుకుంటున్నారు.

దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి భవిష్యవాణుల ప్రకారం, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారి కాలం కూడా సహాబాల యుగమే అనబడుతుందని గలదు.

ఈ క్రమంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు:

“అల్లాహ్ తఆలా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో కూడిన ఈ జమాఅత్‌కు సహాబాల జమాఅత్‌తో అనుసంధానించబడే స్థాయిని ప్రసాదించాడు. ‘వఆఖరీనా మిన్హుమ్ లమ్మా యల్హఖూ బిహిమ్’ (అంటే, ‘ఇంకా వారితో చేరని వారిలో మరికొందరు’) అనే ఖుర్ఆన్ వాక్యాన్ని వ్యాఖ్యాతలు విశ్లేషిస్తూ ఇది హజ్రత్ మసీహ్ మౌవూద్ యొక్క జమాఅత్‌ను సూచిస్తుందని అంగీకరించారు. అందువల్ల, ఈ జమాఅత్ కూడా వాస్తవానికి సహాబాల జమాఅత్‌గానే పరిగణించబడుతుంది.”

హుజూర్ (అ) మరొకచోట ఇలా అన్నారు:

“సహాబాల జమాఅత్ అనేది ప్రారంభ కాలంలో జీవించి మరణించిన వారితో మాత్రమే ముగిసిపోయిందని అనుకోకండి. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ప్రస్తావించిన మరో వర్గం కూడా సహాబాలలో భాగమే అని తెలిపాడు. వారు అహ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఆధ్యాత్మిక ప్రతిరూపం (బురూజ్)తో ఉండబోయే వారు.”

**(తఫ్సీర్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, జుమా అధ్యాయం, పేజి 140)**

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) తన జీవితకాలంలోనే ఈ సహాబాల ఆధ్యాత్మిక శిక్షణ మరియు సంస్కరణ బాధ్యతను స్వయంగా నిర్వర్తించారు. వారి అనంతరం, వారి ధర్మపరులైన ఖలీఫాలు ఈ పవిత్ర బాధ్యతను నిరంతరం కొనసాగిస్తూ వస్తున్నారు. ఈ ఐదవ ఖిలాఫత్ యొక్క ధన్యమైన యుగంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలం ఒకవైపు దూరమవు తున్న కొద్దీ, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) గారు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు వారి సహాబాల అపూర్వమైన త్యాగాలను పదే పదే మనకు గుర్తుచేస్తూ, అదే స్ఫూర్తిని మనలో కూడా నాటడానికి కృషి చేస్తున్నారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) మరల ఇలా అన్నారు:

“‘వఆఖరీనా మిన్హుమ్’ అనే వాక్యం మరో విషయాన్ని కూడా సూచిస్తుంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఈ జమాఅత్ సహాబాల జమాఅత్‌ను పోలినట్లే, ఈ జమాఅత్ యొక్క ఇమామ్ కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారిని ఆధ్యాత్మికంగా పోలి ఉంటాడు. ఎందుకంటే ప్రవక్తగారే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తనను పోలి ఉంటాడని పేర్కొన్నారు.”

**(అయ్యాముస్-సుల్హ్; తఫ్సీర్ హజ్రత్ మసీహ్ హౌవూద్ అలైహిస్సలాం జుముఅ - అధ్యాయం. పేజి 132)**

2018 మార్చి 9న, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) గారు సహాబాల గొప్పతనాన్ని కొనియాడుతూ ఒక జుమా ప్రసంగం చేశారు. వారి త్యాగాలను వివరిస్తూ వారు ఇలా అన్నారు:

“సహాబాలు చూపించిన సత్యత, నిష్ఠ, విశ్వాసం, చిత్తశుద్ధి, కరుణ వంటి గుణాలు ఎంత అద్భుతమైనవో చూసి మానవుడు ఆశ్చర్యపోతాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఆధ్యాత్మిక శక్తి, వారి ప్రేమను ఈ లోకపు బంధాల నుండి అల్లాహ్ ప్రేమవైపు మళ్లించడమే కాకుండా, అంతటి ఉన్నత స్థాయికి చేర్చింది; ప్రపంచ చరిత్రలో అలాంటి ఉదాహరణ మరెప్పుడూ కనిపించలేదు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) కూడా ఇదే విషయాన్ని ఎంతో అందంగా వివరించారు. గత ప్రవక్తల జీవితాలలో కూడా ఇలాంటి ప్రేమతో కూడిన త్యాగానికి ఉదాహరణ దొరకదని వారు అన్నారు. అంతేకాదు, పూర్వ ప్రవక్తల అనుచరుల స్థితి కూడా సహాబాలతో పోలిస్తే చాలా తక్కువ స్థాయిలో ఉండేది. ఈ సహాబాలు తమ ప్రాపంచిక కోరికలన్నింటినీ వదులుకున్నారు. వారు పవిత్ర హృదయాలతో, పూర్తిగా అల్లాహ్‌కు అంకితమై, ఆయన ప్రసన్నతను పొందడానికే జీవించారు. ఒక వ్యక్తి ఈ స్థితికి చేరుకున్నప్పుడు, అల్లాహ్ అతనిపై అపారమైన అనుగ్రహాలను కురిపిస్తాడు. సహాబాల జీవితమంతా దీనికి ప్రత్యక్ష సాక్ష్యం.”

**(బదర్ వార పత్రిక, 5-12 ఏప్రిల్ 2018)**

అనేక సంవత్సరాలుగా హుజూర్ అన్వర్ గారు సహాబాల జీవితాలను నిరంతరం వివరిస్తూ వస్తున్నారు. దీని ఉద్దేశ్యం ఏమిటంటే, అల్లాహ్ తఆలా మనలను కూడా సహాబాల సమానులుగా చేశాడని మనకు గుర్తుచేయడం. కాబట్టి, వారిలో ఉన్న అదే చిత్తశుద్ధి, విశ్వాసం మరియు త్యాగస్ఫూర్తి మనలో కూడా ఉండాలి. దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి పట్ల సహాబాలకు ఉన్న ప్రేమ, విశ్వాసం మన హృదయాలలో కూడా నిండిపోవాలి. ఆ ప్రేమే వారిని అల్లాహ్ మార్గంలో తమ ప్రాణాలను సైతం అర్పించడానికి ప్రేరేపించింది.

అల్ హందులిల్లాహ్! నేడు కూడా అహ్మదీయ ముస్లిం జమాఅత్‌లో సహాబాల అడుగుజాడల్లో నడుస్తూ, తమ ఇమామ్ పిలుపుకు స్పందించి, మరపురాని మరియు శాశ్వతమైన త్యాగాల ఉదాహరణలను చూపిస్తున్న అనేక మంది సోదరులు, సోదరీమణులు ఉన్నారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా అన్నారు:

“అల్లాహ్ తఆలా ‘ఆఖరీనా మిన్హుమ్’ అని చెప్పి ఈ జమాఅత్‌ను సహాబాలతో కలిపినప్పుడు, ఈ జమాఅత్‌లో కూడా సహాబాల వంటి చిత్తశుద్ధి, విశ్వాసం మరియు స్వచ్ఛత ఉండాలి. సహాబాలు ఏమి చేశారో ఆలోచించండి. అల్లాహ్ మహిమను వారు చూసిన వెంటనే, తమ జీవితాలను కూడా అర్పించే స్థాయిలో ఆ మార్గాన్ని స్వీకరించారు. తమ భార్యలు వితంతువులు అవుతారని, పిల్లలు అనాథలు అవుతారని, ప్రజలు తమను ఎగతాళి చేస్తారని తెలిసినా, వారు ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. అన్నింటినీ సహించారు. కానీ అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తపై తమ విశ్వాసాన్ని ప్రకటించడం మాత్రం ఎప్పుడూ మానలేదు. నిజంగా వారి విశ్వాసం అత్యంత దృఢమైనది. దానికి సాటి ఉదాహరణ మరెక్కడా కనిపించదు.”

**(అల్-హకం, సంపుటి 6, సంచిక 40, 10 నవంబర్ 1902, పుట 3; సూరహ్ అల్-జుముఅహ్ వ్యాఖ్యానం, పుట 150)**

అందువల్ల, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) వారి ప్రసంగాలను మనం క్రమం తప్పకుండా శ్రద్ధగా చదవడం, వినడం చాలా అవసరం. వారు దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సహాబాల ప్రేరణాత్మక త్యాగాలను మనకు గుర్తుచేస్తున్నారు. వాటిని అధ్యయనం చేయడం ద్వారా, మనలో కూడా అట్టి గొప్ప లక్షణాలు పెంపొందుతాయి.

మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను స్వీకరించినందున, సహాబాల ఆధ్యాత్మిక సమాజంలో భాగస్వాములమయ్యాము. అందువల్ల, అట్టి త్యాగస్ఫూర్తి మనల్ని కూడా పిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఖిలాఫత్ అనే ధన్యమైన వ్యవస్థ నీడలో మన అనేకమంది సోదరులు, సోదరీమణులు ఇప్పటికే అలాంటి గొప్ప త్యాగాలను సమర్పిస్తున్నారు.

అల్లాహ్ తఆలా మన అందరికీ కూడా అలాంటి త్యాగాలు చేసే సామర్థ్యాన్ని ప్రసాదించుగాక. ఆమీన్.

مسیح وقت اب دنیا میں آیا — خدا نے عہد کا دن ہے دکھایا
مبارک وہ جو اب ایمان لایا — صحابہ سے ملا جب مجھ کو پایا
وہی مے ان کو ساقی نے پلادی — فسبحان الذی اخزی الاعادی

# జుమా ప్రసంగము

**ప్రవక్త (స) తన అనుచరులకు కూడా ఇలా బోధించారు: "ఇప్పుడు మీరు నన్ను అనుసరిస్తూ, నాకు విధేయత చూపుతామని ప్రమాణం చేసినందున, మీరు కూడా సత్యతలో అత్యున్నత ప్రమాణాలను పాటించాలి."**

---

**బదర్ యుద్ధం జరిగిన రోజున అఖ్నస్ బిన్ షరీక్ అబూజహల్‌ను కలిసి ఇలా అడిగాడని పేర్కొనబడింది: "ఓ అబుల్ హకమ్! ఇక్కడ మన ఇద్దరం తప్ప మరెవరూ లేరు. నిజం చెప్పు!, ముహమ్మద్ (స) సత్యవాదా? లేక అబద్ధికుడా?" దానికి అబూజహల్ ఇలా జవాబిచ్చాడు: "అల్లాహ్ ప్రమాణం! ముహమ్మద్ (స) నిస్సందేహంగా సత్యవాది. ఆయన ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు."**

**సయ్యిద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 17 ఏప్రిల్ 2026 ( 17 షహాదత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

اَمَّا بَعْدُ فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ- بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ-

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

قُلْ لَّوْ شَآءَ اللّٰهُ مَا تَلَوْتُهٗ عَلَيْكُمْ وَلَآ اَدْرٰىكُمْ بِهٖ فَقَدْ لَبِثْتُ فِيْكُمْ عُمُرًا مِّنْ قَبْلِهٖ اَفَلَا تَعْقِلُوْنَ- فَمَنْ

اَظْلَمُ مِمَّنِ افْتَرٰى عَلَى اللّٰهِ كَذِبًا اَوْ كَذَّبَ بِاٰيٰتِهٖ اِنَّهٗ لَا يُفْلِحُ الْمُجْرِمُوْنَ - (يونس:17-18)

అనువాదం: నీవు ఇట్లనుము, 'అల్లాహ్ సంకల్పించి ఉండి ఉంటే, నేను దీనిని మీకు పఠించి ఉండేవాడిని కాదు. అతడు కూడా దీనిని మీకు తెలియజేసి ఉండే వాడు కాదు. దీనికి ముందు నేను మీ మధ్య ఒక సంపూర్ణ జీవితకాలం గడిపాను. అయినా మీరు తెలివిని ఉపయోగించరా?. అల్లాహ్‌పై అబద్ధాన్ని కల్పించే వాడికంటే, లేదా ఆయన సూచనలను (ఆయతులను) అబద్ధమని కొట్టిపారేసే వాడికంటే ఎక్కువ అన్యాయస్థుడు ఎవరు? నిశ్చయంగా, అపరాధులు ఎప్పటికీ విజయాన్ని పొందరు." ఇదే వాస్తవము.

దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జీవితం మరియు వ్యక్తిత్వంలోని వివిధ అంశాలు ప్రస్తావించబడుతున్నాయి. ఈ రోజు, ప్రవక్త (స) ఉన్నతమైన నైతిక విలువలు, స్వచ్ఛత, నిజాయితీ మరియు విశ్వసనీయత గురించి చర్చించబడుతుంది. దైవ ప్రవక్త (స) వారి జీవితం మరియు వ్యక్తిత్వానికి సంబంధించిన సంఘటనలను పరిశీలిస్తే, వారు సత్యతకు చెందిన అత్యుత్తమ ఉదాహరణలు కనిపిస్తాయి. అంతేకాకుండా, వారి(స) శత్రువులు కూడా వారి అసాధారణమైన నిజాయితీ మరియు సత్యతను అంగీకరించకుండా ఉండలేక పోయారు.

నేను ఇప్పుడు పఠించిన పవిత్ర ఖుర్‌ఆన్ సూక్తులలో అల్లాహ్ తఆలా ప్రవక్త (స) గారి ఈ సత్యత యొక్క ఉన్నత ప్రమాణాన్ని వివరించాడు. అలాగే, దైవ ప్రవక్త (స) వారికి ఇలా చెప్పమని ఆదేశించారు: "నేను ఎప్పుడూ, ఎలాంటి పరిస్థితుల్లోనూ అబద్ధం చెప్పలేదు. నేను ఎప్పుడూ సత్యాన్ని విడిచిపెట్టలేదు. దీనికి మీరే సాక్షులు. అలాంటప్పుడు, అల్లాహ్ నుండి కాని ఒక మతాన్ని తీసుకొచ్చి, నేను సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌పై అబద్ధాన్ని కల్పిస్తానా? అది అసాధ్యం."

అదే సమయంలో, ప్రవక్త (స) తన అనుచరులకు కూడా ఇలా బోధించారు: "ఇప్పుడు మీరు నన్ను అనుసరిస్తూ, నాకు విధేయత చూపుతామని ప్రమాణం చేసినందున, మీరు కూడా సత్యతలో అత్యున్నత ప్రమాణాలను పాటించాలి."

అందువల్ల, ఈ రోజు మనమందరం ఈ విషయంలో మనల్ని మనం పరిశీలించుకోవాలి. ఎందుకంటే, సత్యతలోని ఈ ఉన్నత ప్రమాణాలే మన జీవితంలోని ప్రతి క్షణంలో విజయానికి హామీని ఇస్తాయి. అంతేకాక, అవే తబ్లీగ్ (ఇస్లాం సందేశాన్ని ప్రచారం చేయడం) కోసం కూడా మనకు కొత్త అవకాశాల ద్వారాలను తెరుస్తాయి.

దైవ ప్రవక్త (స) వారి పవిత్రమైన జీవితాన్ని గురించి హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజియల్లాహు అన్హు) ఒక సందర్భంలో ఇలా వ్రాశారు లేదా ఒక ప్రసంగంలో ఇలా పేర్కొన్నారు: "దైవ ప్రవక్త (స) వారి విషయంలో, వారి శత్రువులు కూడా వారిని సాదిఖ్ (సత్యవంతుడు) మరియు అమీన్ (విశ్వసనీయుడు) అని అంగీకరించారు. వారి (స) నిజాయితీ లేదా విశ్వసనీయతపై వారు ఎప్పుడూ ఎలాంటి ఆరోపణ చేయలేదు. నిజానికి, వారికి అత్యంత బద్ధశత్రువులైన వారు కూడా ప్రవక్త (స) గారి పవిత్రతకు, సత్యతకు సాక్ష్యం ఇచ్చారు.

ఉదాహరణకు, మక్కాలో ఒక సమావేశం జరిగింది. మక్కాకు వచ్చే బయటి ప్రాంతాల ప్రజలు, ముఖ్యంగా హజ్ యాత్రికులు, దైవ ప్రవక్త (స) గురించి అడిగితే వారికి ఏమి చెప్పాలనే విషయాన్ని నిర్ణయించడానికి వారు సమావేశ మయ్యారు. వారు ఒకే విధమైన సమాధానాన్ని నిర్ణయించుకోవాలని భావించారు. ఎందుకంటే, ఒకరు ఒక విధంగా, మరొకరు మరో విధంగా చెప్పడం వల్ల వారే అవమానానికి గురవుతున్నారు. కాబట్టి, హజ్ కోసం వచ్చే ప్రజలకు అందరూ ఒకే సమాధానం చెప్పాలని వారు నిర్ణయించుకోవాలని అనుకున్నారు."

దీనిపై వారిలో ఒకరు, "ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అబద్ధాలు చెప్పే అలవాటు ఉన్న వ్యక్తి, ఆయన చెప్పేది అంతా అబద్ధమే" అని చెప్పాలని సూచించాడు. ఇది విన్న నజర్ బిన్ హారిస్ అనే వ్యక్తి లేచి ఇలా అన్నాడు:

"అలా చెప్పకూడదు. మీరు అలా చెబితే ఎవరూ మిమ్మల్ని నమ్మరు. ప్రజలు ఇలా అంటారు: 'ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన యౌవన మంతా మీ మధ్యే జీవించారు. ఆ సమయంలో మీరు ఆయనను మీలో అత్యంత నీతిమంతుడు, అత్యంత సత్యవంతుడు, అత్యంత విశ్వసనీయుడు అని భావించేవారు. ఆయన కణతల వద్ద వెంట్రుకలు తెల్లబడడం ప్రారంభమైన తరువాత, ఆయన మీకు తీసుకు వచ్చిన బోధనలను, అంటే ఇస్లాం బోధనలను ప్రకటించినప్పుడు, మీరు అకస్మాత్తుగా ఆయనను అబద్ధాలకోరు అని చెప్పడం ప్రారంభించారు. అల్లాహ్ సాక్షిగా చెప్పుతున్నాను! ఇలాంటి పరిస్థితిలో ఆయనను అబద్ధాలకోరు అని చెప్పడం అసాధ్యం.'"

ఆ వ్యక్తి చెప్పిన మాటలు విన్న తర్వాత వారందరూ తమ తప్పును ఒప్పుకొని, మరో అభ్యంతరాన్ని వెతకడం ప్రారంభించారు. ఆ వ్యక్తి ఎంత సత్యమైన మాట చెప్పాడో గమనించండి. వారు ఇంతకు ముందెప్పుడైనా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అబద్ధాలకోరుగా పేర్కొని ఉంటే, ఎవరో ఒకరు దానిని నమ్మి ఉండేవారు. కానీ జీవితమంతా ప్రవక్త (స)ను సత్యవంతుడు అని పిలిచిన వారు, ఒక్కసారిగా వారు అబద్ధాలకోరు అని చేసిన ఆరోపణను ప్రజలు ఎలా నమ్మగలరు?

అదేవిధంగా, హెరాక్లియస్ అబూ సుఫ్యాన్‌ను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి, "ఆయన ఎప్పుడైనా అబద్ధం చెప్పారా?" అని అడిగినప్పుడు, అబూ సుఫ్యాన్ ఇలా సమాధానమిచ్చాడు: "ఈ రోజు వరకు ఆయన ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు." తరువాత ఆయన చెప్పాడు, "'ఈ రోజు వరకు' అనే మాటలను నేను ఉద్దేశపూర్వకంగా చేర్చాను, భవిష్యత్తులో బహుశా ఆయన అబద్ధం చెప్పవచ్చనే సందేహం కొద్దిగా మిగలాలని."

అలాగే, ఒక సందర్భంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక కొండపైకి ఎక్కి ప్రజలను పిలిచారు. (ఈ సంఘటనను నేను ఇంతకుముందు కూడా ప్రస్తావించాను. ఇప్పుడు ప్రవక్త (స) సత్యతకు సంబంధించి చెబుతున్నాను.) ప్రజలందరూ ఏకమైన తరువాత వారు (స) ఇలా అడిగారు: "నేను మీకు, 'అముక లోయలో ఒక సైన్యం దాగిఉన్నది, మీపై దాడి చేయడానికి సిద్ధంగా ఉంది' అని చెబితే, మీరు నన్ను నమ్ముతారా?" వారు వెంటనే, "అవును, మేము మిమ్మల్ని నమ్ముతాము" అని సమాధాన మిచ్చారు. నిజానికి, మక్కాకు అతి సమీపంలో ఒక పెద్ద సైన్యం ప్రజలకు తెలియకుండా చేరుకోవడం అసాధ్యమైన విషయం.

అయినప్పటికీ, అలాంటి అసాధ్యంగా కనిపించే విషయాన్ని కూడా ప్రవక్త (స) నోటి నుండి విన్నంత మాత్రాన నమ్మడానికి వారు సిద్ధపడటం, ప్రవక్త (స) సత్యతపై వారికి ఎంత అచంచలమైన విశ్వాసం ఉందో తెలియజేస్తుంది. వారు (స) ఎప్పటికీ అబద్ధం చెప్పరని, ఎవరినీ మోసం చేయరని వారు గట్టిగా నమ్మేవారు.

ఈ విషయాన్ని ఇంకా వివరిస్తూ, హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజియల్లాహు అన్హు) ఇలా పేర్కొన్నారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)లో ఏమి ఉండేది, అది వారి శత్రువులను కూడా ప్రభావితం చేసింది? మొదట్లో వారిని ప్రభావితం చేసింది పవిత్ర ఖుర్‌ఆన్ కాదు. (ఖుర్‌ఆన్ బోధనలు విన్న వెంటనే వారు వాటిని అనుసరించలేదు లేదా వారిని అనుసరించడానికి సిద్ధపడలేదు.) వారిని ప్రభావితం చేసింది హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి గత జీవితం. ప్రవక్త (స) వారి మధ్యే జీవించారు. వారి నిజాయితీ, సత్యత, మానవజాతిపై వారికి ఉన్న కరుణ, త్యాగస్ఫూర్తి, ఇవన్నీ వారు ప్రత్యక్షంగా చూశారు. ఇవే వారి హృదయాలను ప్రభావితం చేశాయి.

ప్రవక్తగా ప్రకటించబడక ముందు, అల్లాహ్ నుండి ఆజ్ఞ రానందున,

వారు (స) ప్రజలను బహిరంగంగా బహుదైవారాధనను విడనాడమని ఆదేశించలేదు. అలా అని ప్రవక్త (స) స్వయంగా ఎన్నడూ విగ్రహారాధకుడు కాదు. వారి (స) ఉన్నతమైన నడవడిక, ఆదర్శప్రాయమైన జీవనశైలి ప్రజలపై లోతైన ప్రభావం చూపింది. ఈ ప్రభావం వారి హృదయాలలో నిశ్శబ్దంగా పనిచేస్తూనే ఉండేది. వారి నీతి మంతమైన జీవితం, ఆదర్శప్రాయమైన నడవడిక, ఉన్నతమైన శీలం ప్రజలను తప్పకుండా ప్రభావితం చేశాయి. అందువల్ల, వారు ప్రవక్త (స)కు వ్యతిరేకంగా తలెత్తి నిలబడలేక పోయారు."

ఇంతకు ముందు చెప్పినట్లే, వారు (స) మక్కాలోని ఒక కొండపైకి ఎక్కి ప్రజలను పిలిచి ఇలా అడిగారు: "నేను మీకు, 'ఒక పెద్ద సైన్యం మీ వైపుకు వస్తోంది' అని చెబితే, మీరు నన్ను నమ్ముతారా?" అది అసాధ్యమైన విషయమే అయినప్పటికీ, ప్రజలు ఇలా సమాధానమిచ్చారు: "అవును, మేము మిమ్మల్ని నమ్ముతాము."

వారు అలా చెప్పడానికి కారణం, వారు (స) ఎప్పుడూ అబద్ధం చెప్పలేదని వారికి బాగా తెలుసు. వారు ఇలా అన్నారు: "మేము మీ నోటి నుండి ఎప్పుడూ ఒక్క అబద్ధమూ వినలేదు. మీరు ఎల్లప్పుడూ విశ్వసనీయులుగా, సత్యవంతులుగా ఉన్నారు. కాబట్టి, మీరు ఇది కూడా చెబితే మేము దానిని నమ్ముతాము."

తరువాత ప్రవక్త (స) ఇలా అన్నారు: "అలా అయితే, నేను మీకు ఇంకొక సత్యాన్ని చెబుతున్నాను. ఆ సత్యం ఏమిటంటే, దేవుడు ఒక్కడే. ఆయనకు భాగస్వాములను కల్పించడం (షిర్క్ చేయడం) మహాపాపం. కాబట్టి, ఏకేశ్వరుడైన అల్లామ్‌ను ఆరాధించండి మరియు షిర్క్‌ను విడిచిపెట్టండి. లేకపోతే, మీపై శిక్ష అవతరిస్తుంది."

ఈ ప్రకటన వారిపై అదే విధంగా ప్రభావం చూపలేదు. అయితే వారి (స) జీవితం వారిని ప్రభావితం చేసింది; వారి (స) కార్యాలు, వారి (స) సత్యత, ధర్మపరాయణత, సద్గుణాలు వారిపై గాఢమైన ప్రభావాన్ని చూపించాయి. కానీ ఈ వాదనను వారి ముందుంచినప్పుడు వారు దానిని అంగీకరించలేదు; దానిని తిరస్కరించారు.

కాబట్టి అసలు విషయం ఏమిటంటే, ఒక వ్యక్తి యొక్క ఆదర్శ జీవితం మరియు ప్రవర్తన ప్రజలను ప్రభావితం చేసే విధంగా ఉండాలి. అది జరిగినప్పుడు, ఏదో ఒక సమయంలో అల్లాహ్ సర్వశక్తిమంతుడు దైవప్రచారానికి మార్గాలు తెరుచుకునే విధంగా పరిస్థితులను సృష్టిస్తాడు. ఫలితముగా అప్పటివరకు ప్రత్యర్థులుగా ఉన్న వారే ఇస్లాం మతంను స్వీకరించి, ఇస్లాం యొక్క నిజమైన బోధనలను అర్థం చేసుకోవడం ప్రారంభిస్తారు."

**(ఖుత్బాత్-ఎ-మహ్మూద్, సంపుటి 7, పుటలు 374--375)**

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు:

"సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మన ప్రియతమ నాయకులు, సజ్జనులలో శ్రేష్ఠులైన దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి అనేక రకాల దైవసహాయం ద్వారా విజయం మరియు మద్దతును ప్రసాదించాడు. ప్రారంభంలో మూసా (అలైహిస్సలాం), ఈసా (అలైహిస్సలాం)ల మాదిరిగానే వారు (స) కూడా హిజ్రత్ (వలస) అనే పరీక్షను ఎదుర్కొనవలసి వచ్చింది. అయితే అదే హిజ్రత్‌లో విజయం మరియు గెలుపు యొక్క ఫలాలు దాగి ఉన్నాయి.

"కాబట్టి, ఓ మిత్రులారా! ఒక నీతిమంతుడు ఎన్నడూ నాశనం కాడు అనే విషయాన్ని నిశ్చయంగా గ్రహించండి. రెండు వర్గాలు ఒకదానికొకటి శత్రువులై, తమ శత్రుత్వాన్ని భయానక స్థితికి తీసుకెళ్లినప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దృష్టిలో నీతిమంతమైన మరియు దేవునికి భయపడే వర్గానికే పరలోకం నుండి సహాయం లభిస్తుంది. ఈ విధంగా దైవ నిర్ణయం ద్వారా మతపరమైన వివాదాలు చివరికి పరిష్కరించబడతాయి. (మతపరమైన వివాదాలకు తీర్పు వెలువడుతుంది.)

"ఒక్కసారి ఆలోచించండి! మన ప్రియతమ నాయకులైన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మక్కాలో మొదట బలహీన స్థితిలో ప్రత్యక్షమయ్యారు. ఆ సమయంలో అబూజహల్ వంటి అవిశ్వాసులు తమ శక్తి సామర్థ్యములతో ఉన్నారు. లక్షలాది మంది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి ప్రాణాంతక శత్రువులుగా మారారు. కాని చివరికి మన దైవ ప్రవక్తకు విజయం, సఫలతను ప్రసాదించింది ఏమిటి? నిశ్చయంగా తెలుసుకోండి!. వారి (స) గారి సత్యత, చిత్తశుద్ధి, హృదయ పవిత్రత, నిజాయితీయే ఈ విజయాలకు కారణమయ్యాయి."

**(రాజ్-ఎ-హఖీకత్, రూహానీ ఖజాయిన్, సంపుటి 14, పుటలు 155-156)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇంకా ఇలా పేర్కొన్నారు:

"అల్లాహ్ తఆలా మన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఉద్దేశించి ఇలా అన్నాడు : **ఇన్నక ల అలా ఖుల్కిన్** అజీమ్ అనగా 'నిశ్చయంగా నీవు అత్యున్నత నైతిక గుణాలను కలిగివున్నావు.' దీని అర్థం ఏమిటంటే, ఔదార్యం, ధైర్యం, న్యాయం, కరుణ, దయ, సత్యత, సహనం వంటి అన్ని శ్రేష్ఠమైన గుణాలు నీలో సమగ్రంగా నిక్షిప్తమై ఉన్నాయి. సంక్షిప్తంగా చెప్పాలంటే, మానవ హృదయంలో ఉన్న అన్ని సహజ లక్షణాలు అనగా మర్యాద, వినయం, నిజాయితీ, ఉన్నతత్వం, గౌరవం, స్థిరత్వం, పవిత్రత, సంయమనం, మితాహారం, ఇతరుల పట్ల సానుభూతి (అనగా కరుణ), అలాగే ధైర్యం, ఔదార్యం, క్షమ, ఓర్పు, ఉపకారభావం, సత్యత, విశ్వాసపాత్రత మొదలైనవి, వివేకం మరియు జ్ఞానంతో సరైన సందర్భంలో, సరైన విధంగా వ్యక్తమైతే, వాటి సమాహారాన్నే అఖ్లాఖ్ (ఉన్నత నైతిక గుణాలు) అని అంటారు."

**(ఇస్లామీ ఉసూల్ కీ ఫిలాసఫీ, రూహానీ ఖజాయిన్, సంపుటి 10, పుట 333)**

కాబట్టి, మంచి నైతిక గుణాలు అంటే కేవలం మర్యాదగా పలకరించడం లేదా నమస్కారం చేయడం మాత్రమే కాదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఆదర్శాన్ని అనుసరించి, నిజమైన నైతిక ఉన్నతత్వం అనేది అన్ని సద్గుణాలను జీవితంలో ఆచరించడం మరియు ప్రతి వ్యక్తితో ప్రతి సందర్భంలో సముచితంగా వ్యవహరించడం. మన దృష్టి దీనిపైనే కేంద్రీకృతం కావాలి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ ప్రపంచంలో సత్యాన్ని వ్యాప్తి చేయడానికి వచ్చారు. అందువల్ల, వివిధ సందర్భాలలో వారి(స)ని విశ్వసించిన వారిని కూడా సత్యంపై స్థిరంగా ఉండమని బోధించారు.

ఒక హదీస్‌లో, హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి.) ఇలా ఉల్లేఖించారు: అల్లాహ్ ప్రవక్త (స) ఇలా అన్నారు:

"మీరు ఎల్లప్పుడూ సత్యాన్ని పాటించండి. ఎందుకంటే సత్యం ధర్మబద్ధతకు దారితీస్తుంది. ధర్మబద్ధత స్వర్గానికి దారితీస్తుంది. ఒక వ్యక్తి ఎల్లప్పుడూ సత్యమే మాట్లాడుతూ, సత్యాన్నే అనుసరించడానికి కృషి చేస్తూ ఉంటే, చివరకు అల్లాహ్ దృష్టిలో అతను 'సిద్ధీఖ్' (సత్యవంతుడు)గా నమోదు చేయబడతాడు. అలాగే అసత్యానికి దూరంగా ఉండండి. ఎందుకంటే అసత్యం దుష్టత్వానికి దారితీస్తుంది; దుష్టత్వం నరకాగ్నికి దారితీస్తుంది. ఒక వ్యక్తి ఎల్లప్పుడూ అబద్ధాలు చెబుతూ, వాటినే కొనసాగిస్తూ ఉంటే, చివరకు అల్లాహ్ దృష్టిలో అతను అబద్ధకోరుడిగా నమోదు చేయబడతాడు. అలాంటి వ్యక్తి నరకాగ్నికి అర్హుడవుతాడు."

కాబట్టి ప్రతి ఒక్కరూ ఈ బోధనను ఎంతో గంభీరంగా తీసుకోవాలి.

(జామిఉత్తిర్మిజీ, కితాబుల్ బిర్రి వస్ సిలహ్, హదీస్ 1971)

మరొక హదీస్‌లో, హజ్రత్ అబ్దుల్లా (రజి.) ఇలా పేర్కొన్నారు. దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు:

"ఏ పరిస్థితిలోనూ అబద్ధం చెప్పడం అనుమతించబడదు. అది గంభీరమైన విషయమైనా, సరదాగా చెప్పినా. కొందరు తాము సరదాగా అబద్ధం చెప్పామని అంటారు. కానీ సరదాగా చెప్పిన కూడా అబద్ధం అనుమతించబడదు. అలాగే, ఒక వ్యక్తి తన పిల్లవాడికి ఏదైనా వాగ్దానం చేసి, దాన్ని నెరవేర్చకపోవడం కూడా సమంజసం కాదు. సత్యం ధర్మబద్ధతకు దారితీస్తుంది. ధర్మబద్ధత స్వర్గానికి దారితీస్తుంది. నిస్సందేహంగా అబద్ధం చెడుకు దారితీస్తుంది. చెడు నరకాగ్నికి దారితీస్తుంది. సత్యవంతుడి గురించి 'అతను సత్యం చెప్పాడు, మంచి చేశాడు' అని చెప్పబడుతుంది. అబద్ధకోరుడి గురించి 'అతను అబద్ధం చెప్పాడు, చెడు చేశాడు' అని చెప్పబడుతుంది." (అల్‌జామిఅ లి షుఅబిల్ ఇమాన్, ఇమామ్ బైహఖీ, సంపుటి 6, హదీస్ 4453, పుట 441)

సూరహ్ అత్-తౌబా, ఆయత్ 119లో అల్లాహ్ ఇలా ఆజ్ఞాపించాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللهَ وَكُونُوا مَعَ الصَّادِقِينَ అనగా: "ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి మరియు సత్యవంతుల సహవాసంలో ఉండండి."

ఈ సూక్తి వివరణలో అల్లామా రాజీ ఒక సంఘటనను ప్రస్తావించారు. ఒక వ్యక్తి దైవ ప్రవక్త (స) వద్దకు వచ్చి ఇలా అన్నాడు:

"ఓ అల్లాహ్ ప్రవక్తా! నేను చెడు పనులను విడిచిపెట్టాలనుకుంటున్నాను. కానీ నాకు మద్యపానం, వ్యభిచారం, దొంగతనం, అబద్ధం చెప్పడం వంటి అలవాట్లు బలంగా ఉన్నాయి. ప్రజలు మీరు వీటన్నింటినీ నిషేధించారని చెబుతున్నారు. నేను మిమ్మల్ని విశ్వసించాలనుకుంటున్నాను. కానీ ఈ చెడు అలవాట్లను అన్నింటిని ఒకేసారి వదిలివేయగల శక్తి నాలో లేదు. మీరు వీటిలో ఒకటి మాత్రమే విడిచి పెట్టమని అనుమతిస్తే, నేను ఇస్లాంను స్వీకరిస్తాను."

అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు:

"అయితే నీవు అబద్ధం చెప్పడం మానివేయి."

ఆ వ్యక్తి అంగీకరించి ఇస్లాంను స్వీకరించాడు.

ఆ తర్వాత ఒక రోజు అతనికి మద్యం త్రాగే అవకాశం వచ్చింది. కానీ అతను ఇలా ఆలోచించాడు: "నేను మద్యం తాగితే, తర్వాత ప్రవక్త (స) నన్ను అడిగితే, నేను అబద్ధం చెప్పాలి లేదా నిజం చెప్పి శిక్షను ఎదుర్కోవాలి. నేను అబద్ధం చెప్పనని మాట ఇచ్చాను." అందువల్ల అతను మద్యం తాగలేదు. ఆ తర్వాత అతనికి వ్యభిచారం చేసే అవకాశం వచ్చింది. మళ్లీ అదే విధంగా ఆలోచించి దానిని కూడా వదిలివేశాడు. దొంగతనం విషయంలో కూడా అదే జరిగింది. చివరకు అతను పవిత్ర ప్రవక్త (స.అ.వ.) వద్దకు తిరిగి వచ్చి ఇలా అన్నాడు: "మీరు నాకు ఇచ్చిన ఆదేశం ఎంత గొప్పదో ఇప్పుడు అర్థమైంది. మీరు నన్ను అబద్ధం నుండి మాత్రమే నిషేధించినప్పుడు, మిగతా అన్ని పాపాల ద్వారాలు కూడా నాకు మూసుకుపోయాయి." ఆ తరువాత అతను తన అన్ని చెడు అలవాట్లనుండి మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడి, వాటిని పూర్తిగా విడిచిపెట్టాడు.

(అత్తఫ్సీరుల్ కబీర్, ఇమామ్ రాజీ, సంపుటి 16, దారుల్ ఫికర్ బీరూట్, 1981, పుట 227)

హజ్రత్ అబూబకర్ (రజి) ఇస్లాంను స్వీకరించిన సందర్భం గురించి, విశ్వాసుల తల్లి హజ్రత్ ఉమ్మే సలమా (రజి) ఇలా వివరించారు:

హజ్రత్ అబూ బకర్ సిద్దీఖ్ (రజి) దైవ ప్రవక్త ముహమ్మద్ (స) గారి అత్యంత సన్నిహితుడు మరియు నిష్కపటమైన స్నేహితుడు. అల్లాహ్ తఆలా దైవ ప్రవక్త (స) గారిని ప్రవక్తగా నియమించిన తరువాత, ఖురైష్ నాయకులు హజ్రత్ అబూబకర్ (రజి) వద్దకు వచ్చి, "నీ స్నేహితుడు పిచ్చివాడయ్యాడు (నవూజు బిల్లాహ్)" అని అన్నారు. దానికి హజ్రత్ అబూబకర్ (రజి) "ఏమైంది?" అని అడిగారు. వారు, "అతడు పవిత్ర కాబా (మస్జిదుల్ హరామ్)లో ప్రజలను ఏకదైవారాధన (తౌహీద్) వైపు పిలుస్తూ, తాను అల్లాహ్ ప్రవక్తనని ప్రకటిస్తున్నాడు" అని చెప్పారు. అప్పుడు హజ్రత్ అబూ బకర్ (రజి) "అతడు నిజంగానే అలా చెప్పాడా?" అని అడిగారు. వారు "అవును, అతడు మస్జిదుల్ హరామ్‌లో ఇదే ప్రకటిస్తున్నాడు" అని సమాధానమిచ్చారు. దాంతో హజ్రత్ అబూబకర్ (రజి) వెంటనే దైవ ప్రవక్త (స) గారి ఇంటికి వెళ్లి, తలుపు తట్టి బయటకు రావాలని కోరారు. ప్రవక్త (స) బయటకు వచ్చిన తరువాత, హజ్రత్ అబూ బకర్ (రజి) ఇలా అడిగారు: "ఓ అబుల్ ఖాసిం! మీ గురించి నేను విన్నది నిజమేనా?" దైవ ప్రవక్త (స) ప్రత్యుత్తరంగా, "ఓ అబూబకర్! నీవు నా గురించి ఏమి విన్నావు?" అని అడిగారు. హజ్రత్ అబూ బకర్ (రజి) ఇలా అన్నారు: "మీరు ప్రజలను అల్లాహ్ ఏకత్వం వైపు పిలుస్తున్నారని, అలాగే మీరు అల్లాహ్ ప్రవక్తనని విన్నాను." అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అవును, ఓ అబూ బకర్! నా ప్రభువైన మహోన్నతుడూ మహిమాన్వితుడూ అయిన అల్లాహ్ నన్ను శుభవార్త అందించే వాడిగా, హెచ్చరించే వాడిగా నియమించాడు. ఆయన నన్ను ఇబ్రాహీం (అ) చేసిన ప్రార్థనకు పరిపూర్ణతగా చేశాడు మరియు సమస్త మానవాళి కొరకు నన్ను పంపించాడు."

అందుకు హజ్రత్ అబూబకర్ (రజి) ఇలా సమాధానమిచ్చారు:

"అల్లాహ్ ప్రమాణం! నేను మిమ్మల్ని ఎప్పుడూ అసత్యం చెప్పిన వారిగా చూడలేదు. మీ నిజాయితీ, ఉన్నతమైన నైతిక గుణాలు, బంధుత్వ సంబంధాలను కాపాడడం, మరియు మీ సత్కార్యాల కారణంగా మీరు ప్రవక్తత్వానికి అత్యంత అర్హులు. మీ చేయి చాపండి, నేను మీ బైఅత్ (విధేయతా ప్రతిజ్ఞ) చేస్తాను."

అప్పుడు దైవ ప్రవక్త (స) తన చేయి చాపగా, హజ్రత్ అబూబకర్ (రజి) ప్రవక్త (స) చేతిపై బైఅత్ చేసి, వారి సత్యాన్ని అంగీకరించి, వారు తీసుకువచ్చిన బోధనే సత్యమని సాక్ష్యమిచ్చారు. అల్లాహ్ ప్రమాణం! దైవ ప్రవక్త (స) ఇస్లాం వైపు పిలిచినప్పుడు, హజ్రత్ అబూబకర్ (రజి) ఏమాత్రం ఆలస్యం చేయలేదు, సందేహించలేదు. (రియాజున్నజ్రత్ అనువాదం, సంపుటి 1, పుటలు 154-156 చిష్తీ కుతుబ్ ఖానా, లాహోర్, 2017)

ఈ విషయమై హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు:

"దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ప్రవక్తత్వాన్ని ప్రకటించిన సమయంలో, హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) సిరియా దేశానికి ప్రయాణం చేశారు. తిరిగి వస్తున్నప్పుడు మార్గమధ్యంలో ఒక వ్యక్తిని కలుసుకున్నారు. హజ్రత్ అబూబకర్ (రజి) అతనిని మక్కా పరిస్థితుల గురించి, అక్కడ ఏవైనా తాజా వార్తలు ఉన్నాయా అని అడిగారు. సాధారణంగా, ఒక వ్యక్తి ప్రయాణం ముగించుకొని తిరిగి వచ్చినప్పుడు, తన స్వదేశ పరిస్థితుల గురించి తెలుసుకోవాలని కోరుకుంటాడు. ఆ వ్యక్తి ఇలా చెప్పాడు: 'కొత్త విషయం ఏమిటంటే, మీ స్నేహితుడు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తాను ప్రవక్తనని ప్రకటించాడు.' ఇది విన్న వెంటనే హజ్రత్ అబూబకర్ (రజి) ఇలా అన్నారు:

'అతడు అలాంటి ప్రకటన చేసి ఉంటే, అది తప్పకుండా సత్యమే.'

ఇది హజ్రత్ అబూబకర్ (రజి) దైవ ప్రవక్త (స) గురించి ఎంత ఉన్నతమైన అభిప్రాయం కలిగి ఉన్నారో తెలియజేస్తుంది. వారికి ఎలాంటి అద్భుతం (ముఅజిజా) చూడాలనే అవసరం అనిపించలేదు.

వాస్తవానికి, ఒక ప్రవక్తగా ప్రకటించుకున్న వ్యక్తి గురించి తెలియని వారు లేదా అతనితో సంబంధం లేని వారే తమ మనసుకు నమ్మకం కలగడానికి అద్భుతం కోరుతారు. కానీ ఎలాంటి అభ్యంతరం లేని వ్యక్తికి అద్భుతం అవసరమేంటి?

సంక్షిప్తంగా చెప్పాలంటే, హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) మక్కాకు చేరుకునే ముందే దైవ ప్రవక్త (స)పై తన విశ్వాసాన్ని ప్రకటించారు.వారు (రజి) మక్కాకు చేరుకున్న తరువాత దైవ ప్రవక్త (స) సమక్షానికి వెళ్లి, 'మీరు ప్రవక్తనని ప్రకటించారా?' అని అడిగారు. అందుకు దైవ ప్రవక్త (స.అ.వ.) 'అవును, అది నిజమే' అని సమాధానమిచ్చారు. అప్పుడు హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) ఇలా అన్నారు:

'మీరు సత్యవంతులని ధృవీకరించిన వారిలో నేను మొదటివాడినని సాక్షిగా ఉండండి." (మల్ఫూజాత్, భాగం 1, పుట 337, 2022)

అనంతరం, మరో సందర్భంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఈ విషయాన్ని ఈ విధంగా వివరించారు:

"ప్రారంభంలోనే ఈ సందేశాన్ని స్వీకరించడం నిజంగా ఒక మహా భాగ్యం. ఎందుకంటే తొలి దశలో దీనిని స్వీకరించని వ్యక్తికి వాస్తవమైన ఎలాంటి విశిష్టతా లేదా గొప్పతనమూ ఉండదు. (సందేశాన్ని విని వెంటనే అంగీకరించి, ప్రారంభంలోనే బైఅత్ చేసే వ్యక్తి నిజంగా ప్రశంసనీయుడు, సహజంగా ధన్యుడు. కానీ తప్పించుకునే ప్రయత్నాలు చేస్తూ, వాదోపవాదాల్లో కాలం గడిపే వ్యక్తికి ఎలాంటి ప్రత్యేకతా, సద్గుణమూ ఉండదు.) అయితే, స్వయంగా అల్లాహ్ ఈ విషయాన్ని స్పష్టంగా ప్రత్యక్షం చేసినప్పుడు, రాళ్లు, చెట్లు కూడా సాక్ష్యమివ్వడం ప్రారంభిస్తాయి. (అంటే, విషయం పూర్తిగా స్పష్టమై, దైవిక సూచనలు ప్రత్యక్షమైనప్పుడు, ఆ సత్యాన్ని దాదాపు అందరూ అంగీకరించడం ప్రారంభిస్తారు.) అయితే, నిజమైన గొప్పతనం ఆరంభంలోనే దీనిని అంగీకరించిన వ్యక్తిది. హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) చేసినట్లుగా. వారు ఎలాంటి అద్భుతాన్ని కోరలేదు. అంతేకాక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి పవిత్ర వచనాల ద్వారా ఈ ప్రకటనను నేరుగా వినకముందే, వారు (రజి) విశ్వసించారు."

తదనంతరం, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) మొత్తం సంఘటనను వివరిస్తూ ఇలా తెలిపారు: హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) ఒక వ్యాపార ప్రయాణానికి వెళ్లారు. మార్గమధ్యంలో ఆయన ఒక వ్యక్తిని కలుసుకుని, తాజా వార్తల గురించి అడిగారు. ఆ వ్యక్తి, "మీ స్నేహితుడు ప్రవక్తనని ప్రకటించారు" అని చెప్పాడు. ఇది విన్న వెంటనే హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: "వారు ప్రవక్తనని ప్రకటించి ఉంటే, నిశ్చయంగా వారు సత్యవంతుడే."

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)మరల ఇలా పేర్కొన్నారు:

"హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) ఎలాంటి సూచన గానీ, అద్భుతం గానీ కోరలేదు. కేవలం ఈ వార్త విన్న వెంటనే విశ్వసించారు అనే విషయాన్ని లోతుగా ఆలోచించండి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నుండి నేరుగా కూడా వారు (రజి) ఈ ప్రకటనను వినలేదు. మరొకరి ద్వారా మాత్రమే విన్నప్పటికీ, వెంటనే దానిని అంగీకరించారు. ఎంత అసాధారణమైన విశ్వాసమది! దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో సంబంధం ఉన్న ఈ వార్తను విన్న వెంటనే, అందులో అసత్యానికి ఏమాత్రం అవకాశం లేదని వారు నిశ్చయించుకున్నారు. ఎందుకంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎన్నడూ అసత్యం పలకరని వారికి బాగా తెలుసు. గమనించండి, హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) ఎలాంటి సూచనను కోరలేదు. అందుకే ఆయనకు 'సిద్దీఖ్' (సత్యనిష్ఠలో పరిపూర్ణుడు) అనే బిరుదు లభించింది. వారి ముఖాన్ని ఒక్కసారి చూడగానే, వారు అసత్యవాది కాలేరని గుర్తించారు. అందువల్ల, సత్యవంతులను గుర్తించడం, వారిని అంగీకరించడం కష్టం కాదు. ఎందుకంటే వారి సత్యానికి సంబంధించిన సూచనలు స్పష్టంగా ప్రత్యక్షమై ఉంటాయి." (మల్ఫూజాత్ , సంపుటి 4, పుటలు 122-123, 2022)

ఈ విషయానికి సంబంధించి, ఒక సందర్భంలో హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజియల్లాహు అన్హు) ఇలా పేర్కొన్నారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవక్తత్వాన్ని ప్రకటించిన తొలి క్షణంలోనే హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) ఇచ్చిన సాక్ష్యాన్ని నేను ఎన్నటికీ విస్మరించలేను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దైవిక పిలుపును విని, ఈ సందేశాన్ని ప్రపంచమంతా వ్యతిరేకిస్తుందని గ్రహించినప్పుడు, 'ఖదీజా! నా ప్రాణానికి ప్రమాదం కలుగుతుందేమోనని నాకు భయంగా ఉంది' అని అన్నారు. దానికి ఆమె ఇలా సమాధానమిచ్చారు: 'సంతోషించండి! అల్లాహ్ ప్రమాణంగా చెబుతున్నాను, ఆయన మిమ్మల్ని ఎన్నటికీ అవమానపరచడు.' హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) మరల ఇలా అన్నారు: 'ప్రజలు ఏమి చెప్పినా, మీరు ధైర్యంగా ఉండండి. ఇది నిజమైతే, అల్లాహ్ మిమ్మల్ని ఎన్నటికీ అవమానించడు. ఎందుకంటే మీరు ఎల్లప్పుడూ బంధుత్వాలను కాపాడుతారు, సత్యమే మాట్లాడుతారు, కష్టాల్లో ఉన్నవారి భారాన్ని మోస్తారు, నిరుపేదలకు సహాయం చేస్తారు, అతిథులను గౌరవంగా ఆదరిస్తారు, మరియు ప్రతి మంచి కార్యంలో సహకరిస్తారు.'"

హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: "55 సంవత్సరాల వయస్సు గల ఒక మహిళ ఇచ్చిన ఈ సాక్ష్యాన్ని గురించి ఆలోచించండి. ఆమె, ప్రవక్త (స) ఒకే పట్టణానికి చెందిన వారు, ఒకే దేశానికి చెందిన వారు, అంతేకాక 15 సంవత్సరాలుగా ప్రవక్త (స) భార్యగా జీవించారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తీవ్ర విచారంలో, ఆందోళనలో ఉన్న ఆ సమయంలో హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) ఇచ్చిన ఈ సాక్ష్యం ఎంతో లోతుగా పరిశీలించదగినది. ఈ గుణాలు నిజంగా వారిలో లేకపోయి ఉంటే, ఆమె మాటలు వారికి ఎన్నటికీ ఓదార్పుగా ఉండేవి కావు."

(ఇర్షాదాత్-ఎ-నూర్, సంపుటి 2, పుటలు 330-331, అనుబంధం)

అవిశ్వాసులు విధించిన షోఅబ్ అబీ తాలిబ్ బహిష్కరణ కాలంలో, ఆ బహిష్కరణ మూడవ సంవత్సరం సమీపిస్తున్నప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ద్వారా తెలియజేయబడిన విషయాన్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన పిన్నాన్న గారైన అబూ తాలిబ్‌కు తెలిపారు. బను హాశిమ్‌పై విధించిన బహిష్కరణ ఒప్పంద పత్రం కాబాలో వేలాడదీసి ఉంచబడింది. దానిని చెదపురుగులు పూర్తిగా తినివేశాయని, అయితే అందులో అల్లాహ్ పేరు ఉన్న భాగాన్ని మాత్రం తాకలేదని ప్రవక్త (స) చెప్పారు. దైవ ప్రవక్త (స) మాటలపై అబూతాలిబ్‌కు ఎంతటి దృఢ విశ్వాసమో, వారు తన సోదరులతో ఇలా అన్నాడు: "అల్లాహ్ ప్రమాణం! ముహమ్మద్ (స) నాతో ఎప్పుడూ అసత్యం చెప్పలేదు." ఆ తరువాత ఆయన తన సోదరులతో కలిసి ఖురైష్ నాయకుల వద్దకు వెళ్లి ఇలా అన్నాడు: "నా సోదరుడి కుమారుడు

నాకు ఎన్నడూ అబద్ధం చెప్పని వాడు. అల్లాహ్ మీ పత్రంపై చెదపురుగులను పంపాడని, అవి అల్లాహ్ పేరు ఉన్న భాగాన్ని తప్ప మిగిలినదంతా తినివేశాయని నాకు తెలిపాడు. నా సోదరుడి కుమారుడు చెప్పింది నిజమని తేలితే, మీరు బహిష్కరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. కానీ అతను అబద్ధం చెప్పినట్టు తేలితే, నేను అతన్ని మీకు అప్పగిస్తాను. అప్పుడు మీరు మీ ఇష్టానుసారం అతన్ని చంపినా, వదిలిపెట్టినా నాకు అభ్యంతరం లేదు." దానికి వారు, "ఇది న్యాయమైన ప్రతిపాదనే" అని సమాధానమిచ్చారు. అనంతరం ఆ పత్రాన్ని పరిశీలించగా, దైవ ప్రవక్త (స) చెప్పినట్లుగానే అది కనిపించింది. ఫలితంగా ఖురైష్ ప్రజల ముందు అవమానానికి గురయ్యారు.

(అల్‌వఫా బి అహ్వాలుల్ ముస్తఫా, భాగం 1, పుటలు 315-316 అల్ ముఅస్సతతుల్ సయీుదియా, రియాజ్)

ఒక సందర్భంలో, ఖురైష్ తమ నాయకులలో ఒకరైన ఉత్బాను దైవ ప్రవక్త (స) వద్దకు ప్రతినిధిగా పంపారు. అతడు ఇలా అన్నాడు: "మీరు మా దేవతలను ఎందుకు దూషిస్తున్నారు? మా పూర్వీకులు మార్గభ్రష్టులని ఎందుకు అంటున్నారు? మీకు ఏది కావాలన్నా మేము ఇస్తాము. మీరు చేయాల్సిందల్లా ఈ మాటలు చెప్పడం మానేయడమే." దైవ ప్రవక్త (స) అతని మాటలను ఓర్పుతో, మౌనంగా విన్నారు. ఉత్బా తన మాటలు ముగించిన తరువాత, ప్రవక్త (స) సూరహ్ హా మీమ్ అస్-సజ్దా (ఫుస్సిలత్) లోని కొన్ని సూక్తులను పారాయణం చేశారు. ప్రవక్త (స) "ఆద్ మరియు సమూద్ జాతులపై వచ్చిన శిక్షలాంటి శిక్ష గురించి నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను" అనే సూక్తి వరకు చేరుకోగానే, ఉత్బా వెంటనే, "చాలు, ఇది సరిపోతుంది" అని అడ్డుకున్నాడు. తిరిగి తన సహచరుల వద్దకు వెళ్లి ఖురైష్‌తో ఇలా అన్నాడు: "ముహమ్మద్ (స) మాట్లాడినప్పుడు వారు ఎన్నడూ అసత్యం పలకరని నాకు తెలుసు. అలాంటి శిక్ష మీపై కూడా వచ్చిపడుతుందేమోనని నేను భయపడుతున్నాను."

(సీరతుల్ హలబియ్యా, భాగం 1, పుటలు 428-429 దారుల్-కుతుబుల్-ఇల్మియ్యా, బీరూట్, 2002)

అబూజహల్ సాక్ష్యం కూడా ఉంది. హ్రజత్ అలీ (రజి.) ఇలా ఉల్లేఖించారు: అబూజహల్ దైవ ప్రవక్త (స)తో ఇలా అన్నాడు: "మేము మిమ్మల్ని అబద్ధికుడని అనడం లేదు. కానీ మీరు తీసుకువచ్చిన సందేశాన్ని, అంటే మీ ధర్మాన్ని, మేము తిరస్కరిస్తున్నాము." (జామిఉత్తిర్మిజీ, కితాబ్ తఫ్సీరుల్-ఖుర్ఆన్, హదీస్ 3064)

మరో ఉల్లేఖనంలో, బదర్ యుద్ధం జరిగిన రోజున అఖ్నస్ బిన్ షరీక్ అబూజహల్‌ను కలిసి ఇలా అడిగాడని పేర్కొనబడింది: "ఓ అబుల్ హకమ్! ఇక్కడ మన ఇద్దరం తప్ప మరెవరూ లేరు. నిజం చెప్పు!, ముహమ్మద్ (స) సత్యవాదా? లేక అబద్ధికుడా?" దానికి అబూజహల్ ఇలా జవాబిచ్చాడు: "అల్లాహ్ ప్రమాణం! ముహమ్మద్ (స) నిస్సందేహంగా సత్యవాది. ఆయన ఎప్పుడూ అబద్ధం చెప్పలేదు."

(షరహ్ అష్షిఫా, భాగం 1, పుటలు 303-304, దారుల్-కుతుబుల్-ఇల్మియ్యా, బీరూట్, 2001)

ఒక సందర్భంలో హ్రజత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి.) ఇలా పేర్కొన్నారు:

"దైవ ప్రవక్త (స) శత్రువులు తమ ప్రవక్త(స)ను గుర్తించలేక ఆయనను తిరస్కరించారా? ఆలోచించండి. నలభై సంవత్సరాల పాటు వారు అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (స)ను గమనించారు. వారి నైతిక గుణాలను, అలవాట్లను ప్రత్యక్షంగా చూశారు. తమ స్వంత సాక్ష్యంతోనే దైవ ప్రవక్త (స) అత్యంత సత్యవాది అని అంగీకరించారు. అయినప్పటికీ, అదే సత్యవంతుడు 'మీ మార్గదర్శనం కోసం దేవుడు నన్ను పంపాడు' అని ప్రకటించినప్పుడు, వారు ఆయనకు వ్యతిరేకంగా నిలబడ్డారు. ఒక అపరిచితుడు ఇలాంటి వాదన చేసి ఉంటే, అతనికి కొంతవరకు మన్నింపు ఇవ్వవచ్చు. ఎందుకంటే అతడు ప్రవక్త (స)ను చూడలేదు కాబట్టి, అల్లాహ్‌పై ఆయన అసత్య ఆరోపణ చేశాడని భావించి ఉండవచ్చు. కానీ మక్కా నివాసుల పరిస్థితి ఏమిటి? వారి ముందు దైవ ప్రవక్త (స) జీవితం ఒక తెరిచిన గ్రంథంలా స్పష్టంగా ఉండేది. అలాంటి వారు ప్రవక్త (స) ను మోసగాడిగా ఎలా ప్రకటించ గలిగారు? వారి హృదయాల్లో ప్రవక్త (స) సత్యవాదని బాగా తెలిసి ఉండి కూడా, ప్రవక్త(స)ను అబద్ధికుడని ఎలా పిలవగలిగారు?"

దైవ ప్రవక్త హ్రజత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారికి అబూజహల్ ఎంతటి ఘోర శత్రువో తెలిసిందే. (ఈ సాక్ష్యం ఇంతకు ముందు కూడా ప్రస్తావించబడింది.) అయినప్పటికీ, ఒక సందర్భంలో అతడే (హ్రజత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఉల్లేఖించిన ప్రకారం) ఇలా ఒప్పుకున్నాడు: "మేము మిమ్మల్ని అబద్ధికుడని అనడం లేదు. మీరు తీసుకువచ్చిన బోధనను మాత్రమే మేము తిరస్కరిస్తున్నాము." అందువల్ల, అబూజహల్ వంటి తీవ్రమైన ప్రత్యర్థి, దుష్ట స్వభావం కలిగిన వ్యక్తి హృదయం కూడా దైవ ప్రవక్త (స)ను అబద్ధికుడిగా ప్రకటించడానికి సిద్ధపడలేదు. వారిని అబద్ధికుడని పిలవాలనే ఆలోచనే అతని మనస్సాక్షిని గద్దించింది. అలాంటి నీచమైన కార్యం చేయాలనే భావనతో అతని హృదయం వణికిపోయింది. అందుకే, అతడు "నేను ప్రవక్త (స) బోధనను తిరస్కరిస్తున్నాను, కానీ ఆయనను అబద్ధికుడని అనడం లేదు" అనే సాకును ఆశ్రయించాడు. ఇది "పాపం కంటే దానికి చెప్పే సాకే మరింత చెడ్డది" అనే సామెతను గుర్తుచేస్తుంది. అయినప్పటికీ, ఇది దైవ ప్రవక్త (స) యొక్క సత్యత, నిజాయితీ వారి అత్యంత కఠినమైన శత్రువుల హృదయాల్లో కూడా ఎంత లోతుగా ముద్ర వేసిందో స్పష్టంగా తెలియజేస్తుంది.

"ఉమయ్యా బిన్ ఖలఫ్ కూడా ప్రవక్త (స)కు తీవ్రమైన శత్రువులలో ఒకడే. అయినప్పటికీ, ఒక సందర్భంలో అతని నోటి నుండి ఈ మాటలు వెలువడ్డాయి: 'దేవుని సాక్షిగా చెబుతున్నాను, ముహమ్మద్ (స) మాట్లాడినప్పుడు ఎల్లప్పుడూ సత్యమే మాట్లాడతారు. ఆయన ఎప్పుడూ అబద్ధం చెప్పరు.' నిజమైన మాయాజాలం అనేది ఎదుటి వారిని పూర్తిగా ఆకర్షించేదని అంటారు. మరి దైవ ప్రవక్త (స) యొక్క ఈ 'మహిమ' ఎంత గొప్పదంటే, ఆయన శత్రువులే ఆయన సత్యతను, నిజాయితీని అంగీకరించక తప్పలేదు."

(తఫ్సీర్-ఎ-కబీర్ , సంపుటి 8, పుటలు 363-364, 2023)

హ్రజత్ అబ్దుల్లా బిన్ సలామ్ (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) మదీనాకు విచ్చేసినప్పుడు, ప్రజలంతా వారిని సందర్శించడానికి పరుగెత్తారు. "అల్లాహ్ ప్రవక్త (స) వచ్చారు! అల్లాహ్ ప్రవక్త (స) వచ్చారు! అల్లాహ్ ప్రవక్త (స) వచ్చారు!" అని మూడు సార్లు ప్రకటించబడింది. ఆయన ఇంకా ఇలా తెలిపారు: "నేను కూడా ప్రజలతో కలిసి వారిని చూడటానికి వెళ్లాను. వారి ముఖాన్ని జాగ్రత్తగా పరిశీలించినప్పుడు, అది అబద్ధికుడి ముఖం కాదని వెంటనే గ్రహించాను. నేను వారి నోటి నుండి మొదటిసారిగా విన్న మాటలు ఇవి: 'ఓ ప్రజలారా! పరస్పరం శాంతి అభివాదం (సలాం) చేయడం అలవాటు చేసుకోండి. ఇతరులకు ఆహారం పెట్టండి. బంధుత్వ సంబంధాలను కొనసాగించండి. ప్రజలు నిద్రిస్తున్నప్పుడు రాత్రివేళ నమాజ్ ఆచరించండి. అప్పుడు మీరు శాంతితో స్వర్గంలో ప్రవేశిస్తారు.'"

(సునన్ ఇబ్న్ మాజా, కితాబుల్-అత్‌ఇమహ్, హదీస్ 3251)

మదీనాలోని యూదుల నుండి కూడా ఇలాంటి సాక్ష్యం లభిస్తుంది. ముస్లింలు మరియు బను ఖురైజా యూద తెగ మధ్య పరస్పర సహకార ఒప్పందం ఉండేది. అహ్జాబ్ యుద్ధ సమయంలో, బను నజీర్ నాయకుడు హుయయ్యీ బిన్ అఖ్తబ్, బను ఖురైజా నాయకుడు కఅబ్ బిన్ అసద్ ఖురజీ వద్దకు వెళ్లి, ముస్లింలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించి ఖురైష్ వారికి సహాయం చేయమని, తద్వారా ముస్లింలు ఓడిపోవాలని ప్రేరేపించాడు. ఆ సందర్భంలో, ముస్లింలకు ప్రత్యర్థి అయిన బను ఖురైజా నాయకుడు కఅబ్ బిన్ అసద్ ఇలా ప్రకటించాడు: "ముహమ్మద్ (స)తో నాకు ఒక ఒప్పందం ఉంది. నేను దానిని ఎప్పటికీ ఉల్లంఘించను. ఆయనలో నేను విశ్వాసపాత్రత, సత్యనిష్ఠ తప్ప మరేమీ చూడలేదు."

(అల్-బిదాయహ్ వల్-నిహాయహ్, సంపుటి 6, పుటలు 35-36దార్ హిజర్ లి తబాఅత్ వన్-నష్ర్, 1997)

అలాగే, ఉబైద్ బిన్ ఉమైర్ ఇలా వివరిస్తున్నారు: ఒక వ్యక్తి హ్రజత్ ఇబ్న్ ఉమర్ (రజి)ను ఇలా అడిగాడు: "అల్లాహ్ ప్రవక్త (స) ఇలా చెప్పినట్లు మీరు వినలేదా? 'నేను సరదాగా మాట్లాడుతాను. అయినప్పటికీ, సరదాలో కూడా సత్యం తప్ప మరేమీ మాట్లాడను.'" దానికి ఆయన "అవును, విన్నాను" అని సమాధానమిచ్చారు. (అల్-ముఅజముల్-కబీర్, అత్-తబరానీ, సంపుటి 12, పుట 391, హదీస్ 13443, మక్తబా ఇబ్న్ తైమియ్యా)

బహ్జ్ బిన్ హకీమ్ తన తాత ద్వారా ఇలా ఉల్లేఖించారు: అల్లాహ్ ప్రవక్త (స) ఇలా అన్నారు: "ప్రజలు నవ్వాలని ఉద్దేశించి అబద్ధం చెప్పే వ్యక్తికి వినాశనం కలుగుగాకా! అతనికి వినాశనం! అతనికి వినాశనం!"

అందువల్ల, అతి చిన్న అబద్ధాన్ని కూడా వారు కఠినంగా నిషేధించారు మరియు దానిపై తీవ్రమైన హెచ్చరిక జారీ చేశారు.

(సునన్ అబీ దావూద్, కితాబుల్ అదబ్, హదీస్ 4990)

**అహ్‌దీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:
**"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."**
(కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)*

**అహ్‌దీస్ బోధనలు**

**"ఒక మునల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.**
(మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb*

హజ్రత్ అబ్దుల్లా బిన్ అమర్ (రజి) ఇలా వివరిస్తున్నారు: "అల్లాహ్ ప్రవక్త (స) నుండి నేను ఏది విన్నానో, దానిని జ్ఞాపకంలో ఉంచుకోవాలనే ఉద్దేశంతో రాసుకునే వాడిని. అప్పుడు ఖురైష్ వారు నన్ను ఆపి, 'అల్లాహ్ ప్రవక్త (స) కూడా ఒక మనిషే కదా! వారు(స) కోపంలోనూ, సంతోషంలోనూ మాట్లాడుతారు. మరి మీరు ఆయన చెప్పిన ప్రతిదాన్ని రాస్తున్నారా?' అని అన్నారు. దాంతో నేను రాయడం మానేశాను. తరువాత ఈ విషయాన్ని ప్రవక్త (స)కు తెలియజేశాను. అప్పుడు వారు తన నోటివైపు వేలితో చూపిస్తూ, 'రాస్తూనే ఉండు' అని చెప్పారు. అనంతరం తన నోటిని సూచిస్తూ, 'నా ప్రాణం ఎవరి చేతిలో ఉందో ఆ అల్లాహ్ ప్రమాణం!, ఈ నోటి నుండి సత్యం, ధర్మం తప్ప మరేమీ వెలువడదు' అని అన్నారు."

(సునన్ అబీ దావూద్, కితాబుల్ ఇల్మ్, హదీస్ 3646)

అందువల్ల, ప్రవక్త (స) తన మాటలను లిఖితపూర్వకంగా నమోదు చేయాలని స్వయంగా ఆదేశించారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అత్యంత సూక్ష్మమైన అసత్యాన్ని కూడా నివారించాలని బోధించేవారు. ఇది కూడ ముందుగా ప్రస్తావించబడింది.

ఒక హదీస్‌లో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఆమిర్ (రజియల్లాహు అన్హు) ఇలా పేర్కొంటారు: "ఒక రోజు అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మా ఇంట్లో ఉన్నప్పుడు, నా తల్లి నన్ను పిలిచి, 'ఇక్కడికి రా, నీకు ఒకటి ఇస్తాను' అని చెప్పింది. అప్పుడు అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెను అడిగారు: 'అతనికి ఏమి ఇవ్వాలని అనుకున్నావు?' ఆమె, 'ఒక ఖర్జూరం ఇస్తాను' అని సమాధాన మిచ్చింది. దానికి అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'నీవు అతనికి ఏమీ ఇవ్వకపోయి ఉంటే, నీపై ఒక అబద్ధం నమోదు చేయబడేది.' సత్యవచనాన్ని ప్రవక్త (స) ఎంతటి ఉన్నత స్థాయిలో నిలబెట్టారో ఇది తెలియజేస్తుంది.

(సునన్ అబీ దావూద్, కితాబ్ అల్-అదబ్, హదీథ్ 4991)

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజియల్లాహు అన్హు) ఇలా పేర్కొన్నారు:

"సత్యత విషయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వ్యక్తిగత స్థానం ఎంతో ఉన్నతమైనది. అందుకే వారి స్వజనులే వారికి 'అస్-సాదిఖ్' (సత్యవంతుడు) అనే బిరుదును ఇచ్చారు. వారు ఎల్లప్పుడూ తన అనుచరులను సత్యంపై దృఢంగా నిలిచి ఉండమని ఉపదేశించే వారు. వారు స్వయంగా ఈ విషయంలో అత్యున్నత ఆదర్శంగా ఉండేవారు. అంతేకాక, తన అనుచరులు కూడా సత్యతను గట్టిగా ఆచరించి, స్వల్పమైన అబద్ధపు మచ్చ కూడా లేకుండా నిజాయితీలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని కృషి చేశారు. వారు (స) ఇలా చెప్పేవారు: 'సత్యం ధర్మానికి దారి తీస్తుంది. ధర్మం మనిషిని స్వర్గానికి చేర్చుతుంది. సత్యత యొక్క గొప్పదనమేమనగా, ఒక వ్యక్తి ఎల్లప్పుడూ సత్యమే మాట్లాడుతుంటే, చివరకు అల్లాహ్ దృష్టిలో కూడా అతడు సత్యవంతుడిగా గుర్తించబడతాడు.'

"ఒక సందర్భంలో అనేకమంది ముస్లింలను హత్య చేసిన ఒక వ్యక్తిని ఖైదీగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎదుటకు తీసుకువచ్చారు. హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హు) అతడు మరణ శిక్షకు అర్హుడని భావించి, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తనకు సంకేతం ఇస్తారేమోనని పదేపదే వారి ముఖాన్ని చూశారు. చివరకు ఆ వ్యక్తిని విడుదల చేసి వెళ్లనిచ్చారు. అప్పుడు హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: 'ఓ అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)! అతడు మరణశిక్షకు అర్హుడు.' దానికి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రశ్నించారు: 'అతడు మరణశిక్షకు అర్హుడైతే, నీవు ఎందుకు అతన్ని చంపలేదు?' హజ్రత్ ఉమర్ (రజియల్లాహు అన్హు) సమాధానంగా, 'ఓ అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)! మీరు కళ్లతో సంకేతం చేసి ఉంటే, నేను అలా చేసేవాడిని' అన్నారు. అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'ఒక ప్రవక్త వంచనతో ప్రవర్తించడు. నేను నోటితో అతనితో స్నేహపూర్వకంగా మాట్లాడుతూనే, కళ్లతో అతన్ని చంపమని సంకేతం ఇవ్వడం ఎలా సాధ్యం?. అది మోసం అవుతుంది. అలాంటి ప్రవర్తన నాకు అసాధ్యం.'" (దిబాచా తఫ్సీర్-ఉల్-ఖుర్ఆన్, అన్వార్-ఉల్-ఉలూమ్, సంపుటి 20, పుట 418)

ఈ విధంగా, వారు(స) సత్యత మరియు నిజాయితీకి అంతటి ఉన్నత ప్రమాణాలను స్థాపించారు కాబట్టి, వారి శత్రువులు కూడా వాటిని అంగీకరించక తప్పలేదు. అంతేకాక, తన అనుచరులు కూడా సత్యతలో అత్యున్నత ప్రమాణాలను సాధించాలని ప్రవక్త (స) వారికి బోధించారు.

అందువల్ల, నేడు ప్రతి అహ్మదీ తనను తాను పరిశీలించుకొని, తన సత్యత ప్రమాణాలపై ఆత్మపరిశీలన చేసుకోవడం, అందులో ఉన్న ఏ బలహీనతలనైనా తొలగించడానికి కృషి చేయడం తన కర్తవ్యంగా భావించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనందరికీ అలా చేయగల సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!.

**వర్తమాన ఖలీఫా వాఖ్యములు**

**"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "**

**(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)**

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

నమాజ్ అనంతరం, ఇటీవల 91 ఏళ్ల వయస్సులో పరమపదించిన మృతులు మిర్జా నసీమ్ అహ్మద్ సాహిబ్ గారి సతీమణి షాహిదా అహ్మద్ సాహిబా గారి పరోక్ష జనాజా నమాజును చదివించుతాను. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. మృతురాలు ఒక మూసియా. ఆమె నవాబ్ అబ్దుల్లా ఖాన్ సాహిబ్ మరియు సాహిబ్జాది అమతుల్ హఫీజ్ బేగమ్ గారి కుమార్తె. అలాగే ఆమె హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారి మనవరాలు.

ఆమెకు నలుగురు కుమారులు ఉన్నారు. ఆమె పెద్ద కుమారుడు నౌమాన్ ఇలా వ్రాసారు: ప్రతి ఒక్కరూ ఆమె గాఢమైన ప్రేమాభిమానాన్ని, ఇతరుల పట్ల ఆమె చూపిన ఆదర్శప్రాయమైన దయను గురించి సాక్ష్యమిస్తున్నారు. ఎల్లప్పుడూ ఇంట్లో మనుషులతో కళకళలాడుతూ ఉండాలని ఆమె కోరుకునేవారు. అతిథి సత్కారం పట్ల ఆమెకు అపారమైన ఆసక్తి ఉండేది. ఎక్కువ మంది అతిథులను సౌకర్యంగా ఉంచేందుకు మరిన్ని గదులు ఉన్న పెద్ద ఇల్లు ఉంటే బాగుండునని కూడా కోరుకునేవారు.

అలాగే ఆమె చిన్న కుమారుడు రిజ్వాన్ వ్రాస్తూ, ఆమె అనేక ఉన్నతమైన గుణాలను కలిగి ఉన్నారని పేర్కొన్నారు. ధనికులు, పేదలు, యువకులు, వృద్ధులు అనే తేడా లేకుండా అన్ని వర్గాల ప్రజల నుంచి ఆమె అందరికీ ప్రేమను పంచుతూ వారితో వ్యక్తిగత అనుబంధాలను ఏర్పరచుకున్నారని తెలియజేసే సందేశాలు ఇప్పటికీ వస్తూనే ఉన్నాయి. ఇతరులకు సహాయం చేయాలనే సహజ స్వభావం, ప్రేమతో కూడిన హృదయం ఆమెకు ఉండేది. ఆమె అందరి మనస్సును గెలుచుకునేవారు. ముఖ్యంగా కష్టాల్లో లేదా ఇబ్బందుల్లో ఉన్నవారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, బలహీనుల పక్షాన ఎల్లప్పుడూ నిలబడేవారు. తన పిల్లలకు కూడా బలహీనులకు అండగా ఉండాలని ఉపదేశించేవారు. ఆమె అసాధారణమైన దృఢ సంకల్పం, ధైర్య సాహసాలను కలిగి ఉండేవారు. నేను కూడా దీనిని స్వయంగా గమనించాను. మాషా అల్లాహ్, ఆమెకు ఎంతో దృఢనిశ్చయం, ధైర్యం ఉండేవి.

లాహోర్ సదర్ లజ్నాగా సేవలందించిన ఆమె సోదరి ఫౌజియా షమీమ్ సాహిబా మాట్లాడుతూ, కొద్దిపాటి మాటల్లో ఆమెను వర్ణించాలంటే త్యాగం, సహనం, ధైర్యం, ప్రేమలకు ప్రతిరూపముగా వర్ణించవచ్చు అని అన్నారు.

ఆమె కోడలు అమతుల్ వకీల్ వ్రాస్తూ, ఆమె అతిథి సత్కారం అత్యంత విశిష్టమైనదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఆమె పిల్లలందరూ, ఇంకా అనేక మంది కూడా ప్రస్తావించారు. అతిథులను ఆహ్వానించే విధానంలో ఎలాంటి అనవసర ఆడంబరాలు ఉండేవి కావు. జీవితపు చివరి సంవత్సరాల్లో ఆమె ఒకసారి పడిపోవడంతో తుంటి ఎముకకు గాయం అయ్యి, అనంతరం వీల్‌చైర్‌కే పరిమితమయ్యారు. అయినప్పటికీ ఆమె తన అనారోగ్యాన్ని అపారమైన సహనం, కృతజ్ఞతతో భరించారు. ఎప్పుడూ చిన్నపాటి ఫిర్యాదు కూడా చేయలేదు. ఆమె ధైర్యవంతమైన రోగి. ఇతరులకు ఎప్పుడూ ఇబ్బంది కలిగించలేదు.

ఆమె మనవరాలు ఖదీజా కూడా ఆమె అతిథి సత్కారం గురించి, అలాగే ఆమె ఎంతో ప్రేమతో, కరుణతో కూడిన మహిళ అని వ్రాశారు. ఇటీవలి సంవత్సరాల్లో ఆమె ప్రతి నెలలో రెండు లేదా మూడు సార్లు పవిత్ర ఖుర్ఆన్ పారాయణాన్ని పూర్తి చేసేవారని తెలిపారు. పేదల పట్ల ఆమెకు అపారమైన సానుభూతి ఉండేది. వారి కోసం ప్రార్థించాలని ఇతరులకు కూడా సూచించేవారు.

ఇక్కడ నివసిస్తున్న ఆమె మేనకోడలి కుమార్తె నేహా వ్రాస్తూ, ఏ పరిస్థితుల్లోనైనా ఆమె సానుకూల దృక్పథాన్ని కలిగి ఉండేవారని, జీవితంలోని ప్రతి క్షణాన్ని విలువైనదిగా భావించేవారని, ఇంటి పనివారిని కూడా తన సొంత కుటుంబ సభ్యుల్లాగే చూసుకునే వారని తెలిపారు. దీనిని నేను కూడా గమనించాను. ఆమె ఇతరుల గురించి ప్రతికూలంగా మాట్లాడడాన్ని, ఎవరి మనసైనా నొప్పించే మాటలు చెప్పడాన్ని నివారించేవారు. ఎల్లప్పుడూ ఇతరుల భావాలను గౌరవించేవారు.

ఒకసారి ఆమె ఇంట్లో పనిచేసే మహిళ, వివాహం చేసుకోని వెళ్లిపోతున్నప్పుడు, తన సొంత కుమార్తె వెళ్లిపోతున్నట్లుగా ఆమె ఎంతో బాధపడ్డారని చెబుతారు. ఇప్పుడు ఇల్లు వెలవెలబోతుందనే భావన ఆమెకు కలిగింది. ఒక వ్యక్తి జీవితకాలంలో తెలియని అనేక సద్గుణాలు, వారి మరణానంతరం వారిని సమీపంగా చూసిన వారి ద్వారా వెలుగులోకి వస్తాయి. ఆమె కూడా అలాంటి మహనీయులలో ఒకరు.

అల్లాహ్ తఆలా ఆమెను మన్నించి, తన అపార కరుణను ప్రసాదించుగాకా!.



# జుమా ప్రసంగము

ఈరోజు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)ను విశ్వసిస్తున్నామని, మహా ప్రవక్త (స)పై నిజమైన విశ్వాసం కలిగి ఉన్నామని చెప్పుకునే మనమందరం, ప్రతి మాటలోనూ, ప్రతి కార్యంలోనూ అత్యున్నత స్థాయి సత్యతను పాటించాలి. లేనిపక్షంలో, దైవ ప్రవక్త (స) స్వయంగా ఇలా హెచ్చరించారు: "అలా లేనివాడు నావాడు కాదు; నాకు అతనితో ఎలాంటి సంబంధం లేదు." వారి అనేక ఉపదేశాలు, మార్గదర్శకాలు ఇచ్చి, అత్యంత సూక్ష్మంగా కూడా సత్యాన్ని అలవర్చుకోవాలని బోధించారు. సంపూర్ణ సత్యాన్ని అనుసరించకుండా ఎవరూ నిజమైన ముస్లింగా ఉండలేరు.

---

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'నా జీవితమంతా మీ మధ్యనే గడిచింది. నేను మీ మధ్య బాలుడిగా పెరిగాను. యువకుడిగా, తరువాత మధ్య వయస్కుడిగా కూడా మీ మధ్యనే జీవించాను. నా వ్యక్తిగత, బహిరంగ జీవితాలన్నీ మీకు బాగా తెలుసు. నా కార్యాలలో ఏదీ మీకు దాచబడలేదు. నేను పలికిన ఒక్క మాట కూడా మీకు తెలియకుండా లేదు. మీలో ఎవరు అయినా నేను ఎప్పుడైనా అబద్ధం చెప్పానని చెప్పగలరా?'

---

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనందరికీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఆదర్శాన్ని అనుసరించే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా. అలాగే పవిత్ర ఖుర్ఆన్‌లోని ఆజ్ఞలను పాటించే భాగ్యాన్ని కలిగించి, సత్యనిష్ఠ ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి చేర్చేలా మనలను దీవించుగాకా!. ఆమీన్.

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 24 ఏప్రిల్ 2026 ( 24 షహాదత్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

اَمَّا بَعْدُ فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ -

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

గత శుక్రవారం ప్రసంగంలో దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి సత్యత యొక్క అత్యున్నత ప్రమాణాలు, వారి ఆదర్శప్రాయమైన జీవితం, అలాగే విశ్వాసులకు వారు అందించిన ఉపదేశాలు మరియు మార్గదర్శకత్వం గురించి ప్రస్తావించబడింది. ఈరోజు కూడా ఆయా విషయాలకు సంబంధించిన మరికొన్ని వివరాలను ప్రస్తావిస్తాను.

మనము సత్యతలో ఉన్నత ప్రమాణాలను అలవర్చుకోవాలని దైవ ప్రవక్త (స) కోరుకున్న సందర్భంలో ఒక హదీస్‌లో ఇలా నమోదు చేయబడింది. హఫ్స్ బిన్ ఆసిమ్ (ర) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఇలా తెలిపారు:

"ఒక వ్యక్తి తాను విన్న ప్రతి విషయాన్ని ధృవీకరించకుండా ఇతరులకు చెబుతూ తిరగడమే అతన్ని అబద్ధకుడిగా పరిగణించడానికి సరిపోతుంది."

(సహీహ్ ముస్లిం, ముకద్దిమా, బాబ్ అన్నహ్యి అనిల్ హదీస్ బికుల్లి మా సమిఅ, హదీస్ 5)

ఈ అలవాటు ఈ రోజుల్లో చాలా మందిలో కనిపిస్తోంది. జమాఅత్‌లో కూడా కొంతమంది వ్యక్తుల్లో ఈ చెడు అలవాటు గణనీయంగా ఉంది. కొందరు ఇతరుల గురించి నాకు లేఖలు రాస్తూ, వారు ఇలా చేశారు, అలా చేశారు అని ఆరోపణలు చేస్తారు. అయితే విచారణ జరిపినప్పుడు ఆ విషయాలు అసత్యమని తేలుతుంది. ఆ లేఖ రాసిన వ్యక్తిని, "మీకు ఇది ఎవరు చెప్పారు?" అని అడిగితే, ఆరోపణ నిజం కానందున, "నేను కేవలం విన్నాను" అని మాత్రమే సమాధానం ఇస్తాడు. ఇలాంటి విన్న మాటల ఆధారంగా వారు అనవసరంగా కలకలం సృష్టిస్తారు. ఇలాంటి వారు, దైవ ప్రవక్త (స) ఇలాంటి వ్యక్తులను అబద్ధకులుగా పేర్కొన్నారని ఆలోచించాలి.

మరొక హదీస్‌లో హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) సహచరులు అబద్ధం చెప్పడాన్ని అసహ్యించుకున్నంతగా మరే దుర్గుణాన్నీ అసహ్యించుకోలేదు. ఎవరైన ఒకరు దైవ ప్రవక్త (స) సమక్షంలో అబద్ధం చెప్పినట్లయితే, ఆ విషయం వారి హృదయంలో మిగిలిపోయేది. ఎవరైన అబద్ధం చెప్పారని వారికి తెలిసినప్పుడు, అది వారికి ఎంతో బాధ కలిగించేది. ఆ వ్యక్తి పశ్చాత్తాపపడి, తనను తాను సరిదిద్దుకొని, పూర్తిగా అబద్ధం చెప్పడం మానేశాడని తెలిసే వరకు ఆ విషయం వారి మనస్సులో ఉండేది.

(ముస్నద్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 8, హదీస్ 25698, మక్తబ్ అల్-కుతుబ్, పుట 280)

మరో హదీస్‌లో హజ్రత్ అస్మా (ర) ఇలా ఉల్లేఖించారు: ఒక మహిళ దైవ ప్రవక్త (స) వద్దకు వచ్చి ఇలా అడిగింది: "నాకు ఒక తోడు భార్య ఉంది (అంటే నా భర్తకు మరో భార్య ఉంది). నా భర్త నాకు చాలా వస్తువులు ఇస్తున్నాడని, నేను అతను ఇచ్చిన వాటితో పూర్తిగా సంతృప్తిగా ఉన్నానని ఆమెకు చూపించినట్లయితే, అది పాపమవుతుందా? వాస్తవానికి అతను నాకు అలాంటి వస్తువులు ఇవ్వలేదు. నేను ఆమెను రెచ్చగొట్టడానికి, బాధపెట్టడానికి మాత్రమే అలా చేయాలను కుంటున్నాను." అందుకు దైవ ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "తనకు ఇవ్వబడని దానిని పొందినట్లుగా నటించే వ్యక్తి అబద్ధం అనే రెండు వస్త్రాలను ధరించిన వాడితో సమానం." ఆమె మరో భార్యను మానసికంగా బాధపెట్టడానికి, రెచ్చగొట్టడానికి అలా చెప్పిందని భావించినప్పటికీ, దైవ ప్రవక్త (స) ఇది పూర్తిగా తప్పు అని స్పష్టం చేశారు.

(సహీహ్ ముస్లిం, కితాబుల్-లిబాస్ వజ్జీనహ్, బాబ్ అనిన్నహి అనిత్తజ్వీర్, హదీస్ 3959, సంపుటి 11, పుట 233, నూర్ ఫౌండేషన్)

ఈ హదీస్‌కు వ్యాఖ్యానంగా, ఇక్కడ "వస్త్రం" అనే పదం రూపకంగా ఉపయోగించ బడిందని పేర్కొనబడింది. దాని అర్థం ఏమిటంటే, ఆ వ్యక్తి అబద్ధం మరియు మోసాన్ని తన స్వభావంగా చేసుకున్నవాడు. అతను అబద్ధం అనే రెండు వస్త్రాలను ధరించాడు. ఒకటి పై వస్త్రంగా, మరొకటి క్రింది వస్త్రంగా. అంటే అతను పూర్తిగా అబద్ధాలతో నిండినవాడని భావం.

(ఉమ్దతుల్-ఖారీ, సంపుటి 20, పుటలు 289-290) (ఫతఉల్-బారీ, సంపుటి 9, పుటలు 228-229)

ఈ విధంగా, అత్యంత సూక్ష్మంగా మరియు గంభీరంగా దైవ ప్రవక్త (స) తమ అనుచరులను అబద్ధానికి దూరంగా ఉండాలని బోధించారు.

మరొక హదీస్‌లో హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమర్ (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "నాలుగు లక్షణాలు ఉన్నాయి. ఎవరిలో ఇవన్నీ ఉంటాయో అతను సంపూర్ణ కపటవిశ్వాసి (మునాఫిఖ్). వీటిలో ఒక్క లక్షణమైనా ఎవరిలోనైన ఉంటే, దానిని విడిచిపెట్టే వరకు అతనిలో కపటత్వానికి సంబంధించిన ఒక లక్షణం ఉన్నట్లే. 1. అతనికి ఏదైనా అమానత్ (నమ్మకంగా అప్పగించినది) అప్పగిస్తే దానికి ద్రోహం చేస్తాడు. 2. మాట్లాడినప్పుడు అబద్ధం చెబుతాడు. 3. వాగ్దానం చేస్తే దాన్ని ఉల్లంఘిస్తాడు. 4. వివాదం వచ్చినప్పుడు దూషణలు, అసభ్యమైన మాటలు మాట్లాడుతాడు."

(సహీహ్‌బుఖారీ, కితాబుల్-ఈమాన్, బాబ్ ఎలామతిల్ మునాఫిఖ్, సంపుటి 1, పుటలు 80-81, నిజారత్ ఇషాఅత్)

ఈ లక్షణాలన్నీ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ అబద్ధానికి దారితీసేవే లేదా అబద్ధానికి ప్రతిరూపాలే. అందువల్ల, ఈ నైతిక బలహీనతలు కపటత్వానికి సంకేతాలు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని, మనలో ఇటువంటి బలహీనతలు ఎంతవరకు ఉన్నాయో ప్రతి ఒక్కరూ తమను తాము పరిశీలించుకోవాలి. ఇవి మనిషిని కపటత్వం వైపు నడిపించే లక్షణాలు. ఎవరూ కూడా తాము కపట విశ్వాసులలో లెక్కించబడాలని కోరుకోరు.

అబద్ధాలను వ్యాప్తి చేసే వారి గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంతో కఠినమైన హెచ్చరిక చేశారు.

ఒక హదీస్‌లో హజ్రత్ సమురా బిన్ జుందుబ్ (రజియల్లాహు అన్హు) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) తరచుగా తన సహచరులను, "మీలో ఎవరైనా కల చూశారా?" అని అడిగేవారు. అల్లాహ్ చిత్తప్రకారం కలలు చూసినవారు వాటిని ప్రవక్త (స) కు వివరించేవారు. ఒక ఉదయం దైవ ప్రవక్త (స) ఇలా చెప్పారు: "గత రాత్రి నేను ఒక దైవ స్వప్నాన్ని చూశాను. ఇద్దరు వ్యక్తులు నా వద్దకు వచ్చి నన్ను మేల్కొలిపి, 'రండి' అని అన్నారు. నేను వారితో వెళ్లాను. మేము ఒక మనిషి వద్దకు చేరుకున్నాము. అతను వీపుమీద పరుండి ఉన్నాడు. అతని పక్కనే మరొక వ్యక్తి ఒక ఇనుప కొక్కెం (పెద్ద కొక్కెం లేదా ప్లయర్స్‌లాంటి పరికరం) పట్టుకొని నిలబడి ఉన్నాడు. అతను ఆ మనిషి నోటి ఒక వైపు నుంచి తల వెనుక భాగం వరకు నోటిని చీల్చేవాడు. తరువాత మరో వైపుకు వెళ్లి అదే విధంగా చీల్చేవాడు. అతను రెండో వైపు పూర్తి చేసేలోపే, మొదటి వైపు మళ్లీ మామూలు స్థితికి వచ్చేది. అప్పుడు అతను మళ్లీ అదే పనిని పునరావృతం చేసేవాడు." దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "నేను ఆశ్చర్యపడి, 'సుబ్హానల్లాహ్! వీరు ఎవరు?' అని అడిగాను. వారు, 'మేము దీని వాస్తవాన్ని మీకు చెబుతాము. మీరు చూసిన ఆ వ్యక్తి, ఎవరి నోరు తల వెనుక వరకు చీల్చబడిందో, ముక్కు, కన్ను కూడా అలాగే

చీల్చబడిందో, అతడు ఉదయం ఇంటి నుంచి బయలుదేరి ఒక అబద్ధాన్ని కల్పించి, అది దూరదూరాల వరకు వ్యాపించేలా చేసే వ్యక్తి' అని చెప్పారు."

(సహీబుఖారీ, కితాబుత్తాబీర్, బాబ్ తాబీర్రు రుఅయా, బఅద సలాతి స్సుబ్‌హి, అనువాదం, సంపుటి 16, పేజి 246-252 హదీస్ 7047, నజారత్ ఇషాఅత్)

ఈ హదీస్ ఇతరుల గురించి పుకార్లు, అసత్య ప్రచారాలు చేసే వారిని సూచిస్తుంది. కొందరు కేవలం సంభాషణ కోసం లేదా వినోదం కోసం మాట్లాడతారు. మరికొందరు సమాజంలో ఇతరులను అపకీర్తిపాలు చేయాలనే ఉద్దేశంతో అబద్ధాలు ప్రచారం చేస్తారు. ఏ ఉద్దేశంతో చెప్పినా, వారి మాటలు ఇతరులకు హాని కలిగిస్తాయి.

కాబట్టి అలాంటి వారు, దీనికి తప్పకుండా అల్లాహ్ ఎదుట జవాబు దారులు కావలసి ఉంటుందని ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారిని విచారించి శిక్షిస్తాడు. ఇది ఎంతో లోతుగా ఆలోచించాల్సిన విషయం. అందువల్ల మనం నిరంతరం అధికముగా క్షమాపణ (ఇస్తిగ్ఫార్) కోరుతూ ఉండాలి.

అబ్దుల్లాహ్ బిన్ హారిస్, హజ్రత్ హకీమ్ బిన్ హిజామ్ (రజియల్లాహు అన్హు) ద్వారా ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఇలా చెప్పారు: "కొనుగోలుదారు, అమ్మకందారు ఇద్దరికీ వారు ఒకరినొకరు విడిచి వెళ్లే వరకు లావాదేవీని రద్దు చేసుకునే హక్కు ఉంటుంది. వారు కలిసి ఉన్నంత వరకు ఆ హక్కు ఉంటుంది. ఒకసారి విడిపోయిన తరువాత ఆ అవకాశం ఉండదు. వారు నిజాయితీగా వ్యవహరించి, నిజం మాట్లాడితే వారి లావాదేవీలో అల్లాహ్ సంవృద్ధిని(ఆశీర్వాదం) ప్రసాదిస్తాడు. కానీ వారు ఏదైనా దాచిపెట్టి అబద్ధం మాట్లాడితే, వారి లావాదేవీలోని సంవృద్ధి తొలగించబడుతుంది."

(సహీబుఖారీ, కితాబుల్ బుయూ, బాబ్ ఇజా బయ్యిన బయ్యిఆని వలం యక్‌తుమా వ నసహా అనువాదం, సంపుటి 4, పేజి 38-39, హదీస్ 2079, నజారత్ ఇషాఅత్)

వ్యాపారాల్లో తలెత్తే అనేక వివాదాలకు కారణం అబద్ధాలు, మోసపూరిత ప్రవర్తనే. అలాంటి వారి వ్యాపారాల్లో, వ్యవహారాల్లో అల్లాహ్ శుభములను ప్రసాదించడు. ఈ ప్రపంచంలో వారు తమ తప్పుల ఫలితంగా నష్టాలను అనుభవిస్తారు. పరలోకంలో కూడా అల్లాహ్ దృష్టిలో వారు పాపులుగా పరిగణించబడి శిక్షకు పాత్రులవుతారు.

హజ్రత్ ఇబ్నే ఉమర్ (రజియల్లాహు అన్హు) ఉల్లేఖించిన హదీస్‌లో దైవ ప్రవక్త (స) ఇలా చెప్పారు: "ఒక వ్యక్తి అబద్ధం చెప్పినప్పుడు, అతడు ఉద్దేశపూర్వకంగా చేసిన ఆ పాపం నుంచి వచ్చే దుర్వాసన కారణంగా ఒక దేవదూత అతనికి ఒక మైలు దూరంగా వెళ్లిపోతాడు."

(జామిఅత్తిర్మిజీ, కితాబుల్ బిర్రి వస్సిలతి బాబ్ మా జాఅ ఫిస్సిద్‌ఖి వల్ కజిబి -హదీస్ 1972)

మరొక హదీస్‌లో హజ్రత్ అబూ హురైరా (రజియల్లాహు అన్హు) ఇలా ఉల్లేఖించారు: ఒకసారి దైవ ప్రవక్త (స) ధాన్యం కుప్ప పక్కగా వెళ్తుండగా, తన చేయిని అందులో పెట్టారు. వారి వేళ్లకు తేమ తగిలింది. అప్పుడు ప్రవక్త (స), "ఓ ధాన్యం అమ్మేవాడా! ఇది ఏమిటి? లోపల ధాన్యం తడిగా ఉందే?" అని అడిగారు. ఆ వ్యక్తి, "ఓ అల్లాహ్ ప్రవక్తా! దీనిపై వర్షం పడింది" అని చెప్పాడు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: "అయితే తడిగా ఉన్న ధాన్యాన్ని పైభాగంలో ఎందుకు పెట్టలేదు? ప్రజలు దాన్ని చూసి తెలుసుకునేలా ఉండాలి కదా! మోసం చేసే వ్యక్తి నా వాడు కాదు."

(సహీ ముస్లిం, కితాబుల్ ఈమాన్, బాబ్ ఖౌలిన్నబియ్యి సల్లల్లాహు అలైహి వసల్లం... మన్ ఘష్షనా ఫలైస మిన్నా అనువాదం, సంపుటి 1, పేజి 93, హదీస్ 139, నూర్ ఫౌండేషన్)

అందువల్ల వ్యాపారులు ఇటువంటి సూక్ష్మమైన విషయాల్లో కూడా తమను తాము పరిశీలించుకోవాలి. ఇదే ప్రమాణాన్ని దైవ ప్రవక్త (స) ముస్లింలలో నెలకొల్పాలని కోరుకున్నారు. అయితే విచారకరమైన విషయం ఏమిటంటే, నేడు మోసపూరిత వ్యాపారం, అపవాదులు, అసత్య ప్రచారాల కారణంగా ప్రపంచంలో ముస్లింలే అపకీర్తికి గురవుతున్నారు.

కాబట్టి ఈరోజు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం)ను విశ్వసిస్తున్నామని, మహా ప్రవక్త (స)పై నిజమైన విశ్వాసం కలిగి ఉన్నామని చెప్పుకునే మనమందరం, ప్రతి మాటలోనూ, ప్రతి కార్యంలోనూ అత్యున్నత స్థాయి సత్యతను పాటించాలి. లేనిపక్షంలో, దైవ ప్రవక్త (స) స్వయంగా ఇలా హెచ్చరించారు: "అలా లేనివాడు నావాడు కాదు; నాకు అతనితో ఎలాంటి సంబంధం లేదు." వారి అనేక ఉపదేశాలు, మార్గదర్శకాలు ఇచ్చి, అత్యంత సూక్ష్మంగా కూడా సత్యాన్ని అలవర్చుకోవాలని బోధించారు. సంపూర్ణ సత్యాన్ని అనుసరించకుండా ఎవరూ నిజమైన ముస్లింగా ఉండలేరు.

ప్రవక్త (స) వ్యక్తిత్వానికి సంబంధించిన కొన్ని అంశాలను ఇప్పుడు నేను ప్రస్తావిస్తున్నాను.

ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన నిరంతర సత్యవచనం, నిజాయితీ, విశ్వసనీయత మరియు ఉన్నత నైతికత కారణంగా ప్రజల మధ్య ఎల్లప్పుడూ అత్యంత సత్యవంతుడు, అత్యంత విశ్వసనీయుడు అనే పేరును పొందారు. ఈ విషయాన్ని ఒక రచయిత ఇలా పేర్కొన్నాడు:

"ముహమ్మద్ (స) అజ్ఞానయుగంలో పంపబడ్డారు. వారి కన్న ముందు వారి ప్రజల వద్దకు ఎలాంటి హెచ్చరిక చేసేవారు (ప్రవక్త) రాలేదు. ఆ ప్రజలు విగ్రహాలను, తప్పుడు దేవతలను, పుణ్యస్థలాలను ఆరాధించేవారు. అయితే అలాంటి సమాజంలోనే, ప్రవక్త(స)కు చిన్ననాటి నుంచే అల్లాహ్ జ్ఞానం, వివేకం ప్రసాదించాడు. షైతాన్ అనుచరులు, విగ్రహారాధకుల మధ్య పెరిగినప్పటికీ, వారు ఎప్పుడూ ఏ విగ్రహం వైపు ఆకర్షితులు కాలేదు, వారి ఏ పండుగలోనూ పాల్గొనలేదు. వారి నోటి నుండి ఒక్క అసత్యమూ వెలువడలేదు. ప్రజలు వారిని 'సుదూక్' (అత్యంత సత్యవంతుడు), 'అమీన్' (అత్యంత విశ్వసనీయుడు, సహనశీలుడు, ఉదారుడు) అని సంబోధించేవారు."

(ఇమ్తిఅల్ అస్మాఅ సంపుటి 4, పేజి 212, మక్తబ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)

ప్రవక్తత్వం లభించక ముందు నుండే, అజ్ఞాన కాలంలోనే ప్రజలు తమ వివాదాల తీర్పు కోసం ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంవద్దకు వచ్చేవారని కూడా వివరించబడింది.

(సుబూలుల్‌హుదా వర్రిషాద్, సంపుటి 2, పేజి 147, మక్తబ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బీరూట్)

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ప్రవక్త (స) వారి ఆదర్శప్రాయమైన వ్యక్తిత్వాన్ని వివరిస్తూ ఒక సందర్భంలో ఇలా పేర్కొన్నారు:

"ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఉన్నత నైతిక స్వభావానికి సంబంధించిన సమష్టి సాక్ష్యం ఏమిటంటే, వారు ప్రవక్తత్వాన్ని ప్రకటించక ముందే ఆవారి సొంత జాతి వారికి 'అమీన్' (విశ్వసనీయుడు), 'సాదిక్' (సత్యవంతుడు) అనే బిరుదులను ప్రదానం చేసింది. ప్రపంచంలో నిజాయితీ లేని వారిగా నిరూపించబడని వారు చాలామంది ఉంటారు. అలాగే, తీవ్రమైన పరీక్షలకు గురి కాకుండా, సాధారణ పరిస్థితుల్లోనే జీవించి తమ నిజాయితీని నిలబెట్టుకున్న వారూ కూడ ఉంటారు. అయినప్పటికీ, వారి ప్రజలు వారికి ప్రత్యేక బిరుదులు ఇవ్వరు. ఎందుకంటే ప్రత్యేక బిరుదులు ఒక వ్యక్తి ఏదైనా ఒక గుణంలో అందరినీ మించి ఉన్నప్పుడు మాత్రమే ఇవ్వబడతాయి.

"యుద్ధంలో పాల్గొనే ప్రతి సైనికుడు తన ప్రాణాలను పణంగా పెడతాడు. కానీ బ్రిటిష్ ప్రభుత్వం ప్రతి సైనికుడికి 'విక్టోరియా క్రాస్' ప్రదానం చేయదు. అలాగే జర్మన్ ప్రభుత్వం ప్రతి సైనికుడికి 'ఐరన్ క్రాస్' ఇవ్వదు. ఫ్రాన్స్‌లో లక్షలాది మంది మేధోరంగంలో పనిచేస్తున్నప్పటికీ, ప్రతి ఒక్కరికీ 'లెజియన్ ఆఫ్ ఆనర్' పురస్కారం లభించదు. కాబట్టి, ఒక వ్యక్తి నిజాయితీ పరుడు, సత్యవంతుడు కావడం మాత్రమే అతని మహత్తును ప్రత్యేకంగా చాటదు. కానీ ఒక సంపూర్ణ జాతి ఒక వ్యక్తికి 'అమీన్', 'సాదిక్' అనే బిరుదులను ఇవ్వడం నిజంగా అసాధారణ విషయం.

"మక్కా ప్రజలు ప్రతి తరంలోనూ ఇలాంటి బిరుదులు ఇవ్వడం ఆనవాయితీగా ఉండి ఉంటే, వాటిని పొందిన వ్యక్తిని అప్పటికీ గొప్పవాడిగానే భావించేవారు. కానీ అరబ్బుల చరిత్ర చెబుతున్నది ఏమిటంటే, ఏ తరంలో కూడ ఇలాంటి బిరుదులు ఇవ్వబడ లేదు. వందల సంవత్సరాల అరబ్ చరిత్రలో కేవలం ఒక్క ఉదాహరణ మాత్రమే కనిపిస్తుంది. అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మాత్రమే అరబ్బులచే 'అమీన్' మరియు 'సాదిక్' అనే బిరుదులతో సత్కరించబడ్డారు." కాబట్టి, శతాబ్దాల అరబ్ చరిత్రలో ఒక జాతిమొత్తం ఈ రెండు బిరుదులను కేవలం ఒక్క వ్యక్తికే ప్రదానం చేయడం, వారి విశ్వసనీయత మరియు సత్యవచనం అత్యున్నత స్థాయిలో ఉన్నాయని స్పష్టంగా నిరూపిస్తుంది. వారికి సమానమైన మరొక ఉదాహరణ వారికి తెలియదు. అరబ్బులు తమ సూక్ష్మ పరిశీలన, వివేచనా శక్తికి ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందినవారు. అందువల్ల, వారు ఏదైనా విషయాన్ని అత్యంత అరుదైనదిగా ప్రకటిస్తే, అది నిజంగానే ప్రపంచంలో అరుదైనదిగా పరిగణించ దగినదే.

(దిబాచ తఫ్సీరుల్ ఖుర్ఆన్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 20, పేజి 374, 375)

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు:

"నేటి రోజుల్లో ప్రపంచ పరిస్థితి ఎంతో ఆందోళనకరంగా మారింది. ఎటు వైపు చూసినా అబద్ధపు సాక్ష్యాలు సృష్టించబడుతున్నాయి. తప్పుడు కేసులు వేయడం ఒక సాధారణ విషయంగా మారిపోయింది. నకిలీ పత్రాలు తయారు చేస్తున్నారు. ప్రజలు మాట్లాడినప్పుడు కూడా సత్యాన్ని తప్పించుకునే విధంగానే మాట్లాడుతున్నారు. ఇప్పుడు ఈ (అహ్మదీయ్యా) జమాఅత్ అవసరమే లేదని భావించే వారిని అడగాలి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తీసుకువచ్చిన మతం ఇదేనా?. అల్లాహ్ తఆలా అబద్ధాన్ని ఒక ఘోరమైన అపవిత్ర కార్యంగా పేర్కొంటూ ఇలా ఆజ్ఞాపించాడు: اِجْتَنِبُوا الرِّجْسَ مِنَ الْاَوْثَانِ وَاجْتَنِبُوْا قَوْلَ الزُّوْرِ (الحج:31) అనగా విగ్రహాల అపవిత్రత నుండి దూరంగా ఉండండి, అలాగే ప్రతి అసత్య వాక్యాన్ని కూడా విడిచిపెట్టండి." "అల్లాహ్ అబద్ధాన్ని విగ్రహారాధనతో సమానంగా పేర్కొన్నాడు. ఒక మూర్ఖుడు అల్లాహ్‌ను విడిచిపెట్టి విగ్రహానికి తల వంచినట్లే, అబద్ధాన్ని ఆశ్రయించే వ్యక్తి

కూడా సత్యాన్ని విడిచిపెట్టి తన ప్రయోజనాల కోసం అసత్యాన్ని ఒక విగ్రహంలా చేసుకున్నవాడవుతాడు. అల్లాహ్ అపవిత్రత నుండి దూరంగా ఉండమని ఆజ్ఞాపించాడు.” ఎందుకంటే అది ఒక మహాపాపం. అసత్యం కూడా అపవిత్రత మరియు దుష్కార్యాలలో పడిపోవడమే. విగ్రహారాధన కూడా ఒక తీవ్రమైన అపవిత్ర కార్యమే. మరల ఇలా పేర్కొన్నారు: “ఎలాగైతే ఒక మూర్ఖుడు అల్లాహ్‌ను విడిచి పెట్టి విగ్రహానికి తల వంచుతాడో, అలాగే ఒక వ్యక్తి సత్యం మరియు నిజాయితీని విడిచిపెట్టి తన లక్ష్యాన్ని సాధించడానికి అసత్యాన్ని ఒక విగ్రహంగా చేసుకుంటాడు. అందుకే అల్లాహ్ తఆలా అబద్ధాన్ని విగ్రహారాధనతో కలిపి పేర్కొన్నాడు. విగ్రహారాధన నుండి దూరంగా ఉండండి, అది ఒక ఘోరమైన పాపం. అబద్ధం కూడా అదే స్వభావాన్ని కలిగి ఉంది.” మరల ఇలా తెలిపారు: “ఒక విగ్రహారాధకుడు తన రక్షణను విగ్రహం ద్వారా పొందాలని ఆశిస్తాడు. అలాగే ఒక అబద్ధకుడు కూడా తన కోసం ఒక విగ్రహాన్ని చెక్కి, దాని ద్వారా తాను రక్షింపబడతానని భావిస్తాడు. తన జీవితం అబద్ధంపై ఆధారపడి ఉందని నమ్మడం కన్నా గొప్ప దురదృష్టం ఇంకేముంటుంది?. వారిని మీరు ‘ఎందుకు అబద్ధాన్ని విడిచిపెట్టరు?’ అని అడిగితే, ‘మా ప్రయోజనాల కోసం అబద్ధాన్ని ఆశ్రయించక తప్పదు’ అని సమాధానం చెబుతారు.” మరల ఇలా తెలిపారు: “తమ జీవితం అబద్ధంపైనే ఆధారపడి ఉందని నమ్మడం కన్నా పెద్ద దురదృష్టం ఏముంటుంది?. అయినప్పటికీ, నేను మీకు హామీ ఇస్తున్నాను, చివరికి విజయం సాధించేది సత్యమే. సద్గుణం మరియు విజయం రెండూ సత్యానికే చెందుతాయి.”

(మల్ఫూజాత్, సంపుటి 8, పుటలు 270-271)

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితాన్ని వివరిస్తూ ఒక సందర్భంలో హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూ ద్ (రజియల్లాహు అన్హు) ఇలా వ్రాసారు:

“దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తనకు లభించిన దైవ ప్రత్యక్ష ప్రకటన (వహీ) గురించి తన భార్యకు తెలియజేసినప్పుడు, ఆమె ‘మీరు ఏవో కల్పిత కథలు చెప్పడం ప్రారంభించారా?’ అని అనలేదు. దానికి బదులుగా ఆమె ఇలా అన్నారు:‘భయపడవద్దు. మీరు చూసింది సత్యమే. అల్లాహ్ మిమ్మల్ని ఎప్పటికీ విడిచిపెట్టడు. ఎందుకంటే మీరు బంధుత్వాలను నిలబెడతారు, అవసరంలో ఉన్న వారికి సహాయం చేస్తారు, నశించిన సద్గుణాలను పునరుద్ధరిస్తారు, అతిథులను గౌరవిస్తారు, మరియు సత్యానికి మద్దతు ఇస్తారు.’

తర్వాత ఆమె వారిని తన బంధువు వరఖా బిన్ నౌఫల్ వద్దకు తీసుకెళ్లింది. ఆయన ఇస్రాయేలీయుల గ్రంథాల పండితుడు. జరిగిన విషయాన్ని విన్న వెంటనే ఆయన ఇలా అన్నారు: ‘ఇది మూసా (అలైహిస్సలాం)పై అవతరించిన అదే విధమైన దైవ ప్రత్యక్ష ప్రకటన. ఇందులోని ఆజ్ఞలు కూడా మూసా (అలైహిస్సలాం)కు ఇవ్వబడిన ఆజ్ఞలతో సమానంగా ఉన్నాయి.’(హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజియల్లాహు అన్హు) ఇక్కడ మరిన్ని సాక్ష్యాలను వివరించారు. వాటిలో కొన్నింటిని నేను గత ఖుత్బాలో సంక్షిప్తంగా ప్రస్తావించాను. వరఖా బిన్ నౌఫల్ సాక్ష్యానంతరం వారు రజి మరో సాక్ష్యాన్ని ఇలా ప్రస్తావిస్తారు:) “ఇంట్లో యౌవనంలోకి ప్రవేశిస్తున్న ఒక యువకుడైన తన పిన్నాన్న కుమారుడు ఉన్నాడు. యువత సందేశ ప్రచారానికి సమర్థవంతమైన సాధనంగా మారగల్గుతారు. తన అన్న మరియు వదిన, అనగా హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) లు ఈ గొప్ప మార్పు గురించి అత్యంత గంభీరంగా మాట్లాడుతున్నట్లు విన్నప్పుడు, అతడు ప్రశాంతంగా ముందుకు వచ్చి ఇలా అన్నాడు: ‘నేను కూడా మీరు సత్యవంతులేనని విశ్వసిస్తున్నాను. అల్లాహ్ నిజంగానే మీతో మాట్లాడాడు. ప్రపంచ సంస్కరణ కోసం మిమ్మల్ని నియమించాడు.’తర్వాత ఒక విముక్త బానిస యొక్క సాక్ష్యం ఉంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఉన్నతమైన నైతిక స్వభావానికి ఆకర్షితుడై, తన తల్లిదండ్రులను విడిచిపెట్టి ప్రవక్త (స) సేవలోనే ఉండిపోయిన వ్యక్తి అతడు. ఈ సంఘటనలన్నింటిని విని, తన యజమాని ముఖంలో ఆందోళనను గమనించి, ముందుకు వచ్చి వారి వస్త్రాన్ని పట్టుకొని ఇలా అన్నాడు: ఓ ‘నా యజమానీ! మీరు చూసింది సత్యమే; మీరు చెప్పింది సత్యమే. మీలాంటి వ్యక్తిని దైవ శక్తి ఎన్నడూ మోసం చేయదు. మీరు సత్య స్వరూపులు. దైవ శక్తి మిమ్మల్ని ఎలా మోసం చేయగలదు? ఇప్పుడు ప్రపంచ సంస్కరణ మీ చేతుల ద్వారా జరగాల్సిన సమయం వచ్చింది. మీతో ఉండి మీ సేవ చేయడానికి నాకు అనుమతి ఇవ్వండి.’

మరొక సాక్ష్యం ప్రవక్త (స)కు అత్యంత సన్నిహిత మిత్రుడైన వ్యక్తిదీ. ఒకే గవ్వలో పెరిగిన రెండు ముత్యాలవలె వారు ఉండే వారు. తన మిత్రుడు కొత్తగా, అసాధారణంగా మాట్లాడుతున్నాడని, కొందరు ‘బహుశా ఆయన మనస్సు ప్రభావితమై ఉండవచ్చు’ అని అంటున్నారని విన్న వెంటనే, అతడు త్వరగా తన మిత్రుని వద్దకు వచ్చి తలుపు తెరిచి ఇలా అడిగాడు: ‘నేను విన్నది నిజమేనా?’ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విషయం వివరించడం ప్రారంభించగానే, అతడు ఇలా అన్నాడు: ‘అల్లాహ్ ప్రమాణం!, నాకు ఎలాంటి సంజాయిషి అవసరం లేదు. ఒకటే చెప్పండి, ఇది నిజమేనా?’. అందుకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ‘అవును’ అని ధృవీకరించగానే, అతడు ఇలా ప్రత్యుత్తరం ఇచ్చాడు: ‘నా సత్యవంతుడైన మిత్రమా! నేను మీ ప్రవక్తత్వాన్ని విశ్వసిస్తున్నాను. మీరు ఆధారాలు చూపి నా విశ్వాసంలో సందేహం కలిగించ బోతున్నారు. నేను మీ జీవితంలో మీ సత్యనిష్ఠను చూశాను కాబట్టి నాకు ఎలాంటి ఆధారాలు అవసరం లేదు.’ఆ తర్వాత హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) ఇలా అన్నారు: ‘నా మిత్రమా! మీ ముఖాన్ని చూసినవారు ఎవరైన మీ మాటలను ఎలా సందేహించగలడు?’ వ్యతిరేకత తప్పక ఉద్భవిస్తుందనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే వరఖా బిన్ నౌఫల్ ఇలా అన్నారు: లం యాతి రజులున్ ఖత్తు బి మిసిలి మా జిఅత బిహి ఇల్లా ఊదియా అనగా “నీవు తీసుకువచ్చినటు వంటి సందేశాన్ని ఎవరు తీసుకువచ్చినా కూడ వారు హింసకు, వ్యతిరేకతకు గురికాకుండా ఉండలేదు.” అయితే, దేవుని ప్రణాళికను గమనించండి. వ్యతిరేకత అనే తుఫాను ప్రారంభమయ్యేలోపే, అల్లాహ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కొరకు సహచరులను ఎలా సిద్ధం చేశాడో చూడండి. మక్కా ప్రజలలో గ్రంథజ్ఞానంలో ప్రావీణ్యం కలిగిన వరఖా, మొదటి భేటీలోనే వారికి తలవంచాడు. వారి జీవిత సహచరిణి ఖదీజా, దైవప్రకటన (వహీ) గురించి విన్న వెంటనే ప్రేమతో, పూర్తి మద్దతుతో వారికి అండగా నిలిచింది. ఇంటిలో వారి ప్రవర్తనను ఎల్లప్పుడూ గమనించిన యువ బంధువు మరియు పిన్నాన్న కుమారుడైన అలీ, తన సేవలను సమర్పించాడు. విముక్తుడైన సేవకుడు జైద్, వారి(స) ప్రవర్తనను మరియు పేదల పట్ల వారి(స) వ్యవహారాన్ని లోతుగా పరిశీలించిన వాడు, వారి (స) సత్యనిష్ఠపై ప్రమాణం చేశాడు. బాల్యమిత్రుడు, మక్కాకు ఉపకారి, ఉన్నతమైన గుణాల ప్రతిరూపమైన అబూబకర్, వారికి దైవప్రకటన లభించిందని విన్న వెంటనే, సంపూర్ణ భక్తితో వారి సేవలో చేరిపోయాడు.

“ఈ అసాధారణమైన ప్రేమ, విశ్వాసం, అంకితభావం యొక్క వ్యక్తీకరణలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హృదయంలో ఎంత అపారమైన ఆనందాన్ని కలిగించి ఉంటాయో ఊహించండి. మక్కా ప్రజల ఎగతాళిని, నిందలను విన్నప్పుడు వారు చిరునవ్వుతో ఇలా అనుకుని ఉండవచ్చు: ‘నా గురించి తెలియని వారు నిజంగా నన్ను మాంత్రికుడు, మరెన్నో పేర్లతో పిలుస్తున్నారు. ఇప్పుడు నన్ను బాగా తెలిసిన వారి తీర్పును కూడా వినండి. వారు నా పక్కనే నిలబడి, అవసరమైతే నా కోసం తమ ప్రాణాలను కూడా అర్పించడానికి సిద్ధంగా ఉన్నారు.”

“మూసా (అలైహిస్సలాం) తన బాధ్యతను పంచుకునేందుకు ఒక సహాయకుడి కోసం ప్రార్థించాడు. ఈ సూక్తిని వివరిస్తూ, ప్రవక్త మూసా (అలైహిస్సలాం) యొక్క సహచరులను మరియు దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క సహచరులను పోల్చారు. అందుకే మూసా ఉదాహరణ ప్రస్తావించబడింది. మూసా ఒక సహాయకుడిని మాత్రమే కోరగా, అల్లాహ్ యొక్క ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అడగకుండానే ఐదుగురు సహాయకులను పొందారు. అంతేకాక, వారు ప్రవక్త (స) భారాన్ని పంచుకోవడంలో అత్యుత్తములుగా నిలిచారు. వరఖా త్వరలోనే మరణించినప్పటికీ, ఆయన ప్రవక్త సత్యవంతుడనే చెరగని సాక్ష్యాన్ని విడిచిపోయాడు. తదుపరి పన్నెండు సంవత్సరాల పాటు ఖదీజా రజి చూపించిన అంకిత భావం, అత్యంత ధైర్యవంతులైన పురుషులను కూడా వినయంతో తలవంచేలా చేసింది. జైద్ ఇరవై సంవత్సరాల పాటు అసమానమైన త్యాగాన్ని ప్రదర్శించి, చివరకు ఖడ్గాల ఎదుట తన రక్తాన్ని చిందించడం ద్వారా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క నిజమైన సహాయకుని ప్రమాణాన్ని స్థాపించాడు. అబూబకర్ మరియు అలీ (రజి)లు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణానంతరం కూడా నిలిచి, ఖలీఫాలుగా తమ సేవను మరింత లోతైన, విశిష్టమైన రీతిలో ప్రదర్శించారు.” (తఫ్సీర్-ఎ-కబీర్, సంపుటి 13, పుటలు 201-202, 2023)

తర్వాత, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఆదర్శాన్ని వివరిస్తూ, హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజియల్లాహు అన్హు) ఇలా పేర్కొన్నారు:

“సత్యవంతుడైన, నిష్కపటమైన వ్యక్తికి అత్యంత శక్తివంతమైన సాక్ష్యం అతని స్వంత జీవితమే. అది ప్రత్యర్థులకు, అనుచరులకు, తనను తెలియని వారికి, బాగా తెలిసిన వారికి, పరాయివారికి, సన్నిహితులకు ఇలా గట్టిగా ప్రకటిస్తుంది: ‘ముందుగా నన్ను పరిశీలించండి. ఆ తర్వాతే నన్ను అబద్ధికుడని పిలవండి. నిజంగా మీరు అలా చేయగలరా అని ఆలోచించండి. మీరు నన్ను అసత్యవాదిగా ప్రకటిస్తే, సత్యాన్ని గుర్తించే మీ ప్రమాణాలన్నింటినీ మీరే కోల్పోతారు. నన్ను మోసగాడిగా ముద్ర వేస్తే, మీరు చేరాలనుకునే లక్ష్యానికి దారితీసే ప్రతి ద్వారాన్నీ మీరే మూసివేస్తారు.’”

“ఈ ప్రపంచంలో ప్రతి విషయం క్రమంగా, దశలవారీగా అభివృద్ధి చెందుతుంది. మధ్యంతర దశలను దాటకుండా సద్గుణం పరిపూర్ణతను చేరదు. అలాగే దుష్టత్వం కూడా తన వివిధ దశలను దాటకుండా పరాకాష్టకు చేరదు. మరి పడమర వైపు పరిగెత్తేవాడు ఒక్కసారిగా తూర్పు చివరికి చేరగలడా? (ఒక దిశలో ప్రయాణించి, మరో దిశలో గమ్యాన్ని చేరడం అసాధ్యం.) అలాగే దక్షిణం వైపు వెళ్లేవాడు ఉత్తర దిక్కు అంచున నిలబడగలడా?”

“దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: ‘నా జీవితమంతా మీ మధ్యనే గడిచింది. నేను మీ మధ్య బాలుడిగా పెరిగాను. యువకుడిగా, తరువాత మధ్య వయస్కుడిగా కూడా మీ మధ్యనే జీవించాను. నా వ్యక్తిగత, బహిరంగ జీవితాలన్నీ మీకు బాగా తెలుసు. నా కార్యాలలో ఏదీ మీకు దాచబడలేదు. నేను పలికిన ఒక్క మాట కూడా మీకు తెలియకుండా లేదు. మీలో ఎవరు అయినా నేను ఎప్పుడైనా అబద్ధం చెప్పానని చెప్పగలరా?’

ఇది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విసిరిన సవాలు.

'నేను ఎప్పుడైనా అబద్ధం చెప్పానని, అన్యాయం చేశానని, మోసం చేశానని, ఎవరి హక్కునైన హరించానని, స్వప్రతిష్ఠ కోసం ప్రయత్నించానని, అధికారాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నించానని మీలో ఎవరైన చెప్పగలరా?. ప్రతి రంగంలో మీరు నన్ను పరీక్షించారు. ప్రతి పరిస్థితిలో నన్ను పరిశీలించారు. అయినప్పటికీ, నా ప్రతి అడుగు మితమైన, సమతుల్యమైన మార్గంపైనే ఉందని, ప్రతి లోపం నుండి నేను పరిశుద్ధుడనని మీరు తెలుసుకున్నారు. అందువల్లే మిత్రులు మాత్రమే కాదు, శత్రువులు కూడా నాకు 'అల్-అమీన్' (విశ్వసనీయుడు) మరియు 'అస్-సాదిఖ్' (సత్యవంతుడు) అనే బిరుదులను ప్రసాదించారు."

అయితే, నిన్న సాయంత్రం వరకు మీరు నన్ను విశ్వసనీయుడిగా, సత్యవంతుడిగా, నిష్కపటుడిగా, అసత్యానికి దూరంగా, సత్యానికే అంకితభావంతో జీవించే వాడిగా, సత్యమే గర్వించే వ్యక్తిగా భావించారు. ప్రతి విషయంలో నాపై విశ్వాసం ఉంచి, నేను చెప్పిన ప్రతి మాటను అంగీకరించారు. కానీ ఈ రోజు, కేవలం ఒకే రోజులో, నేను అత్యంత నీచుడిగా, అత్యంత అపవిత్రుడిగా ఎలా మారిపోయాను? దానికి కారణం ఒక్కటేనా? ఇంతవరకు నేను మనుష్యులపై కూడా అసత్యాన్ని మోపని వాడిని, ఇప్పుడు అకస్మాత్తుగా అల్లాహ్‌పై అబద్ధాలను కల్పించడం ప్రారంభించానని మీరు అనుకుంటున్నారా?.

"ప్రకృతి ధర్మంలో ఇంత అకస్మాత్తుగా, ఇంత తీవ్రమైన మార్పుకు ఏదైనా ఉదాహరణ ఉందా?. ఇది ఒకటి లేదా రెండు రోజుల విషయం అయితే, మీరు దీనిని నటన అని అనవచ్చు. ఒకటి లేదా రెండు సంవత్సరాల విషయం అయితే, మిమ్మల్ని మోసగించేందుకు నేను అలా ప్రవర్తించానని మీరు చెప్పవచ్చు. కానీ నా జీవిత మంతా మీ మధ్యనే గడిచింది. నా బాల్యాన్ని మీరు చూశారు; నా యౌవనాన్ని మీరు గమనించారు; వృద్ధాప్యం ప్రారంభమయ్యే ఈ వయస్సు వరకు కూడా నా జీవితం మీ కళ్లముందే సాగింది. ఇంతకాలం నిరంతరంగా ఒక నాటకం ఆడటం, అబద్ధపు జీవితాన్ని కొనసాగించడం ఎలా సాధ్యం?. "బాల్యంలో, తనకు ఏది మేలు, ఏది కీడు అన్నది సరిగా తెలియని వయస్సులో, నేను ఇంతటి మోసాన్ని ఎలా పన్నగలిగాను? యౌవనం సాధారణంగా వాంఛల వయస్సు అని పిలవబడే దశలో నా నిజమైన స్వరూపాన్ని మోసంతో ఎలా దాచగలిగాను? కాబట్టి ఆలోచించండి. ఈ మోసం ఎప్పుడు జరిగింది? దాన్ని ఎవరు చేశారు?

"మీరు నా జీవితాన్ని పరిశీలించి, అది ఎలాంటి మచ్చలూ లేనిదని, పూర్తిగా నిస్వార్థమైందని, నిజానికి అది సద్గుణాల ప్రతిరూపమని, సత్యస్వరూపమని గ్రహిస్తే, సూర్యుడిని చూస్తూనే 'ఇది రాత్రి' అని చెప్పకండి. పగలు పూర్తిగా వెలిగిపోయింది; దానిని చీకటి అని ప్రకటించకండి. నా పరిస్థితి అలాంటిది. నా మాటలు పగటి వెలుగులా స్పష్టంగా ఉన్నాయి. వెలుగు ఉన్నప్పుడు చీకటి గురించి ఫిర్యాదు చేయకండి.

"నా స్వరూపం కంటే గొప్ప సాక్ష్యం మీకు ఇంకా కావాలా?. నా ఉనికే అత్యంత గొప్ప సాక్ష్యం. నా గత ప్రవర్తనను పరిశీలించిన తరువాత కూడా మరిన్ని ఆధారాలు అవసరమా?. నా జీవితమంతా మీ ముందే ఉంది. అయినప్పటికీ మీరు ఇంకా ఒక నిదర్శనం కోరుతున్నారు. నా వ్యక్తిత్వమే నాకు సాక్ష్యం చెబుతోంది. నా జీవితం నా తరపున సాక్ష్యంగా నిలుస్తోంది.

"మీలో ప్రతి ఒక్కరూ తమ అంతరాత్మను పరిశీలిస్తే, మీ హృదయం, మనస్సు రెండూ నా అంతరంగంలో సత్యం దృఢంగా స్థిరపడిందని, నేను సత్యంపైనే నిలిచి ఉన్నానని సాక్ష్యమిస్తాయి. ధర్మం నన్ను చూసి గర్విస్తుంది. నేనూ ధర్మాన్ని చూసి గర్విస్తాను. అలాంటి వ్యక్తికి తన సత్యతత్వాన్ని నిరూపించడానికి బాహ్య ఆధారాలు అవసరం లేదు. అతని ఉదాహరణ ఉదయించే సూర్యుని వంటిది. అతని ఉనికే అతని సాక్ష్యం.

"ఈ బలమైన సాక్ష్యమే హజ్రత్ అబూబకర్ (రజి) హృదయంలో ప్రవేశించింది. ఈ శక్తివంతమైన సాక్ష్యం సత్యాన్ని ప్రేమించే ప్రతి ఒక్కరి హృదయంలో నిరంతరం వేరు వేస్తూనే ఉంటుంది.

"దైవ ప్రవక్త (స) తమ దైవదూతత్వాన్ని ప్రకటించినప్పుడు, హజ్రత్ అబూబకర్ (రజి) ఒక మిత్రుని ఇంటిలో ఉన్నారు. అక్కడ ఒక విముక్తి పొందిన దాసి వారికి ఇలా చెప్పింది: తన యజమానురాలు, 'నా భర్త కూడా వారు చెప్పుకునే ప్రవక్త మూసా (అ) వలె ఒక ప్రవక్త అయ్యాడు' అని తెల్పుచున్నారు. ఆ విషయం విన్న వెంటనే హజ్రత్ అబూబకర్ (రజి) అక్కడి నుండి లేచి దైవ ప్రవక్త (స) ఇంటికి వెళ్లి, "మీరు నిజంగానే అల్లాహ్ యొక్క ప్రవక్త (స) అని ప్రకటించారా?" అని అడిగారు. దైవ ప్రవక్త (స) అందుకు సమాధానంగా, "అవును, నేను అల్లాహ్ యొక్క ప్రవక్తను" అని అన్నారు. అది విన్న వెంటనే, హజ్రత్ అబూబకర్ (రజి) ఎలాంటి సందేహం లేకుండా వారి ప్రకటనను అంగీకరించారు.

ఈ విధంగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తరువాత వారి విశ్వాసం గురించి ఇలా అన్నారు:

"నేను ప్రజలను ఇస్లాం వైపు ఆహ్వానించాను. ప్రతి సందర్భంలోనూ కొంత సంకోచం, ఆలోచన లేదా సందేహం కనిపించింది. కానీ ఇస్లాం సందేశం అబూబకర్ (రజియల్లాహు అన్హు) గారికి అందించబడినప్పుడు, ఆయన ఏమాత్రం సంకోచించలేదు, వెంటనే దానిని అంగీకరించారు."

"హజ్రత్ అబూబకర్ (రజియల్లాహు అన్హు) ఎలాంటి బాహ్య సూచన లేదా అద్భుతాన్ని చూడకుండానే ఎందుకు విశ్వసించారు?. దానికి కారణం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి వ్యక్తిత్వమే. అది నిజాయితీ మరియు సత్యంతో నిండి ఉండేది. వారి స్వరూపమే వారి సత్యానికి సాక్ష్యంగా నిలిచింది."

"అదేవిధంగా, నేను ఇంతకుముందు పేర్కొన్నట్లుగా, హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా), హజ్రత్ అలీ (రజియల్లాహు అన్హు), మరియు హజ్రత్ జైద్ బిన్ హారిసా (రజియల్లాహు అన్హు) కూడా ప్రవక్త (స) సత్యాన్ని ప్రత్యక్షంగా చూసి, దానికి సాక్ష్యమిచ్చారు."

"సంక్షిప్తంగా చెప్పాలంటే, ఒక ప్రవక్త యొక్క సత్యానికి తొలి అంతర్గత సాక్ష్యం వారి స్వీయమే. వారి వ్యక్తిత్వమే వారి సత్యాన్ని నిరూపిస్తుంది. ఈ సాక్ష్యం అంత బలమైనది కాబట్టి, దాని సమక్షంలో మరే ఇతర అద్భుతం లేదా బాహ్య సూచన అవసరం ఉండదు."

(దావతుల్-అమీర్, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 7, పుటలు 425-428)

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా పేర్కొన్నారు:

దేవుని సూక్తి ప్రకారం, నీతిమంతులు వినయం, నమ్రతతో నడుచుకునే వారు, అహంకారంతో మాట్లాడరు. వారు తమకంటే పెద్దవారితో మాట్లాడే ఒక సాధారణ వ్యక్తిలా మర్యాదగా సంభాషిస్తారు. ఏ పరిస్థితిలోనైనా, మన అభ్యున్నతికి దోహదపడే విధంగా ప్రవర్తించాలి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌పై ఎవరికీ ఏకాధిపత్యం ఉందని ఎవరూ చెప్పలేరు, ఎందుకంటే ఆయన కోరేది ఒక్క నీతినే. నీతిని ఆచరించే వాడు ఉన్నత స్థితిని పొందుతాడు. అల్లాహ్ యొక్క ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) , లేక ఇబ్రాహీం (అలైహిస్సలాం) గాని, వారసత్వం ద్వారా గౌరవాన్ని పొందలేదు. ఇస్లాం ప్రవక్త యొక్క గౌరవనీయ తండ్రి అబ్దుల్లాహ్ విగ్రహారాధకుడు కాదని మేము విశ్వసిస్తున్నాము (ప్రజలు తరచుగా ఈ ప్రశ్న అడుగుతారు; దానికి సమాధానం ఇదే. ప్రవక్త గారి తండ్రి విగ్రహారాధకుడు కాదు). అయితే, ఈ కారణం వల్లనే ఇస్లాం ప్రవక్తకు, ప్రవక్తత్వం ప్రసాదించబడలేదు. వారిలో స్వభావంలో ఉన్న సద్గుణాల కారణంగా, దైవకృపవల్ల వారికి ప్రవక్తత్వం అనుగ్రహించబడింది. దేవుని కృపను ఆకర్షించింది ఇదే.

ప్రవక్తల పితామహుడైన ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన కుమారుడిని ఏమాత్రం సంకోచం లేకుండా బలి ఇవ్వడానికి సిద్ధపడటానికి కారణం కూడ వారి హృదయ పూర్వకత, నీతియే. అంతేకాక, వారు స్వయంగా అగ్నిలో పడవేయ బడినప్పటికీ స్థిరంగా నిలిచారు.

ఇప్పుడు మన ప్రియతమ నాయకులు, అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి హృదయపూర్వకత, భక్తిని క్షణం ఆలోచించండి. వారు అన్ని రకాల దుష్టత్వానికి ఎదురొడ్డి నిలబడ్డారు. అనేక పరీక్షలు, కష్టాలు, బాధలు అనుభవించినప్పటికీ, వాటిని ఏమాత్రం లెక్కచేయలేదు. వారిలోని ఈ హృదయ పూర్వకత, భక్తియే సర్వోన్నతుడైన అల్లాహ్ కృపను ఆకర్షించింది. అందుకే అల్లాహ్ తాఆలా ఇలా ప్రకటించాడు:

إِنَّ اللّٰهَ وَمَلٰٓئِكَتَهٗ يُصَلُّوْنَ عَلَى النَّبِيِّ يٰٓاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا صَلُّوْا عَلَيْهِ وَسَلِّمُوْا تَسْلِيْمًا (الاحزاب:57)

"నిశ్చయంగా అల్లాహ్ మరియు ఆయన దేవదూతలుఈ ప్రవక్తపై ఆశీర్వాదాలను కురిపిస్తారు. కావున ఓ విశ్వాసులారా! మీరు కూడా ఆయనపై దరూద్ మరియు సలాంలను పంపండి." (అహ్జాబ్:57)

ఈ సూక్తి ద్వారా, అల్లాహ్ యొక్క ప్రవక్త (స) వారి కార్యాలు ఎంత గొప్పవో తెలుస్తుంది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్, వారి గుణాలను ప్రశంసించడానికి లేదా వారి మహిమను వివరించడానికి ప్రత్యేకమైన పదాలను ఉపయోగించలేదు. అలాంటి పదాలు ఉండవచ్చు. అయినప్పటికీ, దేవుడు స్వయంగా ఏ ఒక్క పదాన్నీ ప్రత్యేకంగా ఎన్నుకోలేదు. ఎందుకంటే, ప్రవక్త (స) వారి సత్కార్యాలు ప్రశంసలకు అతీతమైనవి. ఇలాంటి సూక్తి మరే ఇతర ప్రవక్తను గురించి ఖుర్‌ఆన్‌లో లేదు.

ప్రవక్త (స) వారి ఆత్మ ఎంతో హృదయపూర్వకత, పవిత్రతతో నిండి ఉండేవో, దేవుని దృష్టిలో వారి కార్యాలు అంతటి ప్రశంసనీయమైనవి. అందువల్ల, భవిష్యత్తులో అన్ని తరాల ప్రజలు ప్రవక్తపై ఆశీర్వాదాలు పంపాలని, అది కృతజ్ఞతకు చిహ్నంగా ఉండాలని అల్లాహ్ శాశ్వతంగా ఆదేశించాడు.

ప్రవక్త (స) వారి సంకల్పం, భక్తి, ఆధ్యాత్మిక నిష్ఠకు సమానమైన వ్యక్తి వారికి ముందు గానీ, వారి తర్వాత గానీ అవతరించలేదు, అవతరించదు కూడ. మసీహ్ (అలైహిస్సలాం) కాలాన్ని పరిశీలిస్తే, ఆయన సంకల్పం, ఆధ్యాత్మిక నిష్ఠ ఆయన శిష్యులపై ఎంతటి ప్రభావాన్ని చూపిందో గ్రహించవచ్చు. (15వ పేజీలో )

# మత సామరస్యత మరియు మతస్వేచ్ఛ దృక్పథం ఆధారంగా హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవిత చరిత్ర

(ప్రసంగం: ముహమ్మద్ ఇనాం ఘౌరి గారు నాజిర్ ఆలా మరియు ప్రాంతీయ అమీర్ ఖాదియాన్, వార్షిక సభ ఖాదియన్ డిసెంబర్ 2025)

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

لَآ اِكْرَاهَ فِى الدِّيْنِ ۙ قَدْ تَّبَيَّنَ الرُّشْدُ مِنَ الْغَيِّ

అనువాదం: మతములో ఎట్టి నిర్బంధము వుండకూడదు, దోషము నుండి విడివడి గుణము స్పష్టముగా కనిపించు చున్నది. (బఖర:257)

وَقُلِ الْحَقُّ مِنْ رَّبِّكُمْ فَمَنْ شَآءَ فَلْيُؤْمِنْ وَّمَنْ شَآءَ فَلْيَكْفُرْ

అనువాదం: మానవులతో ఇట్లనుము ఈ సత్యము నీ ప్రభువు వద్ద నుండియే అవతరించి ఉన్నది కనుక కోరువారు దీనిని విశ్వసించ వచ్చును కోరిన వారు దీనిని నిరాకరించవచ్చును (కహఫ్ :30)

قُوْلُوْٓا اٰمَنَّا بِاللّٰهِ وَمَآ اُنْزِلَ اِلَيْنَا وَمَآ اُنْزِلَ اِلٰٓى اِبْرٰهٖمَ وَاِسْمٰعِيْلَ وَاِسْحٰقَ وَيَعْقُوْبَ وَالْاَسْبَاطِ
وَمَآ اُوْتِىَ مُوْسٰى وَعِيْسٰى وَمَآ اُوْتِىَ النَّبِيُّوْنَ مِنْ رَّبِّهِمْ ۚ لَا نُفَرِّقُ بَيْنَ اَحَدٍ مِّنْهُمْ وَنَحْنُ لَهٗ مُسْلِمُوْنَ

అనువాదం: ఇట్లు చెప్పుము. మాకు అల్లాహ్ యందు విశ్వాసము ఉన్నది, మా కొరకు అవతరించిన సందేశము పట్ల విశ్వాసమున్నది. ఇబ్రహీం, ఇస్మాయిల్ ఇస్హాక్, యాకూబ్, వారి సంతానమునకు, మూసాకూ ఏసుక్రీస్తుకు ప్రవక్తలందరికి వారి ప్రభువు అందజేసిన జ్ఞానము పట్ల మాకు విశ్వాసం ఉన్నది. మేము ఈ ప్రవక్తలలో ఎవరి పట్ల గాని విభేదమును పాటించము, మేము ఆ ప్రభువుకే విధేయులము.

శ్రోతలారా! మత సామరస్యత మరియు మతస్వేచ్ఛ దృక్పథం గురించి, పవిత్ర ఖురాన్ వివిధ ప్రదేశాలలో ఇటువంటి ప్రాథమిక వాస్తవాలను మరియు ఆదేశాలను పేర్కొన్నది. వాటిని గమనించి అమలు చేస్తే, ప్రతిరోజూ మతం పేరుతో జరిగే పోరాటాలు, హత్యలు మరియు విధ్వంస సంఘటనలను నిర్మూలించవచ్చు, ఇందుకు నిబంధన ఏమిటనగా, ఈ శాంతియుత మరియు ప్రశాంతమైన బోధనలను రాజకీయ ప్రయోజనాల నుండి వేరుగా, ధర్మబద్ధముగా ఉంచవలేను.

సమయ పరిమితుల కారణంగా, నేను మూడు సూక్తులను మరియు వాటి అనువాదాన్ని మాత్రమే ప్రస్తుతం సమర్పించాను. మతం అనేది ఒక రాజకీయ పార్టీ, ఒక దేశం లేదా ఒక వర్గం పేరు కాదనే ప్రాథమిక వాస్తవాన్ని అర్థంచేసుకోవాలి మరియు గుర్తుంచుకోవాలి. అయితే మతం యొక్క వాస్తవికత ఏమిటంటే, అది మానవాళి యొక్క భౌతిక, నైతిక మరియు ఆధ్యాత్మిక పరిస్థితులను సరిదిద్దుతుంది. ఆపై దాని నిజమైన సృష్టికర్తతో స్వచ్ఛమైన మరియు దృఢమైన సంబంధాన్ని ఏర్పరచుకునే మార్గాన్ని చూపుతుంది. ఈ ప్రయోజనం కోసమే సకల లోకాల సంరక్షకుడైన అల్లాహ్, ప్రతి దేశంలో, ప్రతి సమాజంలో తన నాయకులను, మార్గదర్శకులను మరియు ప్రవక్తలను పంపుతూ వస్తున్నాడు. అల్లాహ్ ఇలా తెలిపాడు: **" వలికుల్లి ఉమ్మతిన్ రసూలున్ "** అనగా ప్రతి జాతికి ఎవరో ఒక ప్రవక్త ఉన్నాడు. (యూనుస్: 48) మరల ఇలా తెలిపాడు: **" వలికుల్లి ఖౌమిన్ హాదిన్ "** అనగా ప్రతి జాతికి ఒక మార్గదర్శి ఒక నాయకుడు ఉన్నాడు.

అందుకే ముస్లింలకు బోధించబడినదేమనగా, మీరు హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా (సల్లల్లాహు అలైహి వసల్లం)పై అవతరించబడిన దివ్య ఖురాన్‌ను విశ్వసిస్తున్నప్పటికీ, విశ్వాసం పూర్తి కావడానికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ముందు అవతరించిన ప్రవక్తలందరిని, తమ తమ కాలాల్లో తమ తమ ప్రజలను సంస్కరించడం మరియు మార్గనిర్దేశం చేయడం కోసం వారిపై అవతరించిన దైవవాణులను, వాక్కులను మరియు చట్టాలను, మరియు వారు తీసుకువచ్చిన ధర్మశాస్త్రాలను సూత్రప్రాయంగా తప్పకుండా విశ్వసించాలి. అదే విధముగా **లానుఫర్రిఖు బయిన అహదిన్ మ్మిర్రుసులిహీ** అనగా మనం ముస్లింలు దేవుని ప్రవక్తలలో ఎవరి మధ్యనూ ఎటువంటి తేడాను చూపరని ఒప్పుకోవాలి. అనగా, ప్రవక్తత్వం యొక్క స్థానపరంగా అందరూ సమానమే, అయినప్పటికీ వారి బాధ్యతలు, విధులు మరియు పరిధి పరంగా వారి హోదాలలో ఖచ్చితంగా తేడా ఉంది.

ఈ సంక్షిప్త పరిచయం తర్వాత, మతసామరస్యత మరియు మతపరమైన స్వేచ్ఛపై ఖురాన్ బోధనల వెలుగులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి సూచనలు మరియు బోధనలలో నుండి కొన్ని ఉదాహరణలపే సమయ పరిమితులను దృష్టిలో ఉంచుకొని ప్రవేశపెట్టదను. ఇంటి నుండి ప్రారంభిస్తే, ఒక కుమారుడు మతం మారినప్పుడు, అతని తల్లిదండ్రులు అతన్ని బహిష్కరిస్తారు మరియు అతని బంధువులు కూడా సామాజిక సంబంధాలను తెంచుకుంటారు. ఈ సందర్భంలో, ఒక ముస్లింకు ఎలాంటి విద్య ఇవ్వబడింది?. ఒకసారి ఒక వ్యక్తి ఇలా అన్నాడు, "ఓ అల్లాహ్ ప్రవక్త! నాకు కొంతమంది బంధువులు ఉన్నారు. నేను వారితో సంబంధాలు ఏర్పరుచుకుంటాను మరియు వారు వాటిని విచ్ఛిన్నం చేస్తారు. నేను వారికి సహాయం చేస్తాను మరియు వారు వాటిని దుర్వినియోగం చేస్తారు. వారు నా సాహోదర్యం మరియు సౌమ్యతకు అతిగా మరియు అజ్ఞానంతో ప్రతిస్పందిస్తారు." అందుకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, "వారు మీరు వివరించినట్లు చేస్తే, మీరు వారి ముఖాలపై దుమ్ము చల్లుతున్నట్లుగా ఉంటుంది, అంటే, వారికి సహాయం చేయడం ద్వారా, మీరు వారిని చాలా సిగ్గుపడేలా చేసారు, వారు ఇకపై వారి ముఖాలను చూపించడానికి ఇష్టపడరు. మరియు మీరు మీ మంచి ప్రవర్తన యొక్క ఈ ఉదాహరణను కొనసాగించినంత కాలం అల్లాహ్ మీకు సహాయముగా దేవదూతను నియమిస్తాడు."

**(మస్నద్ అహ్మద్, వాల్యూమ్. 2, పేజీ 300, ఈజిప్టు)**

హజ్రత్ అస్మా బిన్త్ అబూబకర్ రజి ఇలా తెలిపారు. బహుదేవతారాధన చేయునట్టి నా తల్లి నన్ను చూడటానికి మదీనాకు వచ్చింది. ఆమె బహుదేవతారాధన అయినప్పటికీ నేను ఆమెను బాగా చూసుకోవాలా? అని నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ని అడిగాను. వారు ఇలా అన్నారు: ఎందుకు కాదు? అన్నింటికంటే ముందు, ఆమె మీ తల్లి, కాబట్టి ఆమెను బాగా చూసుకోండి.

**(బుఖారీ, కితాబుల్ అదాబ్, బాబ్ సిలతుల్ వాలిదతుల్ ముష్రిక్)**

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బంధువులలో ఎక్కువ మంది వారి ప్రవక్తత్వ వాదనను వ్యతిరేకించడంలో చాలా క్రూరంగా వ్యవహరించారు. కానీ వారు ఇలా అనేవారు, "నిజానికి, ఖురైష్ యొక్క ఫలాన తెగ నా శత్రువుగా మారింది, కానీ అన్నింటి కంటే, నాకు వారితో రక్త సంబంధం ఉంది. నేను ఈ బంధుత్వ సంబంధం యొక్క హక్కులను ఏ సందర్భంలోనైనా నెరవేర్చడం కొనసాగిస్తాను." కాబట్టి, వారి సహచరులలో ఒకరు సుమామా బిన్ ఉసాల్, వారు యమామాలో నివసించేవారు. మక్కా ప్రజల కొరకు గోధుమలు తెచ్చేవారు. అతను ఇస్లాం స్వీకరించిన తరువాత, మక్కా ప్రజలు దైవ ప్రవక్తతో క్రూరంగా ప్రవర్తిస్తున్నారని తెలుసుకున్నప్పుడు, ఇక నుండి ఒక్క గోధుమ గింజ కూడా ఇక్కడి నుండి మక్కాకు చేరదని నిర్ణయించుకున్నాడు. మరియు అతను మక్కా ప్రజలకు ఇలా చెప్పాడు: నా ప్రియమైన వ్యక్తి ఇందుకు అనుమతించనంత వరకు, యమామా నుండి ఒక్క గోధుమ గింజ కూడా రాదు. అప్పుడు మక్కా ప్రజలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను బంధుత్వం నేరవేర్చమని కోరారు, మా గోధుమలు ఆగిపోయాయి మరియు మేము ఆకలితో ఉన్నాము, మాపై దయ చూపండి. అందువలన, ఈ సకల లోకాల కరుణామయుడి కృపతో, మక్కా ప్రజలకు గోధుమలు రావడం తిరిగి ప్రారంభమయ్యాయి.

**(సీరతున్నబవియ్యత్ లి ఇబ్నే హిషామ్)**

అదేవిధంగా, మదీనాకు వలస వచ్చిన తర్వాత, మక్కా ప్రజలను తీవ్రమైన కరువు ముంచెత్తింది. వారు ఎముకలు మరియు మృతజీవులను తినవలసి వచ్చింది. అప్పుడు, బలవంతంగా, అబూ సుఫ్యాన్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు వచ్చి, "ఓ ముహమ్మద్! (సల్లల్లాహు అలైహి వసల్లం ) మీరు బంధుత్వాన్ని కొనసాగించమని ఆజ్ఞాపిస్తారు మరియు ఇప్పుడు మీ ప్రజలు నశించిపోతున్నారు. వర్షం పడాలని మరియు కరువు కాటకాలు మా నుండి దూరం కావాలని మా కొరకు ప్రార్థించండి." షుఅబ్ అబీ తాలిబ్ లో తనను మరియు తన కుటుంబాన్ని వరుసగా మూడు సంవత్సరాలు ముట్టడించి, ఆహారం మరియు నీళ్ళు కూడా వారికి చేరనివ్వకుండా ముట్టడించిన మక్కావాసులు వీరే అయినప్పటికీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెంటనే తన చేతులను పైకెత్తారు. ఈ ప్రార్థన ఎంతగా ఆమోదించబడినదనగా, సమృద్ధిగా వర్షాలు కురిశాయి మరియు మక్కా ప్రజల సుఖశాంతుల రోజులు తిరిగి వచ్చాయి.

**(బుఖారీ, కితాబుత్తఫ్సీర్, సూరా అర్రోమ్, అద్దుఖాన్)**

పొరుగు వారి విషయానికి వస్తే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇరుగు వారితో మరియు పొరుగు వారితో వారు ముస్లింలైనను లేదా ముస్లిమేతరులైనను ఎలాంటి తేడా లేకుండా, సామరస్యముగా మరియు మంచి ప్రవర్తనతో వ్యవహరించాలని నొక్కిచెప్పారు, ఒకవేళ దీనిని ఆచరించినచో, కేవలం మతపరమైన విభేదాల ఆధారంగా ఎటువంటి విభేదాలు ఎప్పుడూ తలెత్తవు.

హజ్రత్ అబూ హురైరా రజి ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలిపారు. అల్లాహ్ ప్రమాణం! ఆ వ్యక్తి విశ్వాసి కాదు. అల్లాహ్ ప్రమాణం!, ఆ వ్యక్తి విశ్వాసి కాదు. అల్లాహ్ ప్రమాణం!, ఆ వ్యక్తి విశ్వాసి కాదు (వారు (స) ఈ మాటలను మూడుసార్లు పునరావృతం చేశారు). అనుచరులు అడిగారు, ఓ అల్లాహ్ ప్రవక్త! ఎవరు విశ్వాసి కాదు?. అందుకు ప్రవక్త (స) ఇలా అన్నారు: తన దుష్టత్వం మరియు దుర్మార్గాల నుండి ఎవరి పొరుగువారు సురక్షితంగా లేరో అతడు. **(బుఖారి)**

దుర్మార్గాలు వివిధ మార్గాల్లో జరుగుతాయి. కొన్నిసార్లు రాత్రి సమయంలో,

ఒక వ్యక్తి రేడియో లేదా టీవీలో ఒక కార్యక్రమాన్ని పెద్ద శబ్దంతో వింటాడు, ఇది అతని పొరుగు వారిని నిద్రపోకుండా నిరోధిస్తుంది. కొన్నిసార్లు, ఇంటి చెత్తను తన పొరుగు వారి తలుపు ముందు వేస్తారు.

హజ్రత్ అబూ జర్ రజి ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తనను ఉద్దేశించి ఇలా అన్నారు: ఓ అబూ జర్! మీరు మంచి భోజనం తయారు చేసినప్పుడల్లా, దానిలో కొంచెం చారును ఎక్కువగా పోసి మీ పొరుగు వారికి కూడా అందించేలా చూసుకోండి, అంటే కొన్నిసార్లు మీ పొరుగు వారికి కొంత భోజనం పంపండి.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ రజి ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను నేను మంచి చేస్తున్నానా లేదా చెడు చేస్తున్నానా అని నాకు ఎలా తెలుస్తుంది? అని అడిగారు.వారిలా అన్నారు: మీరు మీ పొరుగువారు మంచివారని చెప్పడం విన్నప్పుడు, మీ ప్రవర్తన మంచిదని అర్థం చేసుకోండి, మీ పొరుగువారు మీరు గొప్పవారని చెప్పడం విన్నప్పుడు, మీ ప్రవర్తన గొప్పదని అర్థం చేసుకోండి. (ఇబ్న్ మాజా, కితాబు జ్జుహద్, హదీస్ 4223)

మరల తమ మతాన్ని మరియు ధర్మాన్ని వ్యాప్తి చేయడానికి బలవంతం చేయడం లేదా యుద్ధం చేయడం అనుమతించబడదు. నేను ప్రారంభంలోనే పవిత్ర ఖురాన్ యొక్క స్పష్టమైన ప్రకటనను అందించాను, **లా ఇక్రాహ్ ఫిద్దీన్** అనగా "మతంలో బలవంతం లేదు." సత్యం మీ ప్రభువు నుండి వచ్చిందని కూడా ఇది ప్రకటించింది, దాని తర్వాత ఎటువంటి బలవంతం అనే ప్రశ్న లేదు, ఎందుకంటే సత్యం అంటే హృదయాలను దాని సత్యం మరియు మంచితనంతో ఒప్పించేది, దీనికి బలవంతం మరియు హింస యొక్క అవసరం లేదు. ఇప్పుడు ప్రజలు దానిని నమ్మడానికి లేదా తిరస్కరించడానికి ఎంపిక చేసుకున్నారు.

మరొక సూక్తిలో **లకుం దీనుకుం వలియదీన్** అనగా మీకు మీ మతం ఉంది, మరియు నాకు నా మతం ఉంది" అని ప్రకటించబడింది. అంటే, ఓ అవిశ్వాసులారా మరియు వ్యతిరేకులారా, మీకు మీ మతం యొక్క స్వేచ్ఛ ఉంది మరియు నాకు నా మతం యొక్క స్వేచ్ఛ ఉంది. (సూరా అల్-కాఫిరున్: 7)

పేర్కొన్న సూక్తులు మతపరమైన స్వేచ్ఛ యొక్క నాలుగు ప్రాథమిక హక్కులను మంజూరు చేస్తాయి.

మొదట, ఎవరినీ ఒకరు తమ మతంలోకి బలవంతం చేర్చుకోలేము. రెండవది, స్వచ్ఛందంగా ఒక మతంలో చేరిన వ్యక్తిని బలవంతంగా అడ్డుకోలేము. మూడవది, ఒకరు తమ విశ్వాసానికి కట్టుబడి ఉండటం మరియు వారి ప్రకటన మరియు వ్యక్తీకరణ ప్రకారం ఆచారాలు మరియు పూజలను నిర్వహించడంపై ఎటువంటి పరిమితి లేదా బలవంతం అనుమతించబడదు. మరియు నాల్గవది, ఎవరైనా ఒక మతంలో ఉండటానికి ఇష్టపడకపోతే, వారిని దానిలోనే ఉండమని బలవంతం చేయడం అనుమతించబడదు మరియు ఉండాలని కోరుకునే వారిని దానిని విడిచిపెట్టమని బలవంతం చేయడం అనుమతించబడదు. ఇస్లామిక్ యుద్ధాలకు వ్యతిరేకంగా లేవనెత్తిన అభ్యంతరం పూర్తిగా తప్పుడు ఆరోపణ అని ఇక్కడ గమనించాలి. ఇస్లామిక్ యుద్ధాలు కేవలం రక్షణాత్మక యుద్ధాలా లేదా అవి దేశద్రోహం మరియు అవినీతిని తొలగించి శాంతి మరియు సామరస్యాన్ని నెలకొల్పడం కోసమే చేయబడినవి.

హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి నడవడికను చూసినచో , అల్లాహ్ తాలా వారిని మొత్తం ప్రపంచానికి మార్గదర్శిగా మరియు ప్రవక్తగా పంపినను, హోదా పరంగా ప్రవక్తల ముద్రగా నియమించినప్పటికీ, తగని సమయంలో లేదా ప్రదేశంలో తాను ఇతర ప్రవక్తల కంటే ఉన్నతుడిని అని ప్రచారం చేస్తూ, ఏ ముస్లిం కూడ శాంతియుత వాతావరణాన్ని పాడుచేయడాన్ని వారు ఎప్పుడూ ఇష్టపడలేదు లేదా సహించలేదు. అందువల్ల, సహీహ్ బుఖారీలో ఒక కథనము ఇలా గలదు. ఒకప్పుడు ఒక యూదుడు మార్కెట్లో వస్తువులను అమ్ముతున్నప్పుడు ఒక ముస్లిం ఒక వస్తువుకు తక్కువ ధరకు చెప్పినప్పుడు, అది యూదుడికి అసహ్యంగా అనిపించింది మరియు అతను "మోషేకు అన్ని మానవాళిపై ప్రాధాన్యత ఇచ్చినవాడి ప్రమాణం" అని అన్నాడు. దీనితో, ముస్లిం కోపంతో ఆ యూదుడిని చెంపదెబ్బ కొట్టాడు. ఈ యూదుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి, "మేము మీ రక్షణ మరియు అభయంలో ఉన్నాము. ఈ ముస్లిం నన్ను చెంపదెబ్బ కొట్టడం ద్వారా నాకు అన్యాయం చేశాడు" అని అన్నాడు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ ముస్లింపై చాలా కోపంను చూపించారు. మరియు "ప్రవక్తలలో నాకు ప్రాధాన్యత ఇవ్వవద్దు" అని అన్నారు.

మత సామరస్యతను పెంపొందించడానికి, మతపరమైన విభేదాలు ఉన్నప్పటికీ, మనం అంగీకరించగల మరియు పరస్పర ద్వేషాన్ని ఆపగల పాయింట్‌ను కనుగొనుటకు మనం తప్పకుండా ప్రయత్నించాలి. అందుకే అల్లాహ్ తాలా ఆ విషయాన్ని గూర్చి పవిత్ర ఖురాన్‌లో ఇలా వెల్లడించాడు.

قُلْ يَاَهْلَ الْكِتٰبِ تَعَالَوْا اِلٰى كَلِمَةٍ سَوَآءٍۢ بَيْنَنَا وَبَيْنَكُمْ اَلَّا نَعْبُدَ اِلَّا اللّٰهَ
وَلَا نُشْرِكَ بِهٖ شَيْـًٔا وَّلَا يَتَّخِذَ بَعْضُنَا بَعْضًا اَرْبَابًا مِّنْ دُوْنِ اللّٰهِ ؕ فَاِنْ تَوَلَّوْا
فَقُوْلُوا اشْهَدُوْا بِاَنَّا مُسْلِمُوْنَ (٦٥)

అనగా: నీవిట్లనుము.ఓ గ్రంథము పొందిన ప్రజలారా! మనకు మరియు మీ మధ్య సర్వసాధారణమైన మాట వైపు రండి. మనం అల్లాహ్‌ను తప్ప మరెవరినీ ఆరాధించము, ఆయనకు దేనినీ భాగస్వామిగా చేర్చము, మరియు మనలో ఎవరూ కూడ అల్లాహ్‌ను తప్ప ఎవరినీ ప్రభువుగా చేసుకోకూడదు. కానీ వారు వెనుదిరిగితే, మీరిట్లనుము " నిశ్చయముగా మేము విశ్వాసులము. దీనికి మీరే సాక్షులు"

**(ఆలె ఇమ్రాన్: 65)**

ఇప్పుడు చూద్దాం, దీనిలో, ఒక నిర్దిష్ట మరియు అంగీకరించబడిన విషయంపై ఐక్యత అవసరం , కానీ ఎవరైనా ఈ సూత్రాన్ని కూడా అంగీకరించడానికి సిద్ధంగా లేకుంటే, అతనితో వాదించడానికి మరియు పోరాడటానికి అనుమతి లేదు. ఇది మాఅభిప్రాయం మరియు ఇది మా విశ్వాసం అని అతనికి చెప్పడం సరిపోతుంది.

మక్కా అవిశ్వాసుల నిరంతర వ్యతిరేకత మరియు క్రూరమైన వేధింపుల కారణంగా మరియు అన్నింటికంటే ముఖ్యంగా, ముస్లింలు వారి నమ్మకాల ప్రకారం నడుచుకోకుండా మరియు బోధించకుండా బలవంతంగా నిరోధించబడినందున దేవుని అనుమతితో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మక్కా నుండి మదీనాకు వలస వచ్చారు. అక్కడ కొన్ని కొత్త ముస్లిం కుటుంబాలతో పాటు, మూడు యూద తెగలు ఉన్నాయి: బను ఖైనుఖా, బను నాజిర్, మరియు బను ఖురైజా, మరియు రెండు అన్యమత తెగలు: ఔస్ మరియు ఖజ్‌రజ్.

ఈ ఐదు తెగల మధ్య ఎలాంటి వ్యవస్థ, సంస్థాగతం అనేదే లేదు. ముఖ్యంగా, మూడు యూద తెగలు స్వతంత్రంగా మరియు స్వయం ప్రతిపత్తితో వేర్వేరు కోటలలో నివసిస్తున్నాయి. ఈ పరిస్థితులలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ముఖ్యంగా మదీనా ప్రాంతంలో మత సామరస్యత మరియు శాంతి, భద్రతలను నెలకొల్పే లక్ష్యంతో యూద తెగలతో ఒక వ్రాతపూర్వక ఒప్పందాన్ని చేసుకున్నారు. దీని నిబంధనలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

1. ముస్లింలు మరియు యూదులు కరుణ మరియు నిజాయితీతో జీవిస్తారు మరియు ఒకరిపై ఒకరు అతిగా లేదా క్రూరంగా వ్యవహరించరు.

2. ప్రతి జాతికి మత స్వేచ్ఛ ఉంటుంది.

3. అన్ని రకాల విభేదాలు మరియు వివాదాల కోసం, వారు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వెళతారు మరియు ప్రతి ఒక్కటి ఆ దేశం యొక్క చట్టం ప్రకారం నిర్ణయించబడుతుంది.

4. పౌరులందరి జీవితాలు మరియు ఆస్తులు సురక్షితంగా ఉంటాయి.

5. ఏదైనా జాతి యూదులు లేదా ముస్లింలపై యుద్ధం చేస్తే, యూదులు మరియు ముస్లింలు ఒకరికొకరు మద్దతు మరియు సహాయం కోసం నిలబడతారు.

6. మదీనాపై దాడి జరిగితే, వారందరూ కలిసి పోరాడతారు.

7. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుమతి లేకుండా ఏ పార్టీ యుద్ధానికి వెళ్ళదు.

8. ఈ ఒప్పందం ప్రకారం, ఏ అణచివేతదారుడు లేదా దుర్మార్గుడు శిక్ష మరియు ప్రతీకారం నుండి సురక్షితంగా ఉండడు. మొదలైనవి.

యూద తెగలు ఈ ఒప్పందాన్ని ఉల్లంఘించడం కొనసాగించినప్పటికీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎల్లప్పుడూ వారితో మంచిగా వ్యవహరించారు మరియు తన వాగ్దానాన్ని నెరవేర్చారు.

కావున, అటువంటి అనుకూల పరిస్థితులలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మదీనా పాలన వ్యవస్థీకరణను చాలా తెలివైన రీతిలో నిర్వహించారు. ముఖ్యంగా వివిధ మతాలు మరియు విభిన్న వర్గాలు మరియు విశ్వాసాలకు చెందిన వ్యక్తులు ఉన్న ప్రాంతంలో. ప్రతి ఒక్కరికీ వారి విశ్వాసం మరియు సాంప్రదాయంను ఆచరించడానికి, దానిని వ్యక్తీకరించడానికి మరియు శాంతియుతంగా ప్రచారం చేయడానికి మరియు ఆచరణల ద్వారా దానిని వ్యక్తపర్చుడానికి స్వేచ్ఛ ఇవ్వడం మత స్వేచ్ఛ మరియు సమరస్యతకు అసమానమైన ఉదాహరణ.

ఒకసారి నజ్రాన్ నుండి ఒక క్రైస్తవ ప్రతినిధి బృందం మతపరమైన చర్చ కోసం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు మదీనాకు వచ్చింది. ప్రవక్త (స) వారికి మస్జిద్‌యే నబ్వీలో చాలా గౌరవ, మర్యాదలతో కూడిన వసతి కల్పించారు మరియు వారు తమ ఆరాధన కోసం బయటకు వెళ్లాలని చూస్తున్నప్పుడు, ప్రవక్త (స) ఇలా అన్నారు! ఇక్కడ మరియు అక్కడకు వెళ్లవలసిన అవసరం లేదు, మీరు మీ స్వంత పద్దతిలో ఈ మసీదులో ఆరాధనలు చేసుకోవచ్చు.

అల్లాహ్‌ను కాకుండా ఇతర జీవులను మరియు వస్తువులను పూజించే వారిని కూడ మీరు దూషించకూడదని పవిత్ర ఖురాన్ బోధిస్తుంది. లేకుంటే వారు తమ అజ్ఞానం కారణంగా శత్రుత్వం వలన అల్లాహ్‌ను కూడ దూషిస్తారు.

**(సూరా అల్-అనామ్: 109)**

మక్కాలోని బహుదైవారాధకులు ఉహుద్ యుద్ధంలో ముస్లిం అమరవీరుల మృతదేహాలను వికృతీకరించారు, అంటే వారి ముక్కులు, చెవులు మొదలైన వాటిని కోసివేశారు, కానీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎప్పుడూ ఈ విధంగా ప్రతీకారం తీర్చుకోలేదు. దీనికి విరుద్ధంగా, ఒకప్పుడు ఒక యూదుడి అంత్యక్రియల ఊరేగింపు వస్తోందని గ్రహించిన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మృతదేహానికి గౌరవం ఇవ్వడానికి లేచి నిలబడ్డారు. ఎవరో ఇలా అన్నారు, "ఓ

అల్లాహ్ ప్రవక్తా! ఇది ఒక యూదుడి అంత్యక్రియల ఊరేగింపు." ప్రవక్త (స) ఇలా అన్నారు, "ఆయనకు ఆత్మ లేదా? ఆయన మానవుడు కాదా?"

(బుఖారీ, కితాబుల్ మఘాజీ, హదీస్ 1312)

హజ్రత్ యాఅలా బిన్ ముర్రా రజి ఇలా ఉల్లేఖించారు: నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో చాలాసార్లు ప్రయాణించాను. హుజూర్ (స) ఎక్కడైన పడి ఉన్న మానవ మృతదేహాన్ని చూసినచో, దానిని సమాధి చేయకుండా ముందుకు వెళ్ళడం నేను చూడలేదు. మరియు వారు (స) మృతుడు ముస్లింనా లేక అవిశ్వాసినా అని ఎప్పుడూ అడగలేదు.

బదర్ యుద్ధంలో మరణించిన బహుదైవారాధన నాయకుల మృతదేహాలను బహిరంగ మైదానంలో వదిలి బహుదైవారాధకులు మక్కాకు పారిపోయారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారందరినీ బదర్ యొక్క ఖలీబ్ అనే గుంటలో ఖననం చేయించారు. **(బుఖారీ, కితాబుల్ మఘాజీ, హదీస్ 3976)**

అహ్జాబ్ యుద్ధంలో, బహుదైవారాధన నాయకుడు నౌఫల్ బిన్ అబ్దుల్లా మఖ్జూమి యుద్ధంలో మరణించాడు. హజ్రత్ హంజాకు జరిగిన క్రూరమైన హింస కారణంగా తమ నాయకుడు కూడా అదేవిధంగా వ్యవహరించబడతారని మక్కాలోని బహుదైవారాధకులు సహజంగానే భయపడ్డారు. వారు అల్లాహ్ ప్రవక్త (స)కు 'పదివేల దిర్హామ్‌లు మా నుండి తీసుకొని నౌఫల్ మృతదేహాన్ని తిరిగి ఇవ్వమని సందేశం పంపారు'. అల్లాహ్ ప్రవక్త (స) ఇలా అన్నారు, "మేము మృతులకు వెల కట్టము. మీరు మీ మృతుడిని తీసుకవెళ్ళండి."

**(దలాయిలే నబువ్వత్ లిల్ బెహెహఖీ, సంపుటి 3)**

జయించిన మరియు ఓడిన జాతుల పట్ల, ముఖ్యంగా ఎవరి చేతుల్లో వారు చాలా కాలంగా చెప్పలేని బాధలు మరియు హింసలను భరించారో వారి పట్ల దయ చూపడం అనేది ప్రపంచ చరిత్రలో ఇస్లాం స్థాపకులు హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా (సల్లల్లాహు అలైహి వసల్లం) విషయంలో తప్ప మరెక్కడా కనిపించదు. మక్కాలోని బహుదైవారాధన నాయకుడు అబూ జహల్ కుమారుడు ఇక్రిమా, తన తండ్రిలాగే, తన జీవితాంతం అల్లాహ్ ప్రవక్త (స)కు వ్యతిరేకంగా పోరాడాడు. మక్కా విజయోత్సవం సందర్భంలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సాధారణ క్షమాభిక్ష ప్రకటించినప్పటికీ, అతను ఒక దళంపై దాడి చేసి హరమ్‌లో రక్తపాతం సృష్టించాడు. మరియు అతని యుద్ధ నేరాలకు మరణశిక్షకు అర్హుడిగా పరిగణించబడ్డాడు. తన ప్రాణాలను కాపాడుకోవడానికి, అతను యెమెన్‌కు పారిపోయాడు. అతని భార్య ఉమ్మె హకీమ్, ఆమె ముస్లింగా మారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నుండి క్షమాపణ కోరింది, మరియు ప్రవక్త (స) ఆమెను చాలా దయతో క్షమించాడు. ఆమె తన భర్తను తిరిగి తీసుకురావడానికి పరిగెత్తింది మరియు అతను ఓడ ఎక్కబోతుండగా, అతనిని ఆమె లాగి, "మనం తిరిగి వెళ్దాం, దైవ ప్రవక్త (స) నిన్ను క్షమించాడు" అని తెల్పింది. కానీ ఇక్రిమా తన క్షమాపణను నమ్మలేదు. అయినా కూడ తన భార్య ఆదేశం మేరకు, అతను వణుకుతూ మక్కాకు తిరిగి వచ్చి, మీరు నన్ను నిజంగా క్షమించారా! అని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అడిగాడు. అందుకు వారు (స) "అవును, నేను నిన్ను క్షమించాను" అని అన్నారు. అప్పుడు అతడు "నా మతంలో నేను ఉంటున్నా కూడ మీరు నన్ను క్షమించారా?" అని అడిగాడు. అందుకు ప్రవక్త (స) "అవును" అని అన్నారు. అప్పుడు బహుదైవారాధకుడైన ఇక్రిమా హృదయం ఇస్లాం పట్ల కరిగి పోయింది మరియు ఈ సామరస్యతను మరియు మంచి తనంను చూసి, అతను ఇలా అన్నాడు, "ఓ ముహమ్మద్! (సల్లల్లాహు అలైహి వసల్లం) మీరు చాలా దయగలవారు మరియు చాలా ఉదారవంతులు. అల్లాహ్ తప్ప వేరే దేవుడు లేడని మరియు ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అల్లాహ్ యొక్క ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను.

**(సీరతుల్ హలబియా, వాల్యూమ్ 3, పేజీ 92, బీరూట్)**

అదేవిధంగా, ఈ నేరస్థులలో అబూ సుఫ్యాన్ భార్య హింద్ బింత్ ఉత్బా కూడా ఉన్నారు, ఆమె ఉహద్ యుద్ధంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పిన్నాన్న హజ్రత్ హంజా మృతదేహంతో అమానుషంగా వ్యవహరించింది. మరియు ఆమె అతని ముక్కు, చెవులు మరియు ఇతర అవయవాలను కత్తిరించి అతని శరీరాన్ని వికృతీకరించింది మరియు ప్రతీకార అగ్నిని చల్లార్చడానికి అతని కాలేయాన్ని నమిలింది. మక్కా విజయాల తర్వాత, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్త్రీల నుండి బైఅత్ తీసుకొనునప్పుడు, ఆమె కూడా ముసుగు ధరించి కూర్చుంది ఎందుకంటే ఆమె నేరాల కారణంగా ఆమె కూడా చంపబడుతుందని ప్రకటించడం జరిగింది.

హజ్రత్ ముస్లేహ్ మౌఊద్ (రజియల్లాహు అన్హు) ఇలా పేర్కొన్నారు…

"మహిళలు బైఅత్ చేయడానికి వచ్చినప్పుడు, హిందా కూడా వారితో పాటు ముసుగు ధరించి వచ్చి బైఅత్ చేసింది. బైఅత్ సమయంలో అల్లాహ్‌కు తో భాగస్వాములను చేయకూడదనే షరతుకు వచ్చినప్పుడు, ఆమె తన అధిక ప్రసంగం స్వభావం వలన ఇలా అంది, "ఓ అల్లాహ్ ప్రవక్తా! మేము ఇంకా అల్లాహ్‌కు భాగస్వాములను కల్పిస్తామా? మీరు ఒంటరిగా ఉన్నారు మరియు మేము మా శక్తి మరియు బలముతో మీతో పోరాడాము. మా దేవుడు సత్యవంతుడైతే, మీకు ఎందుకు విజయం లభిస్తుంది? వారు పూర్తిగా పనికిరాని వారని నిరూపించబడ్డారు మరియు మేము ఓడిపోయాము." దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, "నీవు హిందావా?" ప్రవక్త (స) ఆమె స్వరాన్ని గుర్తించారు. ఎందుకనగా ఆమే ప్రవక్త (స)కు బంధువు. హిందా ఇలా అంది, "ఓ అల్లాహ్ ప్రవక్తా! ఇప్పుడు నేను ముస్లిం అయ్యాను. ఇప్పుడు నన్ను చంపే హక్కు మీకు లేదు." దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నవ్వుతూ, "అవును, ఇప్పుడు మీకు ఎలాంటి శిక్షలు వర్తించవు." అని అన్నారు. మొత్తానికి ప్రవక్త (స) అన్ని దేవుళ్ళను విలీనం చేసి ఒకే దేవుడిగా చేశారని భావించిన ప్రజలు చాలా మారిపోయారు, హిందా లాంటి స్త్రీ కూడ, "దేవుడు ఒక్కడు కాదని ఎవరైనా చెప్పగలరా?" అని ప్రకటించసాగారు.

**(అన్వరుల్ ఉలూమ్, వాల్యూమ్. 20, పేజీలు. 14, 15)**

అల్లాహుమ్మా సల్లిఅలా ముహమ్మదిన్ వ బారిక్ వ సల్లిమ్ ఇన్నక హమీదుమ్మజీద్.

ప్రియమైన శ్రోతలారా! ఈ అంశం మరియు వ్యాసం గురించి, ఈ యుగంలో ఖురాన్ బోధనలను, మత సామరస్యం మరియు ధార్మిక స్వేచ్ఛకు సంబంధించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆదర్శమును పునరుద్ధరించడానికి మరియు ప్రకాశవంతం చేయడానికి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి పరిపూర్ణ నీడ అయిన హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ ( అలైహిస్సలాం)ను వాగ్దత్త మసీహ్ మరియు మహదీగా వారిని ప్రత్యేకంగా భారతదేశంలో అవతరింపజేశాడు. ఇందుకు గల ప్రధాన కారణం, ఈ భారతదేశం వివిధ జాతులు, మతాలు కల్గిన దేశంగా నెలకొన్నది. అనేక రంగులలో, అనేక రూపరేఖలలో అనేక జాతులు, భాషలు మరియు మతాల అనుచరులకు మాతృభూమి. అందువల్ల సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ దేశాన్ని ఇస్లాం యొక్క అందమైన, శాంతియుత బోధనలను వ్యాప్తి చేయడానికి కేంద్రంగా ఎన్నుకున్నాడు. ఈ దేశం నుండి ఈ కాంతి నేడు ప్రపంచంలోని 220 దేశాలకు వ్యాపించింది. ఇతర మతాల అనుచరులతో పాటు, హిందువులు మరియు ముస్లింలు రెండు ప్రధాన తెగలు కలిగిన ఈ దేశంలో నివసిస్తున్నారు, భారతదేశంలో. వారి మధ్య ఐక్యత, సామరస్యం మరియు మత సహనాన్ని బోధిస్తూ, అహ్మదీయ జమాఅత్ వ్యవస్థాపకుడు హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని (అలైహిస్సలాం), తన జీవితపు చివరి రోజుల్లో "పైఘామె సులాహ్" (శాంతి సందేశం) అనే కరపత్రాన్ని రాశారు, దానిలో నుండి నేను సమయస్ఫూర్తితో కొన్ని ఉపదేశాలను వినిపిస్తున్నాను.

హుజూర్ (అ) ఇలా తెలిపారు: ఓ శ్రోతలారా! మనం ముస్లింలమైనా లేదా హిందువులమైనా, మనలో తేడాలు ఉన్నప్పటికీ, ప్రపంచ సృష్టికర్త, యజమాని అయిన దేవుడిని విశ్వసించడంలో మనమందరం పాలుపంచుకుంటాము. అదే విధంగా, మన మందరం మనిషి పేరుతో పంచుకుంటాము, అనగా, మనమందరం మనుషులు అని పిలువబడుతున్నాము, ఈ కారణంగా, ఒకే దేశ నివాసులుగా, మనం ఒకరి కొకరు పొరుగువారం. కాబట్టి, హృదయ స్వచ్ఛతతో మరియు మంచి ఉద్దేశ్యాలతో ఒకరికొకరు స్నేహితులుగా మారడం, ధార్మిక, ప్రాపంచిక కష్టాలలో ఒకరితో ఒకరు పాలుపంచుకుందాం. ఒకే శరీర అవయవాలుగా మారినట్లుగా మనం ఒకరిపట్ల మరొకరం సానుభూతిని చూపుకుందాం!.

ఓ దేశస్థులారా! సాధారణ కరుణను బోధించని మతం అసలు మతమే కాదు. సానుభూతి స్వభావమే లేని మానవుడు అసలే మానవుడే కాదు. మన దేవుడు ఏ దేశం పట్ల వివక్ష చూపలేదు. ఉదాహరణకు, ఆర్యావర్త పురాతన దేశాలకు ఇవ్వబడిన మానవ శక్తులు మరియు బలాలు అరబ్బులు, పర్షియన్లు, సిరియన్లు, చైనీయులు, జపనీయులు మరియు యూరప్ మరియు అమెరికా దేశాలకు కూడా ఇవ్వబడ్డాయి. దేవుని భూమి అందరికీ నేలగా పనిచేస్తుంది మరియు అతని సూర్యుడు, చంద్రుడు మరియు అనేక నక్షత్రాలు అందరికీ ప్రకాశవంతమైన దీపాలుగా పని చేస్తున్నాయి మరియు ఇతర సేవలను కూడా అందిస్తున్నాయి. ఆయన సృష్టించిన మూలకాల నుండి అనగా గాలి, నీరు, అగ్ని మరియు ధూళి, మరియు అదేవిధంగా ఆయన సృష్టించిన అన్ని ఇతర వస్తువులు, ధాన్యాలు, పండ్లు మరియు పదార్థాల నుండి అన్ని జాతుల ప్రజలు ప్రయోజనాన్ని పొందుతున్నారు. కాబట్టి, ఈ దైవిక నీతి మనకు ఒక పాఠాన్ని నేర్పుతుంది, అదేమనగా, మనం కూడా మన తోటి మానవులను దయ మరియు కరుణతో చూసుకోవాలి మరియు సంకుచిత మనస్తత్వం మరియు కుటిల మనస్తత్వంను కలిగి ఉండకూడదు.

**(పైఘామే సులాహ్, రూహానీ ఖజాయిన్, సంపుటి 23, పేజీలు.439-440)**

అలాగే, పరస్పర ఐక్యత మరియు ఒప్పందం యొక్క శుభముల వైపు దృష్టిని ఆకర్షిస్తూ, హుజూర్ (అ) ఇలా తెలిపారు:

ఏ విధంగానూ తొలగించలేని సమస్యలు మరియు ఏ వ్యూహం ద్వారా పరిష్కరించలేని సమస్యలు ఒప్పందం ద్వారా పరిష్కరించబడతాయి అనేది ఎవరికీ తెలియని రహస్యం కాదు. కాబట్టి, ఒప్పందం యొక్క శుభములను కోల్పోవటం తెలివైన వ్యక్తికి తగదు. ఈ దేశంలో హిందువులు మరియు ముస్లింలు రెండు వర్గములు, ఏదో ఒక సమయంలో, ఉదాహరణకు, హిందువులు కలిసి వచ్చి ముస్లింలను ఈ దేశం నుండి బహిష్కరిస్తారని లేదా ముస్లింలు కలిసి వచ్చి హిందువులను బహిష్కరిస్తారని ఆలోచించడం అనేది అసాధ్యమైన ఆలోచన. నిజానికి, ఇప్పుడు హిందువులు మరియు ముస్లింలు కలిసి మెలసి ఉన్నారు. ఒకరికి ఏదైనా

విపత్తు సంభవిస్తే, మరొకరు కూడా దానిలో పాలుపంచుకుంటారు... మీ ఇరు వర్గీయులలో ఏదో ఒక వర్గం ఇతర వర్గపు నాశనాన్ని కోరుతున్నచో అతడు ఒక కొమ్మపై కూర్చుని దానిని నరికివేసే వ్యక్తి లాంటివాడు. మీరు కూడా దేవుని దయతో విద్యావంతులు. ఇప్పుడు, ద్వేషాన్ని పక్కనపెట్టి ప్రేమలో పురోగతి సాధించండి. కపటత్వమును విడిచిపెట్టి కరుణను అలవర్చుకోవడం మీ విజ్ఞానానికి తగినదవుతుంది.

శ్రోతలారా! వివిధ మతాలకు వేర్వేరు నమ్మకాలు, సిద్ధాంతాలు మరియు భావజాలాలు ఉండవచ్చు, వీటిని ప్రతి అనుచరుడు అంతర్దృష్టి ఆధారంగా అంగీకరిస్తాడు మరియు ఆచరిస్తాడు మరియు హేతుబద్ధత మరియు న్యాయ పూరిత వాదనలతో ఇతరులను ఒప్పించగలడు. ఇది మత స్వేచ్ఛ యొక్క అర్థం మరియు ప్రాముఖ్యత. అయితే, దీనికి విరుద్ధంగా, ఇతర మత నాయకులను లేదా వారి ఆమోదించబడిన పుస్తకాలను అవమానించడానికి మరియు తిరస్కరించడానికి ప్రయత్నించే ఎవరైనా గందరగోళం, యుద్ధం మరియు అసమ్మతిని కలిగించు వారవుతారు. కావున ఈ చిన్న తేడాలు పరస్పర శాంతి మరియు ఐక్యతకు అడ్డుగా ఉండకూడదు.

ఈ విషయాన్ని మరల వివరిస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"ఓ ప్రియులారా! ...వివిధ జాతుల ప్రవక్తలు మరియు సందేశహరులను అగౌరవించుట, వారిని దూషించుట ఒక విషం లాంటింది. దీని ఫలితముగా కేవలం శరీరమే నాశనము కాకుండా ఆత్మకూడ నాశనం అవుతుంది. ఇహపరలోకాలు కూడ నాశనమైపోతాయి.ఒక దేశస్తులు పరస్పరం ధర్మమూర్తులను కించపరుస్తూ, వారి స్థానాన్ని దిగజారుస్తూ, ఉంటే ఆ దేశం శాంతియుతముగా నివసించలేదు. ఒకజాతి లేదా ఇరుజాతులు పరస్పరం ఒకరు మరొకరి ప్రవక్తను, అవతార పురుషులను దుర్భాషతో జ్ఞాపకము చేసుకున్నచో ఆ ఇరు జాతులలో ఐక్యత ఏర్పడదు. తమ ప్రవక్త, నాయకుని అవమానమును విన్నచో ఎవరికి ఆవేశము కలుగదు?. ప్రత్యేకముగా ముస్లిం జాతి తమ ప్రవక్తను దేవుడు లేదా దేవుని కుమారుడిగా విశ్వసించదు. కాని తల్లి గర్భము నుండి జన్మించిన మానవులందరిలో ఉత్తముడని విశ్వసించెదరు. వారి పవిత్ర ప్రవక్త ప్రస్తావన వచ్చినవేళ గౌరవముతో గుర్తించని యెడల ఒక స్వచ్ఛమైన ముస్లింతో సంధి ఏర్పడదు.

మేము ఇతర జాతుల అవతారుల గురించి అవమాన కరముగా సంభాషించము. మా విశ్వాసం ప్రకారం ప్రపంచపు విభిన్న జాతులలో చాలా మంది ప్రవక్తలు అవతరించారు మరియు లక్షలాది మంది వారిని విశ్వసించారు. వారి ప్రేమ మరియు గొప్పతనం ప్రపంచంలోని ఆయా ప్రాంతంలో స్థిరపడిపోయింది, అయితే ఈ ప్రేమ మరియు నమ్మకంపై చాలా కాలం గడిచిపోయింది. ఈ ఒక్క నిదర్శనమే వారి సత్యతకు తగిన సాక్ష్యం. ఎందుకంటే వారు దేవుని తరుపున అవతరించనిచో కోట్లాది మంది ప్రజల హృదయాలలో వారి స్వీకరణ వ్యాపించి ఉండేది కాదు. "

(శాంతి సందేశం, తెలుగు అనువాదం పేజి 11)

అందువల్ల, ఇస్లాం స్థాపకుడు హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా (సల్లల్లాహు అలైహి వసల్లం) నిర్భాణ స్వేచ్ఛ మరియు మత సామరస్యతను గురించి బోధించిన బోధనల మరియు వారి ఆచరణాత్మక నడవడిక, తమ ఉత్తమ ఆదర్శము వైపు మేము మొత్తం ప్రపంచాన్ని ఆహ్వానిస్తున్నాము మరియు ఈ యుగంలో, వారి సత్య దాసుడు ఈ బోధనలను మరియు వారి ఉత్తమ ఆదర్శమును మరల పునరుద్ధరించి చూపుతున్నారు. ఎందుకంటే నేడు మానవాళికి ముప్పు కేవలం కుల వివక్ష, రంగు మరియు జాతి వివక్షత ఫలితంగా ఉంది, ఆపై మతపరమైన విభేదాల ఫలితంగా పిచ్చి స్థాయికి చేరుకుంది, ఇవి మానవుడిని మానవత్వం నుండి దిగజార్చాయి, అది హత్య మరియు విధ్వంసం స్థాయికి చేరుకుంది. మానవ ఉగ్రవాదం మరియు ఆత్మాహుతి దాడులతో పాటు, అత్యంత ప్రాణాంతకమైన ఆయుధాలు మరియు డ్రోన్ దాడుల ఫలితంగా పిల్లలు, వృద్ధులు, మహిళలు మరియు అమాయక జీవితాలను ఊచకోత కోసే సంఘటనలను మనం ప్రతిరోజూ చూస్తున్నాము మరియు వింటున్నాము.

సయ్యిద్నా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్, మత సామరస్యత మరియు మత స్వేచ్ఛపై ఇస్లామిక్ బోధనలు మరియు హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి అందమైన ఆదర్శనలను విడమరిచి ఇలా తెలిపారు:

ముస్లిమేతరులను బాగా చూసుకోవడం, వారి హక్కులను గౌరవించడం, వారి గౌరవాన్ని గౌరవించడం వంటి వివిధ స్థాయిలలో ఇస్లాం ఈ అందమైన బోధనను పవిత్ర ఖురాన్ ప్రస్తావించింది.వారిని జాగ్రత్తగా చూసుకోవడం, వారికి న్యాయం చేయడం, వారి మతంపై ఎలాంటి ఒత్తిడి చేయకపోవడం, మతం విషయంలో కఠినంగా ఉండకపోవడం వంటి అనేక ఆజ్ఞలు మనకే కాకుండా ముస్లిమేతరుల కోసం కూడ వర్తించాలి... ఇది ఈ కరుణామయుడు మరియు దయగల మానవుడు మరియు మానవ హక్కుల గొప్ప పరిరక్షకుడి పరిస్థితి. యుద్ధ స్థితిలో కూడా, శత్రువుకు సౌకర్యాన్ని అందించే ఏ అవకాశాన్ని ప్రవక్త (స) వదులుకోరు. వారి జీవితంలోని ప్రతి చర్య, ప్రతి పని, ప్రతి క్షణం మరియు ప్రతి సమయం వారి దయా స్వరూపులకు నిదర్శనం మరియు ఇందుకోసం వారి మనస్సు తల్లడిల్లి పోతుందనుటకు సాక్ష్యంగా నిలుస్తుంది, ....... శాంతి మరియు యుద్ధంలో, స్వదేశంలో మరియు విదేశాలలో, రోజువారీ దినచర్యలలో మరియు ఇతర మతాల ప్రజలతో వ్యవహరించడంలో మరియు ఇతర మతాల ప్రజలతో చేసుకున్న ఒప్పందాలలో. మత స్వేచ్ఛ మరియు మత సామరస్యత యొక్క ప్రమాణాలను స్థాపించడానికి వారు ఆదర్శముగా నిలిచారు. ఆపై, వారు (స) గొప్ప విజేతగా మక్కాలో ప్రవేశించినప్పుడు, అక్కడ జయించిన ప్రజలను దయతో క్షమించివేశారు. ప్రవక్త (స) వారికి మత స్వేచ్ఛకు చెందిన పూర్తి హక్కును కూడా కల్పించారు. మరియు పవిత్ర ఖురాన్ యొక్క ఇట్టి ఆజ్ఞకు గొప్ప ఆదర్శముగా నిలిచారు: ఆ ఇక్రా ఫిద్దీన్ అనగా "మత విషయంలో ఎలాంటి బలవంతం లేదు" (బఖరా :257) మతం మీ హృదయానికి సంబంధించిన విషయం, మీరు నిజమైన మతాన్ని అంగీకరించి, మీ ప్రపంచాన్ని మరియు మీ పరలోక జీవితాన్ని మెరుగుపరచాలని మరియు మీ క్షమాపణ కోసం ఏర్పాట్లు చేయాలని నా కోరిక, కానీ బలవంతం లేదు. ప్రవక్త (స) జీవితం సహనం మరియు మత సామరస్యత మరియు మత స్వేచ్ఛ యొక్క ప్రకాశవంతమైన ఆదర్శనలతో నిండి ఉంది."

(జుమా ప్రసంగం, ఫిబ్రవరి 24, 2006 సూచన)

ఈ ఇస్లామిక్ బోధనలకు, హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఉత్తమ ఆదర్శములకు అనుగుణంగా మతపరమైన స్వేచ్ఛ, మత సామరస్యతను ప్రోత్సహించే సామర్థ్యాన్ని అల్లాహ్ తాలా ప్రపంచంలోని అన్ని ప్రభుత్వాలకు, ముఖ్యంగా ముస్లిం ప్రభుత్వాలకు, సంస్థలకు ప్రసాదించుగాకా!. ఆమీన్.

వ ఆఖిరు ద్దావాన అనిల్ హందు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్.

---

(11వ పేజీ తరువాత చదవండి)

ఎవరైనా ఒక చెడు అలవాటును విడిచిపెట్టడం ఎంత కష్టమో అర్థం చేసుకోగలరు. బలంగా పాతుకుపోయిన అలవాట్లను వదిలివేయడం నిజంగా చాలా క్లిష్టమైన విషయం. కానీ, మన దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం), జంతువులకంటే హీనమైన స్థితిలో ఉన్న వేలాది మందిని సంస్కరించారు. వారిలో కొందరు జంతువుల వలె తమ (మారు) తల్లులతో, సోదరీమణులతో శారీరక సంబంధాలు పెట్టుకోవడాన్ని తప్పుగా భావించేవారు కాదు. అనాథల సంపదను దోచుకునే వారు, మరణించిన వారి వారసత్వాన్ని అక్రమంగా స్వాధీనం చేసుకునేవారు. కొందరు నక్షత్రాలను ఆరాధించేవారు, మరికొందరు నాస్తికులు, ఇంకొందరు ప్రకృతి మూలకాలను పూజించేవారు. అరేబియా ద్వీపకల్పం అప్పట్లో ఎలా ఉండేది?. అది అనేక రకాల మతపరమైన, తాత్విక భావజాలాలకు నిలయంగా ఉండేది.

దీని కంటే మరొక ప్రయోజనం ఏమిటంటే, పవిత్ర ఖుర్ఆన్ తనలోనే ప్రతి అవసరమైన బోధనను కలిగి ఉంది. ప్రపంచంలో ఎప్పుడైనా ఉనికిలోకి వచ్చే ప్రతి అసత్య సిద్ధాంతాన్ని లేదా తప్పు బోధనను నిర్మూలించడానికి దాని ఉపదేశాలు పూర్తిగా సరిపోతాయి. ఇదే సర్వోన్నతుడైన అల్లాహ్ యొక్క గాఢమైన జ్ఞానం మరియు శక్తి." (మల్ఫూజాత్, సంపుటి 1, పుటలు 36-37)

అల్లాహ్ తాలా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను పంపించాడు. అజ్ఞానం పరాకాష్టకు చేరుకున్న కాలంలో ప్రవక్త (స)ను పంపించాడు. ఆ తరువాత ప్రవక్త (స) జంతువుల వలె ప్రవర్తించిన వారిని నిజమైన మనుషులుగా మార్చాడు.

اللّٰھم صل علی محمد وعلی آل محمد وبارک وسلم انک حمید مجید۔

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనందరికీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ఆదర్శాన్ని అనుసరించే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా. అలాగే పవిత్ర ఖుర్ఆన్‌లో పేర్కొన్న ఆజ్ఞలను పాటించే భాగ్యాన్ని కలిగించి, సత్యనిష్ఠ యొక్క ప్రమాణాలను మరింత ఉన్నత స్థాయికి చేర్చేలా మనలను దీవించుగాకా!. ఆమీన్.

**ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్**

సయ్యిద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

# హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త (స) జీవిత చరిత్ర: వ్యక్తి నుండి సమాజం వరకు సమగ్ర సంస్కరణ వ్యవస్థ

(ముహమ్మద్ ఉమర్ తిమ్మాపూరి, మైసూరు, కర్ణాటక.)

దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఎలాంటి కాలంలో జన్మించారనగా, ఆ సమయంలో షిర్క్ (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం) మరియు విగ్రహారాధన విస్తృతంగా వ్యాపించాయి. అవిశ్వాసం, మార్గభ్రష్టత సమాజమంతటా అలుముకున్నాయి. ప్రాపంచికత మరియు అల్లాహ్ ఆదేశాలపై తిరుగుబాటు చేయడం ప్రజల స్వభావంగా మారిపోయింది. దుర్మార్గాన్నే సన్మార్గంగా భావించేవారు. మానవత్వానికి విరుద్ధమైన ప్రతి చెడు సమాజంలో ఉండేది.

అలాంటి పరిస్థితులు, అలాంటి వాతావరణం ఉన్నప్పటికీ, దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నలభై సంవత్సరాల పాటు అత్యంత పవిత్రమైన, మర్యాదపూర్వకమైన జీవితం గడిపారు. వారి వ్యక్తిత్వం, సద్గుణాలు ప్రజల దృష్టిని ఆకర్షించేవి. వ్యవహారాలలో వారు సత్యవంతుడు (అస్-సాదిఖ్), నమ్మకస్తుడు (అల్-అమీన్)గా ప్రసిద్ధి పొందారు. ప్రజలు వారి మాటలను శ్రద్ధగా వినేవారు, వారి నుండి సలహాలు తీసుకునేవారు, తమ న్యాసములను (అమానతులను ) వారి వద్ద ఉంచేవారు. అంటే, ఉత్తమ నైతిక గుణాలన్నీ వారి పవిత్ర జీవితంలో ప్రతిఫలించాయి.

జననం నుండి మరణం వరకు అరబ్ సమాజంలోని చెడు ఆచారాలు, పరిసరాల దుష్ప్రభావం వారి(స)పై ఏమాత్రం పడలేదని చరిత్ర అందుకు సాక్షిగా నిలుస్తుంది. అందుకు భిన్నముగా, నలభై సంవత్సరాల పాటు వారు సమాజంలోని చెడులను, అవినీతిని గమనిస్తూ, వాటిని ఎలా నిర్మూలించాలనే ఆలోచనలో ఉండే వారు. పరిశుభ్రమైన సమాజాన్ని నిర్మించడానికి ఒక మహత్తర విప్లవం అవసరమని వారు గ్రహించారు. చివరికి వారు, అట్టి సమగ్రమైన సంస్కరణ వ్యవస్థకు పునాది వేశారు, దానికి సమానమైనది చరిత్రలో కనిపించదు.

ఆ వ్యవస్థ ప్రపంచమంతటికీ ఆమోదయోగ్యమైనదే కాకుండా ఆచరణ యోగ్యమైనది కూడా. అది మానవ సహజ స్వభావానికి పూర్తిగా అనుగుణంగా ఉంటుంది. దానిని అమలు చేయడం ప్రతి ఒక్కరికీ సులభం. దానిని అనుసరించడం వల్ల సమాజంలోని చెడులు తొలగిపోవడమే కాకుండా, మానవాళికి శాంతియుతమైన, సుఖమయమైన జీవితం గడిపే అవకాశం లభిస్తుంది.

ప్రవక్త (స) అవతరణకు ముందు ప్రపంచమంతటా పాలకుడు మరియు ప్రజల మధ్య తీవ్రమైన అసమానత ఉండేది. రాజులు, పాలకులు తమను దైవ ప్రతి నిధులుగా ప్రకటించుకునేవారు. దైవ అధికారాలను తమ చేతుల్లో ఉంచుకుని, ప్రజల జీవితాలపై సంపూర్ణ అధికారం చెలాయించేవారు. వారి నోటినుంచి వచ్చిన ప్రతి మాట చట్టంగా పరిగణించబడేది. వారి ప్రతి ఆజ్ఞను పాటించడం తప్పనిసరి. సమాజం అనేక వర్గాలుగా విడిపోయి ఉండేది.

ఉన్నత వర్గాల వారు చట్టాలకు అతీతంగా ఉండేవారు. బలహీనులు, పేదలు, ఆధారంలేని ప్రజలు దారిద్ర్యంలో జీవించాల్సి వచ్చేది. మానవత్వం దాదాపు అంతరించి పోయింది. కుల, వర్ణ భేదాలు, ఉన్నత, నిమ్న వర్గాల కృత్రిమ విభజనలు సమాజాన్ని సంకెళ్లతో బంధించాయి.

మానవాళి శ్రేయోభిలాషి అయిన ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ కృత్రిమ భేదాలన్నింటినీ తొలగించి, ప్రజలకు వారు కోల్పోయిన గౌరవం, ఆత్మగౌరవాన్ని తిరిగి అందించారు. మానవ సమానత్వానికి వారు (స) బలమైన పునాది వేశారు. వారు ఎంతో ఘనంగా ఇలా ప్రకటించారు:

"ప్రజలారా! జాగ్రత్తగా వినండి. మీ ప్రభువు ఒక్కడే. మీ మూలపురుషుడు ఆదం (అలైహిస్సలాం) ఒక్కరే. బాగా తెలుసుకోండి: ఒక అరబ్బీయుడికి అరబ్బీయేతరుడిపై, అరబ్బీయేతరుడికి అరబ్బీయుడిపై, తెల్లవారికి నల్లవారిపై, నల్లవారికి తెల్లవారిపై ఎలాంటి ఆధిక్యం లేదు. 'నిశ్చయంగా అల్లాహ్ దృష్టిలో మీలో అత్యంత దైవభీతి (తక్వా) కలవాడే, అత్యంత గౌరవనీయుడు .'

(అల్ హుజ్‌రాత్:14)

గౌరవం వంశం, జాతి, భాష, దేశం, ధనం లేదా సంపదపై ఆధారపడదు. అల్లాహ్ దృష్టిలో మంచి ఉద్దేశ్యం, సత్కార్యాలు, సద్గుణాలే గొప్పతనానికి నిజమైన ప్రమాణాలు.

ప్రవక్త (స) మరల ఇలా ఉపదేశించారు:

"చట్టం ముందు చిన్నవాడైనా, పెద్దవాడైనా, సేవకుడైనా, యజమానైనా, బానిసైనా, అధిపతైనా, పేదవాడైనా, ధనవంతుడైనా, సాధారణ మానవుడైనా, పాలకుడైనా అందరూ సమానులే. అందరికీ అల్లాహ్‌ను ఆరాధించడం, ఆయనకు విధేయత చూపడం సమానంగా తప్పనిసరి. ఏ సైన్యాధిపతికైనా, పాలకుడికైనా, లేదా మత నాయకుడికైనా ప్రజలను అల్లాహ్‌కు బదులుగా తనకు విధేయులుగా చేయించుకునే హక్కు లేదు." అందరూ సమానమైన మనుషులే.

ప్రవక్త(స)మరల ఇలా అన్నారు: "మీరందరూ ఆదం సంతానమే; ఆదంను మట్టితో సృష్టించారు." (కుల్లుకుమ్ ఇబ్నే ఆదమ్, వ ఆదము మిన్ తురాబ్)

సత్యమార్గాన్ని చూపిన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తమ ప్రాణ శత్రువులను సైతం సోదరభావం, ప్రేమ అనే బంధంతో ఏకం చేశారు. ఇస్లాం ధర్మంలో ప్రవేశించిన వారందరినీ పరస్పరం సోదరులుగా తీర్చిదిద్దారు. ద్వేషం, వైరం, అసూయ వంటి చెడు భావాలను నిర్మూలించారు. ప్రతి మనిషి పట్ల కరుణ, దయతో వ్యవహరించాలని బోధించారు. మానవుని ప్రాణం, ఆస్తి, గౌరవం పవిత్రమైనవని ఉపదేశించారు. యుద్ధరంగంలో కూడా ముస్లింలు అన్యాయం చేయరాదని గట్టిగా హెచ్చరించారు. బలహీనులను, నిరపరాధులను హత్య చేయకూడదని, యుద్ధ ఖైదీలను హింసించకూడదని ఆదేశించారు.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) రాకముందు సమాజంలో స్త్రీలకు ఎలాంటి గౌరవం లేదా స్థానం ఉండేది కాదు. వారిని ప్రతిచోటా హీనంగా చూసేవారు. వారిని కేవలం బానిసలుగా మాత్రమే భావించేవారు. స్త్రీ అనేది మార్కెట్‌లో కొనుగోలు, అమ్మకాలకు ఉపయోగించే వస్తువుగా పరిగణించబడేది. అయితే ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్త్రీలను అవమానం, అణచివేత అనే అగాధం నుండి వెలికి తీసి పురుషులతో సమాన గౌరవస్థానాన్ని కల్పించారు. వారిని మానవ సమాజంలో సగభాగంగా ప్రకటించారు. తమ సంపాదనపై వారికి హక్కు కల్పించారు. వారసత్వ ఆస్తిలో భాగస్వామ్య హక్కును ఇచ్చారు. తల్లి, భార్య, కుమార్తె, సోదరి అనే ప్రతిపాత్రలో వారి గౌరవాన్ని పెంచారు. పురుషుడు, స్త్రీ ఒకరికొకరు అవసరమైన వారని, పరస్పర సంతృప్తికి కారణమని తెలిపారు. స్త్రీ శీలాన్ని, పవిత్రతను గౌరవించడం నేర్పించారు. మతపరమైన మరియు లౌకిక విద్యలను అభ్యసించడంలో స్త్రీలకు కూడా పురుషులతో సమాన హక్కు ఉందని పేర్కొన్నారు.

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మంచి పనులు, ధర్మకార్యాలలో పురుషుడు, స్త్రీ అనే భేదాన్ని తొలగించారు. అల్లాహ్ తక్వా (దైవభీతి), నీతినే చూస్తాడని, ఎవరు పురుషుడు, ఎవరు స్త్రీ అనే భేదాన్ని చూడడని చెప్పారు. వీడ్కోలు హజ్ (హజ్జతుల్ విదా) సందర్భంగా, "స్త్రీల విషయంలో అల్లాహ్‌కు భయపడండి. మీకు వారిపై హక్కులు ఉన్నట్లే, వారికి కూడా మీపై హక్కులు ఉన్నాయి" అని ఉపదేశించారు. అలాగే బానిసలను విముక్తి చేయాలని, వారితో ఉత్తమముగా వ్యవహరించాలని ప్రోత్సహించారు. శతాబ్దాలుగా కొనసాగుతున్న అనేక అన్యాయ ఆచారాలను నిర్మూలించారు.

తమ కాలంలోనే పర్దా (ముసుగు) ఆచారాన్ని ప్రోత్సహించారు. వివాహ సంబంధం లేని పురుషులు, స్త్రీలు అవసరం లేకుండా కలిసి మెలిసి ఉండే సమావేశాలను సముచితంగా పరిగణించలేదు. అయితే స్త్రీలు పర్దా నియమాలను పాటిస్తూ సామాజిక కార్యకలాపాల్లో పాల్గొనేవారు. వారు మసీదుల్లో ఖుత్బాలు (ప్రసంగాలు) వినడమే కాకుండా, అవసరమైతే యుద్ధాల్లో కూడా సహాయక పాత్ర పోషించేవారు.

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రవక్తత్వం పొందక ముందు అరబ్ సమాజం యొక్క మతపరమైన పరిస్థితి కూడా అత్యంత దయనీయంగా ఉండేది. అక్కడ 360 విగ్రహాలను ఆరాధించేవారు. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చేసిన గొప్ప సంస్కరణలలో ముఖ్యమైనది ఏకదైవారాధన (తౌహీద్) అనే విశ్వాసాన్ని ప్రజల హృదయాల్లో స్థాపించడం. పరలోకంలో ప్రతి మనిషి తన కర్మలకు జవాబు దారీ అవుతాడనే భావనను ప్రజల్లో వ్యాప్తి చేశారు. హృదయాలను, ఆత్మలను పవిత్రం చేశారు. ప్రజలను అల్లాహ్ ఆజ్ఞలను అనుసరించేలా తీర్చిదిద్దారు. వారి మనస్సులను సత్కార్యాల వైపు మళ్లించారు. ఏకైక దేవుడిని ఆరాధించడం, తోటి మనుషులకు సేవ చేయడం అనే భావాన్ని పెంపొందించారు. చెడు పనులను అసహ్యించుకోవడం నేర్పించారు. సిగ్గు, వినయం, పవిత్రత, శీలం ఇవన్నీ విశ్వాసానికి అవిభాజ్య భాగాలని ప్రకటించారు. ఈ విధంగా ఒక పవిత్రమైన సమాజ నిర్మాణంలో విశేష విజయాన్ని సాధించారు.

వ్యక్తిగత హక్కులు, బాధ్యతలతో పాటు కుటుంబ జీవితాన్ని మెరుగు పరచడానికి అవసరమైన సూత్రాలను కూడా వివరించారు. కుటుంబ నిర్మాణంలో పురుషుడు, స్త్రీల బాధ్యతలను, అలాగే తల్లిదండ్రులు, కుమారుడు, కుమార్తె, సోదరుడు, సోదరి మధ్య ఉన్న సంబంధాల హక్కులు, విధులను స్పష్టంగా నిర్దేశించారు. వివాహాన్ని ఒక శ్రేష్ఠమైన, ప్రశంసనీయమైన కార్యంగా ప్రకటించారు. ఈ చర్యల వల్ల సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, సుఖశాంతులు పెరిగాయి.

ఈ అపూర్వమైన, ప్రపంచ ప్రఖ్యాత విజయాలన్నింటి తరువాత కూడా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తాను స్వతంత్ర చక్రవర్తిగా ప్రవర్తించలేదు. ఇది వారి శాశ్వత మహోన్నతత్వానికి తిరుగులేని నిదర్శనం. ప్రవక్తగా వారు చూపించిన పరిపాలనా విధానం ప్రజా సంక్షేమం, సామాజిక న్యాయం ఆధారంగా ఉన్న ఆదర్శ రాజ్యవ్యవస్థకు ఉత్తమ నమూనా. ఇస్లామీయ సమాజాన్ని ఒక క్రమబద్ధమైన రాజ్యంగా తీర్చిదిద్దడానికి, దాని అభివృద్ధి కోసం వారు తీసుకున్న చర్యలు యుగయుగాల పాటు పాలకులకు మార్గదర్శకంగా నిలుస్తాయి. అరబ్బుల తెగల వాదాన్ని తొలగించి వారిని ఒక అఖండ, దృఢమైన సమాజంగా ఏకం చేశారు. వారి ముందు ఉన్నతమైన జీవిత లక్ష్యాన్ని మాత్రమే కాకుండా, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు వారిని కార్యాచరణలో కూడా నిమగ్నులను చేశారు.

**అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ అలా ఆలీ ముహమ్మద్, వ బారిక్ వ సల్లిమ్.**

# దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి జీవిత చరిత్ర మరియు మతాల మధ్య సామరస్యానికి వారు చేసిన సేవలు.

హజ్రత్ అఖ్దస్ మహమ్మద్ అరబీ (సల్లల్లాహు అలైహి వసల్లం) క్రీస్తుశకం ఆరో శతాబ్దంలో పవిత్ర మక్కా నగరంలో జన్మించారు. వారు భౌతిక జీవితాన్ని 63 సంవత్సరాలు పూర్తి చేసి, తన పరమ ప్రభువు వద్దకు చేరుకున్నారు. అల్లాహ్ తఆలా వారిని గురించి ఇలా పేర్కొన్నాడు: "వ రఫఅన లక జిక్‌రక్" అనగా "మేము నీ స్మరణను ఉన్నతస్థానానికి చేర్చాము." అంటే, ప్రవక్త (స) పేరు, కీర్తి మరియు మహిమ యుగయుగాల పాటు నిలిచి ఉంటుంది.

ప్రవక్త (స) చేసిన మహోన్నత కార్యాలు సమస్త మానవజాతికి ఆదర్శ ప్రాయమైనవి. జీవితంలోని ప్రతి రంగంలోనూ వారు (స) సంపూర్ణ ఆదర్శంగా నిలిచారు. వివిధ జాతులు మరియు మతాల పరంగా పరిశీలించినా, ఈ విషయంలో వారికి సాటిగా మరెవ్వరూ లేరు. మతాల మధ్య సామరస్యాన్ని నెలకొల్పడంలో వారి పాత్ర అత్యున్నతమైనది. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అంతర్మత సౌహార్దం కోసం అత్యంత విశిష్టమైన సేవలు అందించారు.

ప్రపంచంలో అనేక మతాలు ఉన్నాయి. ఉదాహరణకు ఇస్లాం, క్రైస్తవం, యూద మతం, హిందూ మతం, జర్తుష్ట్ర మతం, సిక్కు మతం మొదలైనవి. వీటితో పాటు ప్రతి దేశంలో మరెన్నో మతాలు, ఆలోచనా విధానాలు ఉన్నాయి. కొన్ని మతాలను మినహాయిస్తే, చాలా మతాలు పరస్పరం ప్రభావితం చేసుకున్నాయి. అందువల్ల "మతం" అనే పదాన్ని "ఆలోచనా పద్ధతి" లేదా "భావజాలం" అనే అర్థంలో తీసుకుంటే విషయం మరింత స్పష్టమవుతుంది.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితాన్ని అంతర్మత సామరస్య దృష్టితో పరిశీలిస్తే, వారి మహోన్నత నైతికతను మరే ఇతర మత నాయకుడితోనూ పోల్చలేం.

ప్రపంచంలో అల్లాహ్ సృష్టించిన ప్రతి వస్తువుకీ ఒక ప్రత్యేక లక్షణం ఉంటుంది. ఉదాహరణకు ఇనుము, రాగి వంటి లోహాలు విద్యుత్ ప్రవాహాన్ని సులభంగా ప్రసారం చేస్తాయి. నీటికి కూడా ప్రత్యేక లక్షణాలున్నాయి. అది వేడెక్కుతుంది, సాధారణ స్థితిలో ఉంటుంది, ఆవిరై గాలిలో కలిసిపోతుంది. ఇనుము లేదా రాగిలో విద్యుత్ ప్రవహిస్తోందో లేదో టెస్టర్ ద్వారా తెలుసుకోవచ్చు. అలాగే నీటి ఉష్ణోగ్రతను థర్మామీటర్ ద్వారా కొలవచ్చు.

అదేవిధంగా అల్లాహ్‌తాలా "అష్రఫుల్ మఖ్లూకాత్" (సర్వోన్నత సృష్టి అయిన మనిషి) లో కూడా అనేక గుణాలను ఉంచాడు. ప్రేమ, ద్వేషం, దయ, కోపం మొదలైన లక్షణాలు మనిషిలో ఉంటాయి. కానీ సమస్త సృష్టికి శ్రేష్ఠమైన ఆదర్శమైన మన ప్రియ ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) విషయానికి వస్తే, ఉత్తమ గుణాలన్నియు వారిలో సంపూర్ణంగా నిండి ఉన్నాయి.

హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజియల్లాహు అన్హు) ఇలా పేర్కొన్నారు:

"ప్రవక్త(స)లో ధైర్యం ఉండేది, ఉదారత ఉండేది, ఉపకారం ఉండేది, విశ్వాస పాత్రత ఉండేది, సహనం ఉండేది; కరుణ ఉండేది; ఓర్పు ఉండేది; త్యాగభావం ఉండేది; నిజాయితీ ఉండేది; సోదరభావం ఉండేది; వినయం ఉండేది; ఆత్మగౌరవం ఉండేది; కృతజ్ఞత ఉండేది; స్థిరత్వం ఉండేది; గంభీరత ఉండేది; మానవాళి పట్ల శ్రేయస్సు కోరే హృదయం ఉండేది; ఉన్నత ఆశయాలు ఉండేవి; సహనం ఉండేది; దయ ఉండేది; చెడును ఎదుర్కొనే శక్తి ఉండేది; కష్టాలను భరించే సామర్థ్యం ఉండేది; కఠిన పరిస్థితులను భరించే గుణం ఉండేది; సరళ జీవనం ఉండేది; బంధుత్వాన్ని కాపాడే స్వభావం ఉండేది; సత్యత ఉండేది; పేదల పట్ల ప్రేమ ఉండేది; ఆపదలో ఉన్నవారికి సహాయం చేయాలనే తపన ఉండేది; అతిథి సత్కారం ఉండేది; పెద్దలను గౌరవించడం, చిన్నవారిపై ప్రేమ చూపడం ఉండేది; అల్లాహ్ పట్ల అపారమైన ప్రేమ ఉండేది; ఆయనపై సంపూర్ణ విశ్వాసం ఉండేది; ఆరాధనలను క్రమంగా నిర్వహించేవారు. మొత్తంగా చెప్పాలంటే, ఏ మంచి గుణం ఆయనలో లేకపోయింది? వారిలో లేనిది ఏ పరిపూర్ణత?"

**(తఫ్సీర్ కబీర్, సంపుటి 5, పుట 400, తాహా వ్యాఖ్యానం, ఖాదియాన్, 2004)**

ఈ మహోన్నత గుణాలను గుర్తించడానికి టెస్టర్ లేదా థర్మామీటర్ వంటి బాహ్య పరికరాలు అవసరం ఉండవు. రత్నాలను గుర్తించే నిపుణుడిలా, అవగాహన మరియు వివేచన కలిగిన హృదయం అవసరం.

మతాల మధ్య సామరస్యాన్ని నెలకొల్పడంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క గొప్పతనం అత్యున్నత స్థాయిలో కనిపిస్తుంది. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. ప్రవక్తగా నియమించబడకముందే, వారు(స) ఒక క్లిష్టమైన వివాదాన్ని పరిష్కరించారు. అది హజరే అస్వద్ (నల్లరాయి)ను కాబాలో తిరిగి ప్రతిష్ఠించే సందర్భంలో జరిగిన సంఘటన.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ ఎం.ఏ. (రజియల్లాహు అన్హు) తన సీరత్ ఖాతమున్ నబీయీన్ గ్రంథంలో ఇలా వ్రాశారు:

"ఖురైష్ తెగలు కాబాను పునర్నిర్మిస్తున్నప్పుడు హజరే అస్వద్‌ను దాని స్థానంలో ఎవరు పునప్రతిష్ఠించాలనే విషయంలో తీవ్ర వివాదం చెలరేగింది. ప్రతి తెగ ఈ గౌరవాన్ని తమకే దక్కాలని కోరుకుంది. పరిస్థితి యుద్ధానికి దారితీసేంతగా ఉద్రిక్తమైంది. కొందరు అజ్ఞాన సంప్రదాయం ప్రకారం రక్తంతో నిండిన పాత్రలో వేళ్లను ముంచి, ఈ గౌరవాన్ని ఇతర తెగకు ఇవ్వకుండా పోరాడి మరణిస్తామని ప్రమాణం చేశారు. ఈ వివాదం కారణంగా కాబా నిర్మాణం కొన్ని రోజులపాటు నిలిచి పోయింది. చివరికి అబూ ఉమయ్యా బిన్ ముఘీరా ఒక ప్రతిపాదన చేశాడు: 'ముందుగా హరమ్‌లోకి ప్రవేశించే వ్యక్తిని న్యాయనిర్ణేతగా అంగీకరిద్దాం.' అందరూ అంగీకరించారు. అల్లాహ్ కోరిక ప్రకారం ముందుగా ప్రవేశించిన వ్యక్తి మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం). వారిని చూసిన వెంటనే అందరూ 'అల్-అమీన్! అల్-అమీన్!' (నమ్మకస్తుడు) అని సంబోధిస్తూ, 'వారి తీర్పును మేమంతా అంగీకరిస్తాము' అని ప్రకటించారు. విషయం విన్న అనంతరం వారు (స) అద్భుతమైన పరిష్కారాన్ని సూచించారు. తన దుప్పటిని పరచి, దానిపై హజరే అస్వద్‌ను ఉంచారు. అనంతరం ప్రతి ఖురైష్ తెగ నాయకుడికి ఆ దుప్పటి యొక్క ఒక్కో మూల పట్టించారు. అందరూ కలిసి రాయిని దాని స్థానానికి తీసుకువెళ్లారు. ఆ తరువాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా దానిని తీసి కాబాలోని దాని అసలు స్థానంలో ప్రతిష్ఠించారు.

ఈ సంఘటనలో అల్లాహ్ ఒక గొప్ప సంకేతాన్ని చూపించాడు. ఆ సమయంలో పరస్పరం విభేదిస్తున్న అరబ్ తెగలు, భవిష్యత్తులో ఇదే పవిత్ర వ్యక్తి ద్వారా ఒకే కేంద్రం చుట్టూ ఏకమవుతాయని."

(సీరత్ ఖాతమున్ నబీయ్యీన్, పుట 109, యూకే ముద్రణ, 1996)

ఈ విధంగా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి ద్వారా మత సామరస్యానికి ఒక గొప్ప ఆదర్శం స్థాపించబడింది. అనంతరం అల్లాహ్ తఆలా వారికి ప్రవక్తత్వం (నుబువ్వత్) మరియు దైవదూతత్వం (రిసాలత్) అనే మహత్తర బాధ్యతలను ప్రసాదించాడు. దాంతో వారి బాధ్యతలు మరింత పెరిగాయి.

మతం పేరిట ఏర్పడిన వివిధ వర్గాలు, శాఖలు లేదా సమూహాల మధ్య ఉన్న ఒక సాధారణ అంశం అల్లాహ్ (దేవుడు) యొక్క ఉనికి. నాస్తికులను లేదా మతాన్ని అంగీకరించని వారిని మినహాయిస్తే, ప్రపంచంలోని అన్ని మతాలకు చెందిన ప్రజలు ఏదో ఒక రూపంలో దేవుని ఉనికిని అంగీకరిస్తారు. దీనిని తిరస్కరించడం నాస్తికత్వమే అవుతుంది. అయితే, దేవుని ఉనికి మరియు ఆయన ఏకత్వం (తౌహీద్) విషయంలో ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎప్పుడూ రాజీ పడలేదు. ఈ కారణంగా వారు (స) తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. వారి(స)పై అనేక రకాల హింసలు, కష్టాలు మోపబడ్డాయి. వారి(స)ని అనుసరించిన విశ్వాసులను కూడా హింసించారు. దేవుని ఉనికి మరియు ఆయన ఏకత్వం విషయంలో రాజీ చేసుకోవాలని ప్రయత్నించారు. బెదిరింపులు, ప్రలోభాలు కూడా చూపించారు. కానీ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్పష్టంగా ఇలా ప్రకటించారు:

"వారు నా కుడి చేతిలో సూర్యుడిని, ఎడమ చేతిలో చంద్రుడిని ఉంచినా కూడా, ఈ పవిత్ర లక్ష్యం నుండి నేను వెనక్కి తగ్గను. ఎందుకంటే అల్లాహ్ యొక్క ఏకత్వం విషయంలో ఎలాంటి రాజీ లేదా మత సామరస్యం సాధ్యం కాదు."

ఈ కారణంగానే వారు (స) తన ప్రియమైన స్వదేశాన్ని విడిచి, హిజ్రత్ చేసి మదీనా మునవ్వరాకు వెళ్లారు. అక్కడ వారు (స) మత సామరస్యానికి ఒక అద్భుతమైన ఆదర్శాన్ని ప్రపంచానికి చూపించారు.

నిజానికి, మదీనాకు హిజ్రత్ చేసిన తరువాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నివసించిన ప్రాంతంలో వివిధ మతాలకు చెందిన ప్రజలు

నివసించేవారు. భిన్నమైన విశ్వాసాలు కలిగి ఉన్నప్పటికీ శాంతియుతంగా కలిసి జీవించడం అవసరం. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అక్కడి స్థానికులు కాకపోయినా, అల్లాహ్ ప్రసాదించిన గొప్ప లక్షణాలలో ఒకటైన మత సామరస్యాన్ని నెలకొల్పే అసాధారణ సామర్థ్యం వారికి ఉండేది.

పరిస్థితులను పరిశీలించిన తరువాత ప్రవక్త (స) వివిధ మతాలు మరియు భావ జాలాలకు చెందిన ప్రతినిధు లందరినీ ఒకచోట సమీకరించి, పరస్పర ఒప్పందాన్ని కుదుర్చారు. అందరూ దానిని అంగీకరించారు. ఆ ఒప్పందం "మదీనా చార్టర్" (మీసాఖ్-ఏ-మదీనా) అనే పేరుతో ప్రసిద్ధి చెందింది. అందువల్ల, మత సామరస్యానికి సంబంధించి మదీనా చార్టర్‌లోని పదాలు ఇలా ఉన్నాయి. హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (రజియల్లాహు అన్హు) ఇలా పేర్కొంటారు:

"ఇది ముహమ్మద్ రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం), విశ్వాసులు మరియు స్వచ్ఛందంగా వారితో చేరిన వారందరి మధ్య కుదిరిన ఒప్పందం. ముహాజిరులలో ఎవరు హత్య చేయబడితే, వారి రక్తపరిహారం (దియత్) బాధ్యత వారి సమూహానిదే. అలాగే తమ బందీలను వారు తామే విముక్తి చేయాలి. మదీనాలోని వివిధ ముస్లిం తెగలు కూడా ఇదే విధంగా తమ తమ తెగలకు సంబంధించిన బాధ్యతలను నిర్వర్తిస్తాయి. ఎవరైనా తిరుగుబాటు, శత్రుత్వం లేదా వ్యవస్థలో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే, ఒప్పందంలో భాగమైన వారందరూ అతనికి వ్యతిరేకంగా ఏకమవుతారు. అతడు వారి స్వంత కుమారుడే అయినప్పటికీ.
యుద్ధంలో ఒక అవిశ్వాసి (కాఫిర్) ముస్లిం చేతిలో మరణిస్తే, అతని ముస్లిం బంధువులు ఆ ముస్లింపై ప్రతీకారం తీర్చుకోరు. అలాగే ఏ ముస్లింకు వ్యతిరేకంగా అలాంటి అవిశ్వాసికి సహాయం చేయరు. ఏ యూదుడు మనతో కలిసి ఉంటాడో, అతనికి మనమందరం సహాయం చేస్తాము. యూదులకు ఎటువంటి అన్యాయం చేయబడదు. వారి శత్రువులకు కూడా వారి మీద సహాయం చేయబడదు. ఏ అవిశ్వాసి మక్కా ప్రజలకు తన ఇంటిలో ఆశ్రయం ఇవ్వకూడదు. వారి ఆస్తిని తన వద్ద భద్రపరచకూడదు; అలాగే ముస్లింలు మరియు అవిశ్వాసుల మధ్య జరిగే యుద్ధంలో ఏ విధంగానూ జోక్యం చేసుకోకూడదు. ఎవరైనా ఒక ముస్లింను అన్యాయంగా హత్య చేస్తే, ముస్లింలందరూ అతనికి వ్యతిరేకంగా ఏకమై చర్యలు తీసుకుంటారు. ఒక బహుదేవారాధక శత్రువు మదీనాపై దాడి చేస్తే, యూదులు ముస్లింలకు సహాయం చేస్తారు మరియు యుద్ధ వ్యయాలలో తమ వంతు భాగాన్ని భరిస్తారు. మదీనాలోని వివిధ తెగలతో ఒప్పందం చేసుకున్న యూద తెగలకు ముస్లింలకు ఉన్న హక్కులే ఉంటాయి. యూదులు తమ మతాన్ని స్వేచ్ఛగా ఆచరిస్తారు; ముస్లింలు తమ మతాన్ని స్వేచ్ఛగా ఆచరిస్తారు. యూదులకు లభించే హక్కులే వారి అనుచరులకు కూడా లభిస్తాయి. మదీనా ప్రజల్లో ఎవరూ ముహమ్మద్ రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుమతి లేకుండా యుద్ధాన్ని ప్రారంభించ కూడదు. అయితే ఈ నిబంధన కారణంగా ఎవరినీ తమ చట్టబద్ధమైన ప్రతీకారం (న్యాయమైన హక్కు) నుండి వంచించరు. యూదులు తమ సంస్థకు సంబంధించిన ఖర్చులను తామే భరిస్తారు. అయితే యుద్ధం సంభవించినప్పుడు, ఇరుపక్షాలు కలిసి పనిచేస్తాయి. ఈ ఒప్పందంలో చేరిన వారందరికీ మదీనా ఒక పవిత్రమైన, గౌరవనీయమైన స్థలంగా ఉంటుంది. నగర ప్రజల రక్షణ కోసం బయటి ప్రాంతాల నుండి వచ్చిన వారితో కూడా నగర అసలు నివాసులతో వ్యవహరించినట్లే వ్యవహరిస్తారు. అయితే, మదీనా ప్రజలకు ఏ స్త్రీని ఆమె బంధువుల అనుమతి లేకుండా తమ ఇళ్లలో ఉంచుకునే హక్కు ఉండదు. ఏవైనా వివాదాలు లేదా కలహాలు తలెత్తితే, వాటి తీర్పు కోసం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త సమక్షానికి తీసుకు రావాలి. మక్కా ప్రజలతో లేదా వారి మిత్ర తెగలతో ఈ ఒప్పందంలో భాగమైన వారు ఎటువంటి ప్రత్యేక ఒప్పందం చేసుకోరు. ఎందుకంటే, ఈ ఒప్పందంలోని సభ్యులు మదీనా శత్రువులకు వ్యతిరేకంగా పరస్పరం ఐక్యంగా ఉండేందుకు ఇప్పటికే అంగీకరించారు. యుద్ధాన్ని విడివిడిగా నిర్వహించలేనట్లే, శాంతి ఒప్పందాన్ని కూడా విడివిడిగా చేయలేరు. అయితే, ఎవరినీ బలవంతంగా యుద్ధంలో పాల్గొనమని నిర్బంధించరు. కానీ ఎవరైనా అన్యాయానికి పాల్పడితే, అతడు శిక్షకు అర్హుడు అవుతాడు. నిశ్చయంగా అల్లాహ్ సజ్జనుల మరియు భక్తుల రక్షకుడు; మరియు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ యొక్క ప్రవక్త."

(దీబాచా తఫ్సీరుల్ ఖుర్ఆన్, పుటలు 142-143, ఖాదియాన్ ప్రచురణ, 2010 )

మత సామరస్యానికి సంబంధించి, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి జీవితంలో సులహ్‌హుదైబియ్యా (హుదైబియ్యా శాంతి ఒప్పందం) అనే ముఖ్యమైన సంఘటన కూడా జరిగింది.

ప్రవక్త (స) తౌహీద్ (దేవుని ఏకత్వం) సందేశాన్ని ప్రకటిస్తూ ఎప్పుడూ ఎలాంటి వ్యతిరేకతనూ లెక్కచేయలేదు. అలాగే తౌహీద్ విషయంలో ఎవరితోనూ రాజీ పడలేదు. అయితే, కొన్ని పరిస్థితుల్లో ధర్మశాస్త్రం అనుమతించిన పరిమితి వరకు సడలింపు ఇవ్వవచ్చని భావించి, వారు(స) అలాంటి సడలింపును చూపారు. మత సామరస్య భావనను నిలబెట్టే ఉద్దేశంతో, వారి ప్రత్యర్థులు ప్రతిపాదించిన కొన్ని షరతులను కూడా అంగీకరించారు. అవి ప్రవక్త(స)వారి అనేక మంది సహాబాలు (రదియల్లాహు అన్హుమ్ అజ్మఈన్)కు కూడా ఇష్టంగా అనిపించలేదు. కానీ వారి ఆ రాజీ చివరికి గొప్ప విజయానికి దారి తీసింది.

ఉదాహరణకు, హుదైబియా ఒప్పందంలో ఒక పక్షానికి నాయకుడు నిస్సందేహంగా మహమ్మద్ రసూలుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారే. అయితే ప్రత్యర్థి పక్షం ప్రవక్త (స) పేరుతో పాటు "రసూలుల్లాహ్" (అల్లాహ్ ప్రవక్త) అనే పదాన్ని రాయడానికి అంగీకరించలేదు. ప్రవక్త (స) స్వయంగా చదవలేని (ఉమ్మీ) వారైనా, ఇతరుల సహాయంతో "రసూలుల్లాహ్" అనే పదాన్ని గుర్తించి, తమ పవిత్ర హస్తాలతో దానిని తొలగించారు.

ఈ హుదైబియా ఒప్పందం గురించి హజ్రత్ ముస్లెహ్ మౌఊద్ (రదియల్లాహు అన్హు) ఇలా పేర్కొన్నారు:

"అల్లాహ్ పేరున ఈ శాంతి ఒప్పందం మహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు మక్కా ప్రభుత్వ ప్రతినిధి సుహైల్ బిన్ అమర్ మధ్య కుదిరింది. పది సంవత్సరాల పాటు యుద్ధం నిలిపివేయబడుతుంది. ఎవరికైనా మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)తో కలవాలనిపించినా లేదా ఆయనతో ఒప్పందం చేసుకోవాలనిపించినా చేయవచ్చు. అలాగే ఎవరికైనా ఖురైష్‌తో కలవాలనిపించినా లేదా వారితో ఒప్పందం చేసుకోవాలనిపించినా చేయవచ్చు. తన తండ్రి జీవించి ఉన్న లేదా ఇంకా బాల్య వయస్సులో ఉన్న ఏ బాలుడు తన తండ్రి లేదా సంరక్షకుని అనుమతి లేకుండా మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వస్తే, అతడిని తిరిగి అతని తండ్రి లేదా సంరక్షకునికి అప్పగించాలి. కానీ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వారి అనుచరుల్లో ఎవరైనా ఖురైష్ వద్దకు వెళితే, వారిని తిరిగి పంపించరు. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ సంవత్సరం మక్కాలో ప్రవేశించకుండా తిరిగి వెళ్తారు. అయితే వచ్చే సంవత్సరం ఆయన మరియు ఆయన సహచరులు మక్కాకు వచ్చి మూడు రోజుల పాటు ఉండి కాబాను సందర్శించుకోవచ్చును. ఆ సమయంలో ఖురైష్ ప్రజలు నగరాన్ని విడిచి కొండల వైపు వెళ్తారు. అయితే ఒక షరతు ఏమిటంటే, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు వారి సహచరులు సాధారణ ప్రయాణికుడు తీసుకెళ్లే ఆయుధం తప్ప మరే ఆయుధమూ తీసుకు రాకూడదు; అంటే ఒరలో ఉంచిన ఖడ్గం మాత్రమే వారి వద్ద ఉండాలి."

(దిబాచా తఫ్సీరుల్-ఖుర్ఆన్, పుట 191)

మత సామరస్యాన్ని ప్రతిబింబించిన ఈ సౌలభ్య భరితమైన ఒప్పందం తొలుత కొందరు సహాబాలకు (రజియల్లాహు అన్హుమ్ అజ్మఈన్) అర్థం కాలేదు. అయితే అల్లాహ్ తఆలా ఈ కార్యాన్నే "ఫతహ్ ముబీన్" (స్పష్టమైన విజయం)గా మార్చాడు.

హుదైబియా ఒప్పందం మక్కా ఖురైష్ లేదా మక్కా ముష్రికులతో సంబంధించినది. మత ప్రపంచంలోని మరొక ప్రధాన వర్గం క్రైస్తవులు. క్రైస్తవులతో మత సామరస్యానికి సంబంధించిన ఒక గొప్ప ఉదాహరణ కూడా హుదైబియా ఒప్పందం అనంతరం జరిగిన సంఘటనల రూపంలో కనిపిస్తుంది. ఈ విషయాన్ని మౌలానా దోస్త్ మహమ్మద్ సాహిబ్ షాహిద్ (రహిమహుల్లాహ్) ఇలా వివరించారు:

"మక్కా ముకర్రమా నుండి యెమెన్ వైపు ఏడు రోజుల ప్రయాణ దూరంలో నజ్రాన్ అనే క్రైస్తవ రాజ్యం ఉండేది. అక్కడ ఒక మహత్తరమైన చర్చి ఉండేది. దానిని వారు 'కఅబ-ఏ-నజ్రాన్' అని పిలిచేవారు మరియు కఅబ శరీఫ్‌కు సమానమైన పవిత్ర స్థలంగా భావించేవారు. ఆ గుమ్మటం మూడు వందల చర్మాలతో నిర్మించ బడింది. అరేబియాలో క్రైస్తవులకు అంతటి గొప్ప మతకేంద్రం మరొకటి లేదు. ఆ రాజ్య పరిపాలన మూడు విభాగాలుగా విభజించబడింది. విదేశీ మరియు యుద్ధ వ్యవహారాల అధికారి 'సయ్యిద్' అని పిలువబడేవాడు. పరిపాలనా మరియు లౌకిక వ్యవహారాలు 'ఆఖిబ్' బాధ్యతలో ఉండేవి. మతపరమైన వ్యవహారాలకు బాధ్యుడిని 'ఉస్కుఫ్' (లార్డ్ బిషప్) అని పిలిచేవారు. ఈ మత నాయకులను రోమన్ చక్రవర్తే నియమించేవాడు. (ముఅజ్జముల్-బుల్దాన్, సంపుటి 8, పుట 963)

ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇతర రాజులతో పాటు వీరికీ కూడా ఇస్లాం సందేశాన్ని తెలియజేస్తూ ఒక లేఖ పంపారు. దాని ఫలితంగా హిజ్రీ 7వ సంవత్సరంలో నజ్రాన్ నుండి ఒక గౌరవప్రదమైన ప్రతినిధి బృందం మదీనాకు వచ్చింది. ఆ బృందంలో మొత్తం అరవై మంది సభ్యులు ఉండగా, వారి రాజ్యంలోని ముగ్గురు ప్రధాన నాయకులు కూడా ఉన్నారు. వారి పేర్లు: అబ్దుల్ మసీహ్ (ఆఖిబ్), షర్జీల్ లేదా అసీమ్ (సయ్యిద్), మరియు అబూ హారిసా బిన్ అల్కమా (ఉస్కుఫ్). ఈ ప్రతినిధి బృందం అత్యంత వైభవంగా ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చింది. ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారిని మస్జిద్-ఎ-నబవీలోనే బస చేయించారు. కొద్దిసేపటి తరువాత వారి ప్రార్థన సమయం రాగానే, శాంతి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుమతితో వారు తమ సంప్రదాయం ప్రకారం అదే మస్జిద్-ఎ-నబవీలో తమ ప్రార్థనను నిర్వహించారు."

(వఫాత్-ఏ-మసీహ్ ఔర్ అహ్యా-ఏ-ఇస్లాం", పుట 24, రబ్వా ముద్రణ, డిసెంబర్ 1979, మౌలానా దోస్త్ మహమ్మద్ సాహిబ్ షాహిద్)

ఆ తరువాత మక్కా విజయం అనే మహోన్నతమైన కాలం కూడా వచ్చింది. ఆ సమయంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎదుట తీవ్రమైన యుద్ధ నేరాలకు పాల్పడిన అనేక మంది ఉన్నారు. వారిలో కొందరికి మరణశిక్ష విధించడం న్యాయపరంగా సముచితమై ఉండేది. అయితే వారిలో కొందరిని కూడా ప్రవక్త (స) తన ఉన్నతమైన ఉదార స్వభావంతో క్షమించి విడిచిపెట్టారు. ముఖ్యంగా ఇక్రమా బిన్ అబూ జహల్ సంఘటన ప్రసిద్ధమైనది. ఆయనకూ అభయం ప్రసాదించబడింది. ఆయన తన స్వంత మతంపైనే కొనసాగుతున్నప్పటికీ ఆయనకు రక్షణ కల్పించబడింది.

తరువాత హజ్జతుల్ విదా (వీడ్కోలు హజ్) సందర్భం వచ్చింది. ఆ సందర్భంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సర్వమానవాళికి శాంతి సందేశాన్ని ప్రకటించారు. అంతేకాక, ఆ సందేశాన్ని కాలం, స్థలం అనే పరిమితులను దాటి ప్రపంచమంతటా వ్యాపింపజేయాలని కూడా ఆదేశించారు.

హ॥జ్రత్ ముస్లెహ్ మౌఊద్ (రజియల్లాహు అన్హు) ఈ హజ్జతుల్ విదా ప్రసంగం గురించి ప్రస్తావిస్తూ ఇలా పేర్కొన్నారు:

"మీరు అందరూ ఏ జాతికి చెందిన వారైనా, ఏ స్థితిలో ఉన్న వారైన మనుషులుగా ఒకే స్థాయికి చెందినవారు. ఇలా చెప్పిన తరువాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన రెండు చేతులను పైకెత్తి, రెండు చేతుల వేళ్లను ఒకదానితో ఒకటి కలిపి ఇలా అన్నారు: 'ఈ రెండు చేతుల వేళ్లు పరస్పరం సమానంగా ఉన్నట్లే, మీరందరూ కూడా మానవులుగా సమానులే. ఒకరిపై మరొకరు గొప్పతనం లేదా ఉన్నత స్థానం చాటుకోవడానికి మీకు ఎలాంటి హక్కూ లేదు. మీరు పరస్పరం సోదరులవలె ఉండాలి.' ఆ తరువాత ప్రవక్త (స) ఇలా అడిగారు: 'ఇది ఏ మాసమో మీకు తెలుసా? ఇది ఏ ప్రాంతమో మీకు తెలుసా? ఇది ఏ రోజుయో మీకు తెలుసా?' ప్రజలు సమాధానమిచ్చారు: 'అవును! ఇది పవిత్రమైన నెల, ఇది పవిత్రమైన ప్రాంతం, ఇది హజ్ దినం.'

ప్రతి సమాధానం తరువాత ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: 'ఈ నెల ఎంత పవిత్రమైనదో, ఈ ప్రాంతం ఎంత పవిత్రమైనదో, ఈ రోజు ఎంత పవిత్రమైనదో, అలాగే అల్లాహ్ ప్రతి మనిషి ప్రాణాన్నీ, ఆస్తినీ పవిత్ర మైనవిగా నిర్ణయించాడు. ఎవరి ప్రాణంపైనా, ఎవరి ఆస్తిపైనా దాడి చేయడం కూడా ఈ పవిత్రమైన నెలను, ఈ ప్రాంతాన్ని, ఈ దినాన్ని అవమానించినంతే అన్యాయమైనది. ఈ ఆజ్ఞ ఈ రోజుకే కాదు, రేపటికీ కాదు, మీరు అల్లాహ్‌ను కలిసే ఆ దినం వరకు ఇది వర్తిస్తుంది.' ఆ తరువాత ప్రవక్త (స) ఇలా అన్నారు: 'నేను ఈ రోజు మీకు చెప్పిన ఈ విషయాలను ప్రపంచపు చివరి ప్రాంతాల వరకూ చేర్చండి. ఎందుకంటే, ఈ రోజు నా నుండి వింటున్న వారికంటే, నా నుండి నేరుగా వినని వారు వీటిని మరింతగా ఆచరించే అవకాశం ఉంది.'"

(దిబాచా తఫ్సీర్-ఉల్-ఖుర్ఆన్, పుటలు 228--229)

محبت سے گھائل کیا آپ نے — دلائل سے قائل کیا آپ نے
جہالت کو زائل کیا آپ نے — شریعت کو کامل کیا آپ نے
بیاں کردیے سب حلال وحرام — علیک الصلوٰۃ وعلیک السلام

వ ఆఖీరుద్దావాన అనిల్ హందులిల్లాహి రబ్బిల్ ఆలమీన్.

హ॥జ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా తెలిపారు:

మనం ఒకవేళ హ॥జ్రత్ మసీహ్ వాగ్దానములను హ॥జ్రత్ ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లం గారి వాగ్దానాలతో పోల్చి చూసినచో ఆ వాగ్దానం మరియు ఈ వాగ్దానంలలో అంధాకారం మరియు తేజస్సుకు ఉన్నంత వ్యత్యాసాన్ని మనం చూడవచ్చును. హ॥జ్రత్ మసీహ్ వాగ్దానం నిరాధారముగా ఉన్నందున అది ఒక ఇరుకైన, అంధాకారపు గుంతలో పడిన దానితో సమానమై ఉండును. ఎలాంటి తేజస్సును అవి తమలో కల్గియుండవు. కాని మన ప్రియతమ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి వాగ్దానం సూర్యుడి వలే ప్రకాశిస్తుంది. ఆ॥ హ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అశేష జీవితంపై కూడ ఒక గొప్ప ఆధారముగా నిలుస్తుంది. అనగా హుజూర్ (స) గారి అనుగ్రహపు చెలిమా ఇంకా కొనసాగుతూనే ఉంది. నేడు కూడ ఎవరైనా ఆ॥ హ॥జ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించినచో అతడు నిస్సందేహముగా సమాధిలో నుండి లేప బడుతాడు. మరియు అతనికి ఒక ఆధ్యాత్మిక జీవితం అందించబడుతుంది. కేవలం కల్పికముగా గాకుండా, నిజానికి సత్యనిదర్శన సంకేతాలతో అది బహిరంగముగానే కనిపిస్తుంది. పైగా దైవ సహాయం, దైవ శుభములు, పవిత్రమైన ఆత్మ, అద్భుతాలతో కూడిన సహకారాలు తోడుగా ఉంటాయి. అతడు ప్రపంచంలో ఉన్న మానవులందరిలో ఒక ప్రత్యేక మానవుడిగా మారిపోతుంటాడు. చివరికి అల్లాహ్ తాలా కూడ అతనితో సంభాషణల పరంపర కొనసాగిస్తుంటాడు. తన గోప్యతలను కూడ అతనిపై బహిర్గతం చేస్తాడు. తన విజ్ఞానంను, వివేకంను అతనికి అనుగ్రహిస్తాడు. తన ప్రేమాభిమానాల ప్రకాశవంతమైన సంకేతాలు బహిర్గతం చేస్తుంటాడు. తన సహాయ సహకారాలను అతనిపై అవతరింప జేస్తుంటాడు. తన శుభములను అతనిలో కల్పిస్తాడు. తన సంరక్షణ విశిష్టతకు అతనిని ప్రతిరూపంగా మార్చుతాడు. అతని నోటి నుండి వివేకత జాలువారుతుంది. అతని హృదయం నుండి విజ్ఞతతో కూడిన నూతనాంశాల చెలిమా బయలు పడుతుంది. కనుమరుగైన ఆంతర్యాలన్ని అతని ద్వారా వెలుగులోకి వస్తాయి. అల్లాహ్ తాలా అతనికి ఒక గొప్ప వైభవశక్తిని అనుగ్రహిస్తాడు. అతనికి అతి సమీపంనకు చేరుతాడు. ఫలితముగా అతడు దుఆల ఆమోదిత రూపంలో, ఆమోదిత దుఆ ప్రతిఫలములలో, వివేక వంతమైన విజయం రూపంలో, గోప్య ఆంతర్యాల వెలుగులలో, శుభముల అవతరణలో అందరి కంటే ఎక్కువగా, అందరిపై ఆధిక్యతను సాధిస్తాడు. ఈ క్రమంలోనే ఈ భవదీయుడు అల్లాహ్ తాలా నుండి అవతరింపబడి, ఈ అంశాలలోనే మరియు సత్యనిదర్శన బహిర్గతం కోసం కొన్ని వేలాది రిజిష్టర్ లేఖలను ఆసియా, ఐరోపా, అమెరికా కు చెందిన ప్రముఖుల పేర్లపై "ఖాతముల్ అన్బియా సల్లల్లాహు అలైహి వసల్లంను అనుసరించకుండానే శాశ్వతమైన జీవితం లభిస్తుందని ఒకవేళ ఎవరైన వాగ్దానం చేసినచో వారు ఈ భవదీయుడితో పోటీ పడవచ్చును. ఒకవేళ పోటీ పడలేక పోవుచున్నచో కనీసం సత్యాన్వేషకుడిగా ఏకదాటిగా కురుస్తున్న శుభములను, సంకేతాలను, నిదర్శనాలను చూడడానికైన రావచ్చును" అని పంపాను. కాని ఎవరు కూడ స్వచ్ఛతతో, సత్యసంకల్పంతో ఇటువైపు కన్నెత్తి కూడ చూడలేదు. ఇలా వారు దూరం ఉంటూ " మేమందరం అంధాకారంలోనే పడి ఉన్నాము " అని నిరూపించారు. ప్రస్తుతం కొంత మంది, ముసల్మానులుగా పిలువబడే మా మత సోదరులు, నిజానికి వారు ఈ తేజస్సును వ్యతిరేకిస్తున్నారు, తిరస్కరిస్తున్నారు. స్వచ్ఛమైన మనస్సుతో నా వద్దకు రాకుండానే వారు నన్ను ధర్మభ్రష్టుడని ప్రచారం చేయడానికి సిద్ధమైనారు. వీరు ఇలా వ్యవహరించడానికి గల ముఖ్య కారణం వారి అంధత్వం, లోభితనం, తీవ్రమైన అసూయ. ఇలాంటి వారు ఇస్లాంలో ఉండడం వలన వారు ఇస్లాం నిందించబడుటకు కారకులు కాజాలరు. ఇలాంటి వారిని గూర్చి వారు ఆధ్యాత్మిక జబ్బుల నుండి ఎందుకు స్వస్థత పొందలేక పోతున్నారు, వారు సమాధుల నుండి ఎందుకు బయటికి రాలేక పోతున్నారు అని ఆరోపణలు చేయకూడదు. ఎందుకనగా ఒకవేళ ఎవరైన సూర్యకిరణాలు తన ఇంట్లోకి ప్రవేశించ కూడదని తమ తలపులను, ద్వారాలను అన్నింటిని మూసివేసి అంధాకారంలో కూర్చున్నచో, ఫలితముగా అతని ఇంట్లోకి సూర్యకిరణాలు చేరకున్నచో ఇందులో సూర్యుని తప్పిదమేముంటుంది. నిజానికి అలా మూసివేసి నందుకు ఇది అతని తప్పిదము. వీటి అన్నింటిని ప్రక్కకు పెట్టినచో, ఒకవేళ ఈ ముసల్మానులు వాస్తవికత నుండి ఎంతో దూరంలో పడి ఉన్నా, ముసుగులో ఉన్నా చివరికి వీరందరు బహిరంగముగా ఏకేశ్వరత్వం పై నిలబడి ఉన్నారు. ఏ మానవున్ని కూడ దేవుడిగా స్వీకరించరు. వారు ఏకేశ్వరత్వపు శుభముల వలన తమలో తేజస్సును కల్గి యున్నారు. వారిలో ఎంతో కొంత జీవితపు ఆనవాళ్ళు మిగిలి ఉన్నాయి. అందువలన వారు పూర్తిగా మరణించారని మనం చెప్పలేము. కాని భయంకరమైన స్థితిలో ఉన్నారని చెప్పవచ్చును. ఒకవేళ ఏ క్రైస్తవుడైనా, హైందవుడైనా మా నుండి ముఖమును త్రిప్పుకొని, ఇలాంటి ఆరోపణలు చేసినచో అతడు తీవ్రమైన అసూయపరుడు, అవివేకుడు అనబడుతాడు. తోటలో ముళ్ళ చెట్టు ఉండడం కూడ తప్పనిసరి. పూలు ఉన్నచోట ముళ్ళు కూడ ఉంటాయి. కాని వ్యతిరేక వర్గీయులలో కేవలం ముళ్ళ కంపలే కనిపిస్తుంటాయి. మసీహ్ (అ) ఆధ్యాత్మిక ప్రళయం అని, మసీహ్‌లో లీనమై మేము పునర్జీవనం పొందామని పేర్కొనడం నిజంగా మూర్ఖత్వమే అవుతుంది.

**(ఆయినా కమాలాతే ఇస్లాం, రూహాని ఖజాయిన్, సంపుటి 5, పేజి 221-222)**

# ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర

## హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి జుమా ప్రసంగాల వెలుగులో...

(హాఫిజ్ సయ్యద్ ఏజాజొద్దీన్ , మురబ్బి సిల్‌సిలా, హుబ్లీ కర్ణాటక)

అల్లాహ్ తఆలా యొక్క ఈ అపారమైన సృష్టి వ్యవస్థను లోతుగా పరిశీలిస్తే, వివేకవంతులకు ఎంతో విలువైన పాఠాలు లభిస్తాయి. మనిషిని "జామిఉస్-సఘీర్" (సూక్ష్మ విశ్వం) అని పిలుస్తారు. ఎందుకంటే ప్రపంచంలోని అనేక విశేష గుణాలు ఏదో ఒక రూపంలో ఈ చిన్న ప్రపంచమైన మనిషిలోనే నిక్షిప్తమై ఉన్నాయి.

మనము ఆలోచించి గమనించినప్పుడు, అల్లాహ్ తఆలా మనిషి స్వభావంలోనే తన నిజమైన ఆరాధ్యుని (అల్లాహ్) పట్ల ఆకర్షణను ఉంచాడని తెలుస్తుంది. ఈ విషయాన్ని హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా వివరించారు:

"శిశువు తల్లి గర్భం నుండి బయటకు వచ్చిన వెంటనే మొదటగా వ్యక్తపరిచే ఆధ్యాత్మిక లక్షణం ఏమిటంటే, అది సహజంగానే తన తల్లివైపు ఆకర్షితమవుతుంది మరియు ఆమెపై ప్రేమను కలిగి ఉంటుంది. తరువాత క్రమంగా దాని ఇంద్రియాలు అభివృద్ధి చెందుతున్న కొద్దీ, దాని సహజ స్వభావం వికసిస్తున్న కొద్దీ, అంతరంగంలో దాగి ఉన్న ఆ ప్రేమ మరింత స్పష్టంగా వ్యక్తమవుతుంది. చివరకు తల్లి ఒడిలో తప్ప మరెక్కడా దానికి నిజమైన ప్రశాంతత లభించదు. తల్లి నుండి వేరుచేస్తే, ప్రపంచంలోని అన్ని సుఖాలూ దానికి రుచించవు. దాని ముందర ఎన్నో వరాలు ఉంచినా కూడా, తన నిజమైన ఆనందాన్ని అది తల్లి ఒడిలోనే చూస్తుంది. ఈ తల్లిపట్ల కలిగే ఆకర్షణ అసలు కారణం. వాస్తవానికి, అదే ఆకర్షణను అల్లాహ్ తఆలా మనిషి స్వభావంలో తన నిజమైన ఆరాధ్యుని పట్ల ఉంచాడు. అంతేకాదు, మనిషి ఎక్కడైనా ప్రేమను పెంపొందించినా, దాని వెనుక పనిచేస్తున్నది ఇదే దైవప్రేమ. అతడు ఎక్కడ ప్రేమాభిమానాలను వ్యక్తపరిచినా, అవన్నీ ఆ అసలు ప్రేమకు ప్రతిబింబాలే."

(ఇస్లామీ ఉసూల్ కీ ఫిలాసఫీ, రూహానీ ఖజాయిన్, సంపుటి 10, పుట 364)

ఈ భావాన్ని మరింత వివరిస్తూ హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (రజియల్లాహు అన్హు) ఎంతో సున్నితమైన అంశాన్ని ఇలా వివరించారు:

"అల్లాహ్ తఆలా మనిషిని ప్రేమ కొరకు సృష్టించాడు. అతని సృష్టి యొక్క అసలు ఉద్దేశ్యం, మనిషి అల్లాహ్ ప్రేమలో పూర్తిగా మునిగిపోవడం మరియు శాశ్వత జీవాన్ని ప్రసాదించే ఆ ప్రేమ సముద్రంలో ఎల్లప్పుడూ మునిగి ఉండటమే. ఒక కవి ఇలా అన్నాడు:

'మనిషిని హృదయంలో దేవుని స్మరణ కోసం సృష్టించారు
నిజానికి విధేయత కోసం దేవదూతలు చాలామందే ఉన్నారు.'

అనగా, మనిషి అల్లాహ్ ప్రేమలో మునిగి ఉండటానికే సృష్టించబడ్డాడు. ప్రేమ వల్ల కలిగే ఆ తపనలో ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించేందుకు అతడు సృష్టించబడ్డాడు. కేవలం విధేయత మరియు ఆజ్ఞాపాలన కోసమే అయితే దేవదూతలు ఇప్పటికే ఉన్నారు."

(మహబ్బతే ఇలాహీ, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 1, పుటలు 19-20)

దైవప్రేమ అనే ఈ మహత్తర భావానికి అత్యుత్తమ ఆదర్శమును హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం తమ ఆచరణల ద్వారా ప్రపంచానికి చూపించారు. దీనిని వివరిస్తూ హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) ఇలా అన్నారు:

"ఒక నిజమైన విశ్వాసి యొక్క ప్రత్యేకత ఏమిటంటే, ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా పేర్కొన్నాడు: 'వల్లజీనా ఆమనూ అషద్దు హుబ్బన్ లిల్లాహ్' (బఖరా:165) అనగా 'విశ్వాసులు అల్లాహ్ పట్ల అత్యంత ప్రేమను కలిగి ఉంటారు.'

కాబట్టి, నిజమైన విశ్వాసి జీవితమంతా ఒకే సత్తా అయిన అల్లాహ్ చుట్టూనే తిరగాలి. అలా కాకపోతే అతడు నిజమైన విశ్వాసిగా పిలువబడలేడు. అదృశ్యంపై విశ్వాసం కలిగి ఉండటం, నమాజ్ చేయడం, త్యాగం చేయడం, ప్రవక్తలపై విశ్వాసం కలిగి ఉండడం, ఇవన్నీ అల్లాహ్ ప్రేమ కారణంగా ఆయన ఆజ్ఞలను పాటించాలనే ఉద్దేశంతో చేసినప్పుడే పరిపూర్ణమవుతాయి.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ గాఢమైన ప్రేమకు ఎంత గొప్ప ఆదర్శాన్ని చూపారంటే, అవిశ్వాసులు కూడా 'ముహమ్మద్ (స) తన ప్రభువు ప్రేమలో మునిగిపోయాడు' అని చెప్పక తప్పలేదు.

అలాగే ప్రవక్త (ష) మనకు ఈ అందమైన ప్రార్థనను నేర్పారు:

'ఓ అల్లాహ్! నేను నీ ప్రేమను, నిన్ను ప్రేమించే వారి ప్రేమను, మరియు నన్ను నీ ప్రేమకు చేర్చే సత్కార్యాలను ప్రసాదించమని నిన్ను వేడుకుంటున్నాను. ఓ అల్లాహ్! నీ ప్రేమను నా హృదయంలో నా ప్రాణం, నా సంపద, నా కుటుంబం, ఇంకా చల్లని నీటి కంటే ఎక్కువగా చేయుము.'

ఇదే ఒక నిజమైన విశ్వాసి యొక్క లక్షణం. అయితే అల్లాహ్ అనుగ్రహం లేకుండా ఏదీ లభించదు. కాబట్టి ఈ ప్రేమను పొందడానికి కూడా అల్లాహ్ ముందే వినయంగా మొకరిల్లుతూ, నిరంతరం ప్రార్థనలు చేయడం అవసరం."

(ఖుత్బాతే మస్రూర్, సంపుటి 5, పుటలు 292-293)

దైవ ప్రేమ అనే ఈ పవిత్ర కార్యం ఇప్పుడు కేవలం ఒక పక్ష ప్రేమ మాత్రమే కాదు. నిజమైన ప్రియుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కూడా తన కరుణ వల్ల తన దాసులపై ప్రేమ చూపుతాడు. ఎందుకంటే:

"సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా తన దాసులు తనను కలుసుకోవాలని కోరుకుంటాడు. కోరిక కేవలం మన వైపు నుంచే ఉంటే అది వేరే విషయం. కానీ ఇప్పుడు పరిస్థితి ఏమిటంటే, ఒక కవి చెప్పినట్లుగా:

కలుసుకోవడంలో అసలైన ఆనందం అప్పుడే ఉంటుంది,
ఇద్దరూ ఒకరినొకరు కలుసుకోవాలనే తపనతో ఉన్నప్పుడు;
ఇద్దరి హృదయాల్లో సమానమైన ఆరాటం ఉన్నప్పుడు.

కాబట్టి, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ స్వయంగా తన దాసుని దర్శనాన్ని కోరుకుంటున్నందున, దాసుడు ఎప్పుడూ నిరాశ చెందకూడదు."

(హస్తీ బారీ తఆలా, అన్వారుల్ ఉలూమ్, సంపుటి 6, పుట 438)

ఈ నేపథ్యంలో, దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితాన్ని పరిశీలిస్తే, "అషిఖ ముహమ్మదున్ రబ్బహు" (ముహమ్మద్ తన ప్రభువును పరిపూర్ణంగా ప్రేమించారు) అనే వాక్యానికి సజీవ రూపంగా వారి జీవితం కనిపిస్తుంది. బాల్యం నుంచే, ప్రాపంచిక సంబంధమైన బాధ్యతలను నిర్వర్తించిన తరువాత, వారికి అత్యంత ఇష్టమైన కార్యం తన ప్రభువుపైనే సంపూర్ణ ఏకాగ్రతతో ఉండడం.

ఈ మహోన్నతమైన జీవిత విధానాన్ని ప్రస్తావిస్తూ హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ ) ఇలా పేర్కొన్నారు:

"సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన ఎన్నుకోబడిన సేవకులతో మరియు ప్రవక్తలతో ఒక విశేషమైన విధంగా వ్యవహరిస్తాడు. వారు ఏకాంతాన్ని కోరుకుంటారు, అల్లాహ్ ఆరాధనలో తమను తాము నిమగ్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. అయితే అల్లాహ్ వారిని ఆజ్ఞాపించి బయటకు తీసుకువస్తాడు. దీనికి అత్యున్నతమైన మరియు సంపూర్ణమైన ఆదర్శం దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితం.

వారు హిరా గుహలో అనేక రోజులు తన ప్రభువు స్మరణలో పూర్తిగా లీనమై గడిపేవారు. ప్రపంచ విషయాల పట్ల వారికి ఎలాంటి ఆసక్తి ఉండేది కాదు. అయితే, ప్రాపంచిక సంబంధమైన మరియు కుటుంబ బాధ్యతలను నిర్వర్తించడంలో కూడా వారికి సాటి ఎవరూ లేరు, ఉండలేరు కూడా. కానీ వారి జీవితం మొత్తం అల్లాహ్ ప్రేమతో నిండిపోయి ఉండేది. వారి (స) తినడం, త్రాగడం, విశ్రాంతి తీసుకోవడం అన్నీ అల్లాహ్ ప్రేమలో మునిగిపోయి, ఆయన ఆరాధనలో గడిచేవి.

తర్వాత అల్లాహ్ వారిని ఉద్దేశించి, 'గుహ నుండి బయటకు వచ్చి ప్రపంచాన్ని ఏకేశ్వరుడైన అల్లాహ్ వైపు పిలువు' అని ఆజ్ఞాపించినప్పుడు, వారు అల్లాహ్ వైపు పిలిచే దైవదూతగా (దాఈ ఇలల్లాహ్) అసాధారణమైన ఆదర్శాన్ని నెలకొల్పారు.

ఈ అల్లాహ్ ప్రియుడు, దైవ సందేశాన్ని ప్రకటించిన కారణంగా తన స్వంత ప్రజల ఆగ్రహానికి గురయ్యాడు. వారిపై అనేక దాడులు జరిగాయి. అయినప్పటికీ, అల్లాహ్ ప్రేమతో నిండిన హృదయం మరియు అల్లాహ్ సృష్టిపట్ల అపారమైన కరుణతో, ఎలాంటి వ్యతిరేకతను లెక్కచేయకుండా ప్రతి క్షణం కొత్త ఉత్సాహంతో తన దైవ కార్యంలో నిమగ్నమై ఉండేవారు. ప్రతిరోజూ ఒక్కరు, ఇద్దరు చొప్పున ప్రజలు వారి పిలుపును స్వీకరించి వారి సమాజంలో చేరుతుండేవారు. వారి జీవితకాలంలోనే ఇస్లాం సందేశం అరేబియా వెలుపల కూడా వ్యాపించింది. అనంతరం ప్రపంచం చూసింది ఏమిటంటే, ఆసియా, ఆఫ్రికా మరియు యూరప్ వరకు ముస్లిం పాలనలు స్థాపించబడ్డాయి."

(ఖుత్బాతే మస్రూర్, సంపుటి 7, పుట 264)

మరల ఇలా తెలిపారు: "అల్లాహ్ తఆలా యొక్క పరిపూర్ణ దాసుడైన హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తన ఆరాధన ద్వారా నెలకొల్పిన ఆదర్శానికి సమానమైన ఉదాహరణ మరొకటి లేదు. కొన్నిసార్లు వారు (స) నిర్జన ప్రదేశాలలో లోకంలోని ప్రతి విషయాన్ని మరచిపోయి పూర్తిగా అల్లాహ్ ఆరాధనలో నిమగ్నమై ఉండేవారు. ఒక రాత్రి వారి భార్యలలో ఒకరు వారు పడకపై కనిపించకపోవడంతో, వారు మరొక భార్య ఇంటికి వెళ్లి ఉంటారేమో అని అనుమానించారు. కానీ వెతికిన తరువాత చూసిన దృశ్యం ఆమెను తన ఆలోచనలపట్ల సిగ్గుపడేలా చేసింది. 'నేను వారిని గురించి ఎంత లోకసంబంధమైన ఆలోచన చేశానో! వారి స్థాయిని నేను గుర్తించలేకపోయాను. కానీ వారు తన ప్రభువు సన్నిధిలో సాష్టాంగ నమస్కారంలో లీనమై, ఎంతో వినయంతో, ఎంతో ఆర్తితో ప్రార్థిస్తున్నారో, దానికి సరితూగే ఉదాహరణను చెప్పడం అసాధ్యం.'

కొంతమంది వారి ప్రార్థనలో వినిపించే ఆర్తనాదాన్ని మరిగే పాత్ర శబ్దంతో పోల్చారు. మరికొందరు వేరే ఉదాహరణలు ఇచ్చారు. కానీ ఆ పరిపూర్ణ దాసుడు

తన ప్రభువు ముందు చేసిన ప్రార్థనలోని వినయం, ఆర్తి అన్నిటికంటే అతీతమైనది. తీవ్రమైన అనారోగ్యంలో కూడా వారు సామూహిక నమాజును విడిచిపెట్టలేదు. తన చివరి అనారోగ్య సమయంలో తీవ్రమైన బలహీనతలో కూడా మస్జిద్‌కు వచ్చారు. తన అనుచరులు మరియు ముస్లింలు సామూహికంగా నమాజు చేస్తున్న దృశ్యాన్ని చూసి చిరునవ్వు చిందించారు. ఎందుకంటే ఇదే మానవుని సృష్టి యొక్క నిజమైన లక్ష్యం, దానిని ఈ నిష్ఠావంతులైన 'ఇబాదుర్ ర్రహ్మాన్' నెరవేర్చుతున్నారు.

ప్రవక్త (స) ఇలా అన్నారు: 'నా కళ్లకు చల్లదనం నమాజులోనే ఉంది.' నమాజును క్రమంగా ఆచరించడంలో వారు (స) మన ముందుంచిన ఆదర్శం ఇదే. నఫిల్ నమాజులను కూడా నిరంతరం ఆచరించే ఆదర్శాన్ని చూపించారు. అల్లాహ్ ఆరాధనలో స్థిరంగా ఉండే మార్గాన్ని చూపించారు. అయితే వారికి లభించిన ఆ ఉన్నత స్థానం ప్రతి ఒక్కరికీ సాధ్యం కాదు. ఆ స్థాయిని చేరింది కేవలం ఆ పరిపూర్ణ మానవుడే. అందుకే అల్లాహ్ మరియు ఆయన దూతలు ప్రవక్త (స)పై దురూద్ పంపుతున్నారు. అయితే అల్లాహ్ ఇలా ప్రకటించడం ద్వారా 'లకద్ కాన లకుమ్ ఫీ రసూలిల్లాహి ఉస్వతున్ హసనహ్' (అహజాబ్ :22) అనగా 'నిశ్చయంగా మీకు అల్లాహ్ ప్రవక్తలో ఒక ఉత్తమ ఆదర్శం ఉంది' మన దృష్టిని వారి ఆదర్శాన్ని అనుసరించే దిశగా మళ్లించాడు."

(ఖుత్బాతే మస్రూర్, సంపుటి 6, పుట 340)

మరల ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితంలో దైవ ప్రేమ (ఇష్క్-ఎ-ఇలాహీ) గురించి ఒక సందర్భంలో వారు ఇలా పేర్కొన్నారు:

"ప్రవక్తుత్వానికి ముందున్న చరిత్రే సాక్ష్యమిస్తోంది, వారు గంటల తరబడి, కొన్నిసార్లు రోజుల తరబడి ఏకాంతంలో అల్లాహ్ ఆరాధనలో నిమగ్నమై ఉండేవారు. వారు చేసిన ఒక ప్రార్థన, అల్లాహ్ ప్రేమను పొందాలనే వారి హృదయపూర్వక తపనను, ఆవేదనను స్పష్టంగా తెలియజేస్తుంది. వారు(స) తన ప్రభువు సమక్షంలో ఎంతో ఆర్తిగా ఇలా ప్రార్థించారు:

'ఓ అల్లాహ్! నాకు నీ ప్రేమను ప్రసాదించు. అలాగే, నీ సమీపానికి నన్ను చేర్చే వారి ప్రేమను కూడా ప్రసాదించు. ఓ అల్లాహ్! నాకు ఇష్టమైన వాటిని అనుగ్రహించు. అవి నాకు నీ ప్రేమలో ఎదగడానికి, నీ భక్తిలో బలపడడానికి, నా విశ్వాసంలో అభివృద్ధి చెందడానికి సాధనాలుగా మారేలా చేయు. అలాగే, నాకు ప్రియమైన వాటిని నన్ను విడిచిపెట్టే పరిస్థితి వచ్చినప్పుడు, వాటికి బదులుగా నీకు ప్రియమైన వాటిని నాకు ప్రసాదించు.'"

(ఖుత్బాతే మస్రూర్, సంపుటి 8, పుట 558)

అల్లాహ్‌పై నిజమైన ప్రేమ అనగా, అన్ని పరిస్థితిలోనూ ఆయన వైపే తిరిగి, ఆయననే ఆశ్రయించడం. బదర్ యుద్ధం ఇందుకు ప్రసిద్ధ ఉదాహరణ. అల్లాహ్ స్వయంగా యుద్ధానికి అనుమతి ఇచ్చి, విజయాన్ని కూడా ముందుగానే శుభవార్తగా తెలియజేసినా, అల్లాహ్ యొక్క "అల్-ఘనీ" (సర్వసంపన్నుడు, ఎవరి సహాయానికీ అవసరం లేనివాడు) అనే గుణాన్ని దృష్టిలో ఉంచుకొని, ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అత్యంత ఆర్తితో, కన్నీటి పర్యంతమై ప్రార్థించారు. ఆ స్థితిని వివరిస్తూ హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ ఇలా పేర్కొన్నారు:

బదర్ యుద్ధంలో గానీ, ఉహుద్ యుద్ధంలో గానీ, లేదా మరే ఇతర యుద్ధంలో గానీ, ధనసంపదల సమృద్ధి వల్లనే ప్రత్యక్షమైన ఫలితాలు వచ్చాయా? నిశ్చయంగా కాదు. ఒక విషయం మాత్రం ఖచ్చితంగా ఉంది: అల్లాహ్ తఆలా చేసిన వాగ్దానాలు ఉన్నప్పటికీ, అల్లాహ్ తఆలా ఇచ్చిన భరోసాలు ఉన్నప్పటికీ, అల్లాహ్ తఆలా చూపించిన ప్రకాశవంతమైన సూచనలు ఉన్నప్పటికీ, అల్లాహ్ తఆలా యొక్క ప్రవక్తలు తమకు అందుబాటులో ఉన్న సాధనాల ప్రకారం సాధారణంగా కనిపించే ప్రయత్నాలు తప్పకుండా చేస్తారు. కానీ వారి అసలు దృష్టి వారి ప్రార్థనలపైనే ఉంటుంది. దీనిలో అత్యున్నతమైన పరిపూర్ణ ఆదర్శాన్ని మన ప్రియతమ నాయకులు హజ్రత్ మహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం చూపించారు.

బదర్ యుద్ధం ఇందుకు ఒక గొప్ప దృశ్యాన్ని మన ముందు ఉంచుతుంది. అన్ని రకాల ఓదార్పులు మరియు వాగ్దానాలు ఉన్నప్పటికీ, ప్రవక్త (స) యొక్క ఆందోళన, ప్రార్థనలలో వారి యొక్క ఆర్తి, వారి హృదయ స్థితి, వారిలో ఏర్పడిన ఆధ్యాత్మిక భావోద్వేగం, ఇవన్నీ ఎటువంటి స్థితిలో ఉండేవనగా, ఎవరైనా పదేపదే ప్రాణత్యాగ స్థితిలో ఉన్నట్లుగా అనిపించేది. ప్రార్థనలలో కలిగిన ఆ తీవ్రమైన భావావేశం కారణంగా వారి భుజాలపై ఉన్న చాదర్ పదేపదే జారిపడేది.

(ఖుత్బాతే మస్రూర్, భాగం 9, పుట 561)

ఇక అల్లాహ్ తఆలా యొక్క మహిమ ఏమిటంటే, ఒక సేవకుడు ఆయన వైపు ఒక అడుగు వేస్తే, ఆయన ఆ సేవకుని వైపు పది అడుగులు ముందుకు వస్తాడు. సేవకుడు నడుచుకుంటూ తన ప్రభువు వైపు వస్తే, ఆ ప్రభువు ఆ సేవకుని వైపు పరుగెత్తుకుంటూ వస్తాడు. కాబట్టి హజ్రత్ మహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం తన ప్రభువుపై ఉన్న ప్రేమతో తనను తాను పూర్తిగా అర్పించుకుంటే, అల్లాహ్ తఆలా వారికి తగిన గొప్ప బహుమతులు ఇవ్వడా? తప్పకుండా ఇస్తాడు.

అందువల్ల మొదటగా అల్లాహ్ తఆలా వారికి 'ఇస్మత్' (పవిత్రత మరియు రక్షణ) అనే స్థాయిని ప్రసాదించాడు, అంటే వారిని పాపరహితుడిగా చేశాడు. రెండవది, అల్లాహ్ తఆలా వారికి ఎలాంటి ఉన్నత స్థానం ఇచ్చాడనగా, ఇక ఏ మనిషీ వారిక్కి విధేయత మరియు ప్రేమలో పూర్తిగా లీనమవకుండా అల్లాహ్ తఆలా యొక్క ప్రేమను పొందలేడు. అందువల్ల మొత్తంగా చూస్తే, "దనా ఫతదల్లా" అనే స్థితిలో ప్రవక్త(స) ను ఉంచారు.

పవిత్రత విషయానికి వస్తే, హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇలా చెప్పారు:

"దైవ ప్రేమలో పూర్తిగా లీనమవడం వల్ల ప్రవక్తలు పాపాల నుండి రక్షించబడుతారు."
(తఫ్సీర్ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం, భాగం 7, పుట 229)

అలాగే "దనా ఫతదల్లా" మరియు అల్లాహ్ ప్రేమను పొందే నిబంధనల విషయానికి వస్తే, హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా ఇలా వివరించారు:

ప్రవక్త (స) యొక్క ఒక హదీస్-ఎ-ఖుద్సీలో ఇలా ఉంది:

"లౌలాక లమా ఖలక్తుల్ అఫ్లాక్"

(నీవు లేకపోతే నేను ఈ విశ్వాలను సృష్టించేవాడిని కాదు.)

అనగా, అల్లాహ్ తఆలా ఇలా చెబుతున్నాడు: నేను నిన్ను సృష్టించకపోతే ఈ ప్రపంచాన్ని సృష్టించేవాడిని కాదు; ఈ భూమి మరియు ఆకాశాలను సృష్టించే వాడిని కాదు.

ముస్లింలలోని ఒక పెద్ద వర్గం ఈ హదీస్ యొక్క ప్రామాణికతపై అభ్యంతరం వ్యక్తం చేస్తుంది. కానీ ఈ యుగపు ఇమామ్ మరియు ప్రవక్త (స) యొక్క నిజమైన ప్రేమికుడు ఈ హదీస్ యొక్క ప్రామాణికత గురించి మనకు జ్ఞానం అందించారు. ఇది ప్రవక్త (స) యొక్క అత్యున్నత స్థానాన్ని సూచించే స్థానం.

వారు ప్రవక్తలందరిలో అత్యున్నతులు. వారు ప్రళయదినం వరకు అన్ని కాలాల కోసం పంపబడ్డారు. అల్లాహ్ తఆలా వారికి ' మీ అనుసరణ ద్వారా మనిషి అల్లాహ్ తఆలా యొక్క ప్రేమను పొందుతాడు' అనే స్థానం ప్రసాదించాడు. వారికి ఖాతమ్-ఎ-నుబువ్వత్ అనే ముద్ర ప్రసాదించబడింది, ఇది పూర్వపు ప్రవక్తలందరిపై స్థిరపడి, వారి ప్రవక్తత్వాన్ని ధృవీకరిస్తుంది.

వారికి ఖాతమున్నబియ్యీన్ అనే స్థానం లభించింది. వారి ఉమ్మత్‌లోని ఒక వ్యక్తికి కూడా ప్రవక్తత్వ స్థాయి లభించింది. వారి ఉమ్మత్‌లో సభ్యుడిగా ఉండటం మరియు నిజమైన ప్రేమికుడిగా ఉండటమే ప్రవక్త (స) భవిష్యవాణి ప్రకారం రాబోయే మసీహ్ మరియు మహ్దీకి ప్రవక్తత్వ స్థానం లభించడానికి కారణమైంది.

అల్లాహ్ తఆలా ఖుర్‌ఆన్‌లో ఇలా పేర్కొన్న మీ దైవిక సమీపత:

"తుమ్మ దనా ఫతదల్లా" (అన్-నజ్మ్: 10)

ఇది అల్లాహ్ తఆలా యొక్క సమీపతలో అత్యున్నత స్థాయి.

(ఖుత్బాత్-ఎ-మస్రూర్, భాగం 9, పుట 39)

అల్లాహ్ తఆలా మనందరికి అత్యుత్తమ ఆదర్శానికి అధిపతి అయిన హజ్రత్ మహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహివసల్లం ను అనుసరించే భాగ్యాన్ని మరియు దైవ ప్రేమ అనే స్వర్గాన్ని ప్రసాదించుగాకా!. ఆమీన్.

**ప్రపంచ అహ్మదీయ్య జమాఅత్ సభ్యులకు ఒక ముఖ్య ప్రకటన:**

మన ప్రియతమ ఖలీఫా, అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి శుభప్రదమైన సూచన మేరకు తమను తాము ఆధ్యాత్మికపరమైన పటిష్టమైన కోటలో చేర్చుకొనుటకు ఈ రోజు మీరు ఈ క్రింది దుఆలను పఠించారా?.

(1) سُبْحَانَ اللّٰهِ وَبِحَمْدِهٖ سُبْحَانَ اللّٰهِ الْعَظِيْمِ اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّاٰلِ مُحَمَّدٍ

సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీమ్ అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వ్వ అలే ముహమ్మద్. (200 సార్లు పఠించవలెను)

(2) اَسْتَغْفِرُ اللّٰهَ رَبِّيْ مِنْ كُلِّ ذَنْبٍ وَّاَتُوْبُ اِلَيْهِ

అస్తఘ్‌ఫిరుల్లాహ రబ్బి మిన్‌కుల్లి జన్‌బిన్ వ్వఅతూబు ఇలైహి.

**100 సార్లు పఠించవలెను.**

(3) رَبِّ كُلُّ شَيْءٍ خَادِمُكَ رَبِّ فَاحْفَظْنِيْ وَانْصُرْنِيْ وَارْحَمْنِيْ

రబ్బికుల్లి షైయిన్ ఖాదిముక రబ్బి ఫాహ్‌ఫజ్‌నీ వన్‌సుర్‌నీ వర్‌హమ్‌నీ.

**100 సార్లు పఠించవలెను.**

(25 సం॥ పైబడిన వారు పైన పేర్కొనబడినట్లుగా పఠించవలెను. 15 నుండి 25 సం॥ల వారు 100సార్లు, 15సం॥ల కంటే తక్కువ వయస్సు గలవారు 33 సార్లు, చిన్న పిల్లల తరుపున వారి తల్లిదండ్రులు 3నుండి 4 సార్లు పఠిస్తూ, పిల్లలతో కూడ పఠింపజేయవలెను.)

## సీరత్ ఖాతమున్నబియ్యీన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):-

سیرت خاتم النبیین صلی اللہ علیہ وآلہ وسلم

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

(గత సంచిక తరువాత)

**తల్లి మరణం:-**

సుమారు ఒక నెల రోజుల నివాసం అనంతరం ఆమినా తిరుగు ప్రయాణం ప్రారంభించారు. అయితే, ఆమె భర్తలాగే ఆమె మరణం కూడా స్వదేశానికి దూరంగానే సంభవించడం విధిగా నిలిచింది. ప్రయాణమధ్యలో ఆమె అనారోగ్యానికి గురై, అబ్వా అనే ప్రదేశంలో మరణించారు. ఆమెను అక్కడే సమాధి చేశారు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ ప్రవక్తత్వ కాలంలో ఒకసారి ఆ ప్రదేశం గుండా వెళ్తున్నప్పుడు తన తల్లి సమాధిని సందర్శించారు. దానిని చూసి ప్రవక్త (స) కళ్లలో నీళ్లు తిరిగాయి. ఈ దృశ్యాన్ని చూసిన సహాబాలు కూడా కన్నీళు పెట్టుకున్నారు. అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారితో ఇలా అన్నారు:

"అల్లాహ్ నాకు నా తల్లి సమాధిని దర్శించుకోవడానికి అనుమతి ఇచ్చాడు. కానీ ఆమె కోసం ప్రార్థించడానికి (దుఆ చేయడానికి) అనుమతి ఇవ్వలేదు."

దీనిని బట్టి ప్రవక్త (స) తల్లికి క్షమాపణ లభించదని అర్థం చేసుకోకూడదు. ఎందుకంటే ఆ విషయం పూర్తిగా అల్లాహ్ చేతుల్లోనే ఉంది. ఎవరి అంతిమ ఫలితం ఎలా ఉంటుందో మనం ఖచ్చితంగా చెప్పలేం. అయితే దీని ద్వారా తెలిసేది ఏమిటంటే, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇతర సందర్భాల్లో కూడా చెప్పినట్లుగా, షిర్క్ (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించే విశ్వాసం) స్థితిలో మరణించిన వారి కోసం ప్రార్థించడం సరైనది కాదు. వారి విషయాన్ని అల్లాహ్‌కే అప్పగించాలి.

తల్లి మరణంతో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పూర్తిగా అనాథగా మారారు. చిన్న వయస్సులోనే స్వస్థలానికి దూరంగా, బంధువుల నుండి వేరై, తల్లిని కోల్పోవడం, అదీ అప్పటికే తండ్రి మరణించి ఉండగా సాధారణమైన విషాదం కాదు. ఈ సంఘటనలు ప్రవక్త (స) హృదయంపై లోతైన, శాశ్వతమైన ప్రభావాన్ని చూపాయి. నిస్సందేహంగా, అల్లాహ్ ప్రవక్త (స)ను సమస్త లోకాల కోసం కరుణామూర్తిగా (రహ్మతుల్ లిల్ ఆలమీన్) పంపించాడు. అయినప్పటికీ, మానవ జీవితంలోని ఈ ప్రారంభ కష్టాలు కూడా వారి స్వభావాన్ని గాఢంగా ప్రభావితం చేశాయి. పేదల పట్ల వారికున్న ప్రేమ, కష్టాల్లో ఉన్నవారి పట్ల వారు చూపిన అపారమైన సానుభూతి, ఈ బాల్య దుఃఖాల వల్ల మరింత విశిష్టమైన లక్షణాలుగా రూపుదిద్దుకున్నాయి. పవిత్ర ఖుర్‌ఆన్‌లో ప్రవక్త (స) అనాథత్వాన్ని ఈ విధంగా ప్రస్తావించబడింది:

" అలం యజిద్‌క యతీమన్ ఫఆవా.... ఫఅమ్మల్ యతీమా ఫలాతఖ్‌హర్"

"మేము నిన్ను అనాథగా చూసి నీకు ఆశ్రయం కల్పించలేదా? ...కాబట్టి నీవు కూడా అనాథలతో దయగా, మృదువుగా ప్రవర్తించాలి."

**అబ్దుల్ ముత్తలిబ్ సంరక్షణ:-**

తల్లి మరణించిన తర్వాత ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సేవకురాలు ఉమ్మే అయ్‌మన్ తో కలిసి మక్కాకు చేరుకున్నారు. ఈ ఉమ్మే అయ్‌మనే వారి తండ్రి మరణించినప్పుడు వారసత్వంగా వారికి వచ్చిన బానిస మహిళ. పెద్దయ్యాక ప్రవక్త (స) ఆమెకు స్వేచ్ఛ ప్రసాదించి, ఆమెతో ఎంతో దయతో, గౌరవంగా ప్రవర్తించారు. తరువాత ఉమ్మే అయ్‌మన్ వివాహం, విముక్తి కల్పించిన బడిన ప్రవక్త (స) దాసుడు జైద్ బిన్ హారిస్‌తో జరిగింది. వారికి ఉసామా బిన్ జైద్ జన్మించాడు. ఉమ్మే అయ్‌మన్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించిన తరువాత కూడా కొంతకాలం జీవించారు. మొత్తానికి తల్లి మరణం తరువాత మక్కాకు చేరుకున్న ప్రవక్త (స)ను వారి తాత గారైన అబ్దుల్ ముత్తలిబ్ ప్రత్యక్షంగా తన సంరక్షణలోకి తీసుకున్నారు. అబ్దుల్ ముత్తలిబ్ వారిని ఎంతగానో ప్రేమించేవారు. కాబా ప్రదక్షిణ (తవాఫ్) చేస్తున్నప్పుడు ప్రవక్త (స)ను తన భుజాలపై కూర్చోబెట్టేవారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం కూడా తన తాతగారితో ఎంతో చనువుగా ఉండేవారు. అబ్దుల్ ముత్తలిబ్‌కు కాబా ప్రాంగణంలో ఒక ప్రత్యేక ఆసనం ఉండేది. అక్కడ పరచిన పరుపుపై ఆయన తప్ప మరెవరూ కూర్చోడానికి ధైర్యం చేసేవారు కాదు. ఆయన స్వంత కుమారులు కూడా కొంత దూరంగా కూర్చునేవారు. కానీ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రేమాభిమానాలతో నేరుగా వెళ్లి తన తాతగారి పక్కనే కూర్చుండేవారు. అబ్దుల్ ముత్తలిబ్ దీనిని చూసి ఎంతో సంతోషించే వారు. కొన్నిసార్లు ప్రవక్త (స) పినతండ్రులు ప్రవక్త (స)ను ఆ పరుపుపై కూర్చోనివ్వకుండా అడ్డుకునేవారు. అప్పుడు అబ్దుల్ ముత్తలిబ్ వారిని ఆపుతూ ఇలా చెప్పేవారు: "అతనిని ఏమీ అనకండి. అతన్ని అలాగే ఉండనివ్వండి."

**అబ్దుల్ ముత్తలిబ్ మరణం:-**

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ ప్రేమాభిమానాల మధ్య జీవితం గడుపుతున్న సమయంలో, వారి తాతగారైన అబ్దుల్ ముత్తలిబ్‌కు కూడా మరణ సమయం వచ్చింది. ఆయన జనాజా తీసుకువెళ్తున్నప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం దాని వెంట నడుస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. చిన్న వయస్సులో వారు ఎదుర్కొన్న మూడవ పెద్ద విషాదం ఇది. ఆ సమయంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వయస్సు ఎనిమిది సంవత్సరాలు. అబ్దుల్ ముత్తలిబ్ వయస్సు గురించి వివిధ చారిత్రక వర్ణనల్లో ఎనభై సంవత్సరాల నుంచి నూట నలభై సంవత్సరాల వరకు ఉన్నట్లు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి.

అబ్దుల్ ముత్తలిబ్‌కు వివిధ భార్యల ద్వారా అనేక మంది కుమారులు ఉన్నారు. వారిలో ప్రసిద్ధులు: హారిస్, జుబైర్, అబూ తాలిబ్, అబూ లహబ్, అబ్దుల్లాహ్, అబ్బాస్, హమ్జా. వీరిలో అబూ తాలిబ్ మరియు అబ్దుల్లాహ్ ఒకే తల్లి సంతానం. బహుశా ఈ బంధాన్ని దృష్టిలో ఉంచుకుని, మరణించే సమయంలో అబ్దుల్ ముత్తలిబ్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సంరక్షణ బాధ్యతను అబూ తాలిబ్‌కు అప్పగించి, వారిని ప్రత్యేక శ్రద్ధతో చూసుకోవాలని ఉపదేశించారు. అప్పటి నుంచి ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన చిన్నాన్న అబూ తాలిబ్ సంరక్షణలో నివసించడం ప్రారంభించారు. అబ్దుల్ ముత్తలిబ్ నిర్వహించిన ముఖ్య సామాజిక బాధ్యతల్లో "సికాయా" (హజ్ యాత్రికులకు నీరు అందించడం) మరియు "రిఫాదా" (యాత్రికులకు ఆహార ఏర్పాట్లు చేయడం) ప్రముఖమైనవి. మరణానికి ముందు ఈ బాధ్యతలను తన పెద్ద కుమారుడు జుబైర్‌కు అప్పగించారు. కాని వీటి నిర్వహణకు అధిక ధనం అవసరమవడంతో, జుబైర్ తన సామర్థ్యానికి మించిన బాధ్యతగా భావించి ఈ రెండింటినీ అబూ తాలిబ్‌కు అప్పగించారు. అబూ తాలిబ్ కూడా ఆర్థికంగా బలహీనుడైనందున "రిఫాదా" బాధ్యత బను నౌఫల్ వంశానికి వెళ్లింది. "సికాయా" బాధ్యతను మాత్రం తరువాత అబూ తాలిబ్, తులనాత్మకంగా ధనవంతుడైన అబ్బాస్‌కు అప్పగించారు.

ఇక్కడ ఒక విషయం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. అబ్దుల్ ముత్తలిబ్ జీవించి ఉన్నంత కాలం బను హాశిమ్ వంశం అత్యంత గౌరవనీయమైనది. ఖురైష్ తెగలలో వారికి విశిష్టస్థానం ఉండేది. కానీ ఆయన మరణం తర్వాత ఆ గౌరవాన్ని కొనసాగించ గల నాయకుడు బను హాశిమ్‌లో లేకపోవడంతో, ఖురైష్‌పై వారి సాధారణ నాయకత్వం క్రమంగా తగ్గిపోయింది. వారి ప్రత్యర్థులైన బను ఉమయ్యా వంశం క్రమంగా బలపడుతూ ప్రభావవంతమైంది.

**అబూ తాలిబ్ సంరక్షణ:-**

అబూ తాలిబ్ తన తండ్రి చివరి కోరికను అత్యంత నిజాయితీతో, ప్రేమతో నెరవేర్చారు. తన సొంత పిల్లల కంటే కూడా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఎంతో ప్రేమగా చూసుకున్నారు. ఎల్లప్పుడూ వారిని తన కళ్ల ముందే ఉంచేవారు. రాత్రి సమయంలో కూడా సాధారణంగా తన పక్కనే నిద్రపుచ్చే వారు.

**సిరియా ప్రయాణం మరియు బహీరా సన్యాసి సంఘటన:-**

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వయస్సు పన్నెండు సంవత్సరాలకు చేరుకున్నప్పుడు, అబూ తాలిబ్ ఒక వాణిజ్య బృందంతో కలిసి సిరియా ప్రాంత ప్రయాణానికి సిద్ధమయ్యారు. ప్రయాణం చాలా పొడవుగా, కష్టసాధ్యంగా ఉండటంతో, మొదట ఆయన ప్రవక్త(స)ను మక్కాలోనే ఉంచాలని నిర్ణయించారు. కానీ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు అబూ తాలిబ్ నుండి దూరమవడం చాలా బాధ కలిగించింది. బయలుదేరే సమయంలో ప్రేమాభిమానాలతో అబూ తాలిబ్‌ను గట్టిగా కౌగిలించుకుని ఏడవసాగారు. ఆ దృశ్యం చూసి అబూ తాలిబ్ హృదయం కదిలిపోయింది. చివరకు ఆయన కూడా ప్రవక్త(స)ను తన వెంట తీసుకువెళ్లారు.

సిరియా దక్షిణ భాగంలో బుస్రా అనే ప్రసిద్ధ ప్రదేశం ఉంది. అక్కడికి చేరుకున్నప్పుడు ఒక విశేష సంఘటన జరిగింది. అక్కడ బహీరా అనే క్రైస్తవ సన్యాసి నివసించేవాడు. ఖురైష్ బృందం అతని ఆశ్రమం సమీపానికి చేరుకున్నప్పుడు, అక్కడి రాళ్లు, చెట్లు మొదలైనవి ఒక్కసారిగా సాష్టాంగ నమస్కారం చేసినట్లు అతడు గమనించాడు. దైవగ్రంథాల ప్రకారం త్వరలో ఒక ప్రవక్త ప్రత్యక్షమవుతాడని అతనికి తెలుసు. అందువల్ల తన పరిశీలన ద్వారా ఆ ప్రవక్త ఈ బృందంలోనే ఉన్నారని అతడు గ్రహించాడు. కావున అతడు తన ముఖలక్షణాలను పరిశీలించే జ్ఞానం ద్వారా ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను గుర్తించి, ఈ విషయం అబూ తాలిబ్‌కు తెలియజేశాడు. అలాగే అహ్లుల్ కితాబ్ (దైవగ్రంథాలను అనుసరించే ప్రజలు) వల్ల కలిగే ప్రమాదాల నుంచి ప్రవక్త(స)ను రక్షించాలని అబూ తాలిబ్‌కు సూచించాడు.

రివాయత్ (వివరణల పరంపర) విధానం ప్రకారం ఈ సంఘటనకు సంబంధించిన సనద్ (ప్రసార పరంపర) బలహీనంగా పరిగణించబడుతుంది. ఒకవేళ వాస్తవంగా ఇలాంటి సంఘటన జరిగినా కూడ అందులో ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. చెట్లు మొదలైనవి సజ్దా చేయడం అనేది ఆ సన్యాసి (రాహిబ్)కు కలిగిన ఒక ఆధ్యాత్మిక దర్శనంగా భావించవచ్చు. ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంవారి ఉన్నత స్థానం దృష్ట్యా, అలాంటి విషయం అసాధారణమైనదిగా పరిగణించాల్సిన అవసరం లేదు.

( తరువాయి భాగం తదుపరి సంచికలో చదవగలరు)

## సీరతుల్ మహ్దీ (అలైహిస్సలాతు వస్సలాం):- سیرت المہدی علیہ السلام

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

**(గత సంచిక తరువాత)**

ఈ విషయం ఇలాంటి ఆధ్యాత్మిక విషయాల గురించి పరిచయం లేని వారికి ఆశ్చర్యంగా అనిపించవచ్చు. ఎందుకంటే, మరోవైపు వారు సూఫీలు మరియు వలీలు (పవిత్రులు) తరచుగా సంపూర్ణ ప్రశాంతత మరియు మనశ్శాంతి స్థితిలో మరణిస్తారని వింటారు, అలాగే అలాంటి సంఘటనలను గమనిస్తారు.

ఈ విషయాల అవగాహన లేని వారికి ఇది ఆశ్చర్యంగా అనిపించవచ్చు. ఎందుకంటే, మరోవైపు వారు సూఫీలు మరియు సంతులు తమ మరణ సమయాన్ని సంపూర్ణ ప్రశాంతతతో, నిశ్చలమైన మనస్థితితో ఎదుర్కొని ఈ లోకాన్ని విడిచిపెడతారని వింటారు, చూస్తుంటారు.

అయితే వాస్తవం ఏమిటంటే, ఒక ప్రవక్త మరణాన్ని సమీపిస్తున్నప్పుడు, తన సమాజం పట్ల తనపై ఉన్న బాధ్యతలన్నింటి భారమూ, అలాగే వారి భవిష్యత్తుపై ఉన్న ఆందోళన అంతా వారి ముందు నిలుస్తాయి. ఇతరుల కంటే ఎక్కువగా, మరణం అనేది దేవుని సన్నిధిలో నిలబడటానికి తప్పని సరిగా దాటవలసిన ద్వారమని ప్రతి ప్రవక్త పూర్తిగా అర్థం చేసుకుంటాడు.

అందువల్ల, అల్లాహ్‌ను కలుసుకునే క్షణం సమీపించి నందుకు వారి హృదయం ఆనందంతో నిండిపోతుంది. అయితే, తనపై ఉన్న అపారమైన బాధ్యతల స్పృహ, తన సమాజ భవిష్యత్తుపై ఉన్న గాఢమైన చింతన వారిని అసాధారణమైన వేదనలో ముంచెత్తుతాయి.

కానీ సూఫీలు మరియు సంతులు ఇలాంటి బాధ్యతల నుండి విముక్తులై ఉంటారు. వారు తమ స్వంత ఆత్మ యొక్క భారాన్నే మోస్తారు. అయితే ప్రవక్తలు వేలాది, లక్షలాది, అంతేకాక కోట్లాది మానవుల బాధ్యతను మోస్తారు.
కాబట్టి, ఈ రెండింటి మధ్య ఉన్న తేడా స్పష్టంగా కనిపిస్తుంది.

(వాలిదా సాహిబా చెప్పిన ప్రకారం, వారు ఆందోళన వ్యక్తం చేసినప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా అన్నారు: "నేను ఇంతకాలం చెప్పుకుంటూ వచ్చినది ఇదే." ఈ మాటలతో వారి ఉద్దేశ్యం ఏమిటని నేను తల్లిగారిని అడిగాను. దానికి తల్లిగారు ఇలా సమాధానమిచ్చారు: "నేను ఎప్పుడూ నా మరణ సమయం సమీపించిందని చెప్పేవాడిని; ఇప్పుడు దేవుడు నిర్ణయించిన ఆ సమయం వచ్చేసింది" అని హుజూర్ (అ) భావించారు. మరల ఇలా తెలిపారు. ఈ మాటల ద్వారా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తమను ఓదారుస్తూ, "భయపడవలసిన అవసరం లేదు. దేవుడు నాకు ముందుగానే తెలియజేసిన నిర్ణీత సమయం ఇదే. ఈ దైవ వాగ్దానం ఎలా నెరవేరుతోందో, అలాగే నా మరణానంతరం దేవుడు అందించే తన దైవిక సహాయం వంటి ఇతర వాగ్దానాలు కూడా తప్పకుండా నెరవేరుతాయి. దేవుడే అందరి బాధ్యతను స్వయంగా స్వీకరిస్తాడు" అని చెప్పారని అన్నారు.

వాలిదా సాహిబా మరల ఇలా తెలిపారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తరచూ తీవ్రమైన విరేచనాలతో బాధపడేవారు. ఆ వ్యాధి కారణంగా కొన్నిసార్లు వారు చాలా బలహీన పడేవారు. చివరకు అట్టి అనారోగ్యం వల్లనే వారు (అ) ఈ లోకాన్ని విడిచిపెట్టారు.)

(13) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:హజ్రత్ వాలిదా సాహిబా (మా తల్లి గారు) నాకు ఇలా తెలిపారు: హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) అల్-వసియత్ అనే పుస్తకాన్ని రచిస్తున్న రోజులలో, ఒకసారి హుజూర్ (అ) షరీఫ్ సాహిబ్ (అంటే నా చిన్న తమ్ముడు అజీజ్ మిర్జా షరీఫ్ అహ్మద్ రహ్.) ఇంటి ఆవరణలో నడుస్తున్నారు. అప్పుడు హుజూర్ (అ) నాతో ఇలా అన్నారు: "మౌల్వీ ముహమ్మద్ అలీని ఒక ఆంగ్లేయుడు " పెద్ద పెద్ద నాయకులు తమ తరువాతి వారసుడిని ఏ విధముగానైతే నియమిస్తారో, అదే విధముగా మిర్జా సాహిబ్ కూడా తనకు వారసుడిని నియమించారా? లేదా?" అని అడిగాడు. ఆ తరువాత "నీ అభిప్రాయం ఏమిటి? నేను మహ్మూద్ (ఖలీఫతుల్ మసీహుస్సాని) పేరును రాసి పెట్టాలా? లేక అతనిని వారసుడిగా నియమించాలా?" అని హుజూర్ (అ) నన్ను అడిగారు. అందుకు (వాలిదా సాహిబా చెప్పారు) నేను "హుజూర్‌కు ఎలా సముచితంగా అనిపిస్తే అలా చేయండి" అని తెలిపాను.

(14) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా నాకు ఇలా చెప్పారు: హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తరచూ ఇలా చెప్పేవారు: "మన జమాఅత్‌లో మూడు రకాల వ్యక్తులు ఉన్నారు. మొదటి రకం వారు: వారికి ప్రపంచ వైభవం, ప్రతిష్ఠల పట్ల ఆసక్తి ఉంటుంది. పెద్ద పెద్ద శాఖలు, కార్యాలయాలు, విశాల భవనాలు మొదలైనవి ఉండాలని కోరుకుంటారు. రెండవ రకం వారు: మౌల్వీ నూరోద్దీన్ సాహిబ్ వంటి ప్రముఖుల ప్రభావంతో జమాఅత్‌లో చేరినవారు. వారి అనుబంధం ప్రధానంగా ఆ వ్యక్తులతోనే ఉంటుంది. మూడవ రకం వారు: వారికి నాతో వ్యక్తిగతమైన, ప్రత్యేకమైన సంబంధం ఉంది. వారు ప్రతి విషయంలో నా సంతోషాన్నీ, నా అభిప్రాయాన్నీ అన్నిటికంటే ముందుగా ఉంచుతారు."

(15) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: ఈ భవదీయుడు ఇలా నివేదిస్తున్నాడు: లాహోర్‌లో హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పరమపదించిన సమయంలో, హజ్రత్ మౌల్వీ నూరోద్దీన్ సాహిబ్ హుజూర్ (అ) పరమపదించిన గదిలో లేరు. హజ్రత్ మౌల్వీ సాహిబ్‌కు వార్త తెలిసిన వెంటనే, అక్కడికి వచ్చి, హజ్రత్ సాహిబ్ నుదిటిపై ముద్దుపెట్టి, కొద్దిసేపటికే గది నుండి బయటకు వెళ్లారు. హజ్రత్ మౌల్వీ సాహిబ్ గది తలుపు దాటి బయట అడుగు పెట్టగానే, మౌల్వీ సయ్యద్ ముహమ్మద్ అహసన్ సాహిబ్ ఎంతో భావోద్వేగంతో ఇలా అన్నారు: "అంత సిద్దీకీ" అందుకు మౌల్వీ నూరోద్దీన్ సాహిబ్ ఇలా సమాధానమిచ్చారు: "మౌల్వీ సాహిబ్! ఈ విషయాన్ని ఇక్కడే వదిలేయండి. ఖాదియాన్‌కు వెళ్లిన తరువాత దీనిపై నిర్ణయం తీసుకుంటాం." ఈ సంభాషణను నేను తప్ప మరెవరూ వినలేదని నాకు అనిపిస్తుంది.


(16) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: ఈ భవదీయుడు ఇలా తెలియ జేస్తున్నాడు: హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) వద్ద మూడు ఉంగరాలు ఉండేవి. మొదటి ఉంగరం: దీనిపై "అలైసల్లాహు బికాఫిన్ అబ్దహూ" (అల్లాహ్ తన సేవకునికి చాలడా?) అనే వాక్యం లిఖించబడి ఉండేది. దీనిని గురించి హుజూర్ (అ) తమ అనేక రచనల్లో ప్రస్తావించారు. ఇది హుజూర్ (అ) ప్రవక్తత్వ ప్రకటనకు చాలా సంవత్సరాల ముందే తయారు చేయించబడిన మొదటి ఉంగరం. రెండవ ఉంగరం : దీనిపై హుజూర్ (అ)పై అవతరించిన దైవవాణి "ఘరస్తు లక బియదీ రహ్మతీ వ ఖుద్రతీ..." కి చెందిన పదాలు ఉండేవి. ఇది హుజూర్ (అ) ప్రవక్తత్వ ప్రకటన తర్వాత తయారు చేయబడింది. ఈ దైవవాణి వాక్యం కొంచెం పొడవుగా ఉండటంతో, ఈ ఉంగరంలోని రత్నం (నగీనా) మిగతా వాటికంటే పెద్దదిగా ఉండేది. ఇది కూడా చాలా కాలం హుజూర్ (అ) చేతికి ఉండేది. మూడవ ఉంగరం: ఇది హుజూర్ (అ) జీవితపు చివరి సంవత్సరాలలో తయారు చేయించబడింది. హుజూర్ (అ) పరమపదించినప్పుడు కూడ ఇది హుజూర్ (అ) చేతికి ఉన్నది. ఈ ఉంగరాన్ని హుజూర్ (అ) స్వయంగా తయారు చేయించలేదు. ఒక వ్యక్తి హుజూర్ (అ)తో ఇలా అన్నాడు: "హుజూర్! మీ కోసం ఒక ఉంగరం తయారు చేయించాలని అనుకుంటున్నాను. దానిపై ఏమి వ్రాయించాలి?" అందుకు హుజూర్ (అ) ఇలా సమాధాన మిచ్చారు: "మౌలా బస్" (ప్రభువు చాలు.) ఆ వ్యక్తి అదే పదాలను చెక్కించి ఆ ఉంగరాన్ని హుజూర్ (అ)కు సమర్పించాడు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పరమపదించినప్పుడు, ఒక వ్యక్తి ఈ ఉంగరాన్ని హుజూర్ (అ) చేతి నుండి తీసుకున్నాడు. తరువాత వాలిదా సాహిబా దానిని తిరిగి తీసుకున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పరమపదించిన కొంతకాలం తరువాత, ఆ మూడు ఉంగరాలను మా ముగ్గురు సోదరుల మధ్య పంచేందుకు వాలిదా సాహిబా చీటీలు వేశారు. ఈ క్రమంలో "అలైసల్లాహు బికాఫిన్ అబ్దహూ" అనే ఉంగరం పెద్ద అన్నయ్య, అంటే హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని (రజి) వారికి వచ్చింది. "ఘరస్తు లక బియదీ రహ్మతీ వ ఖుద్రతీ" అనే ఉంగరం ఈ భవదీయుడికి వచ్చింది. (తజ్‌కిరా పేజీ 428, అనుబంధం. ప్రచురణ 2004) "మౌలా బస్" అనే ఉంగరం మా తమ్ముడు మియాఁ షరీఫ్ అహ్మద్ సాహిబ్‌కు వచ్చింది. మా సోదరీమణులకు కూడా ఇలాంటి మరో రెండు పవిత్ర జ్ఞాపక చిహ్నాలు (తబర్రుకాత్) వాటాగా లభించాయి.

(17) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం: హజ్రత్ వాలిదా సాహిబా నాకు ఇలా తెలిపారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒకసారి ఇలా పేర్కొన్నారు:

"ఒకసారి నేను ఒక కేసు విచారణ కోసం న్యాయస్థానానికి వెళ్లాను. కోర్టులో ఇతర కేసుల విచారణలు కొనసాగుతుండగా, నేను బయట ఒక చెట్టు క్రింద వేచి ఉన్నాను. నమాజ్ సమయం కావడంతో అక్కడే నమాజ్ చేయడం ప్రారంభించాను. నమాజ్ జరుగుతున్న సమయంలోనే కోర్టు నుండి నా పేరును పలుమార్లు పిలవడం ప్రారంభించారు. అయినప్పటికీ నేను నమాజ్‌ను కొనసాగించాను. నమాజ్ పూర్తయిన తర్వాత చూసే సరికి, కోర్టుకు చెందిన బంట్రోతు (కోర్టు పరిచారకుడు) నా దగ్గర నిలబడి ఉన్నాడు. నేను సలాం ముగించగానే అతను ఇలా అన్నాడు: 'మిర్జా సాహిబ్, అభినందనలు! మీరు కేసు గెలిచారు."

**(తరువాయి భాగం తదుపరి సంచికలో)**

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 23-30 JUL 2026, Issue No : 30-31

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

## సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బిన్రస్రిహిల్ అజీజ్ గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.

**అహ్మదీయ ముస్లిం జమాఅత్ ఆస్ట్రేలియా జాతీయ ఆమిలా (కార్యవర్గం)తో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ వారి సమావేశం:-**

**(గత సంచిక తరువాత)**

హుజూర్ అన్వర్ మరల ఇలా అన్నారు: యుకేలో అబ్బాయిలు మరియు అమ్మాయిలకు ఒక ప్రశ్నాపత్రం ఇచ్చారు. దానిని తమ పేరు రాయకుండా, అనామకంగా పూరించి తమ సమాధానాలను పంపించాలని వారికి సూచించారు. ఈ విధంగా ఒక సర్వే నిర్వహించబడింది. ఆ ప్రశ్నల్లో: జీవిత భాగస్వామికి ఎలాంటి లక్షణాలు ఉండాలి? భార్య తన భర్త నుండి ఏమి ఆశిస్తుంది? అలాగే భర్త తన భార్య నుండి ఏమి ఆశిస్తాడు? పరిసర వాతావరణం భర్తలపై, భార్యలపై ఎలాంటి ప్రభావం చూపుతోంది? ఇరు కుటుంబాల తల్లిదండ్రుల వైఖరి ఎలా ఉండాలి? తల్లిదండ్రులు వైవాహిక జీవితంపై ఎలా ప్రభావం చూపుతారు? వంటి అనేక అంశాలు ఉన్నాయి.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: ఈ సర్వే ద్వారా వచ్చిన సమాధానాలు నాకు ఎంతో విలువైన సమాచారాన్ని అందించాయి. వాటి వల్ల అనేక జల్సాలు మరియు ఇజ్తిమాలలో ప్రసంగించడానికి తగిన అంశాలను సిద్ధం చేయడం చాలా సులభమైంది. ఆ ప్రసంగాల్లో నేను ఈ సమస్యలన్నింటినీ ప్రస్తావించి వాటికి ఇస్లామీయ బోధనల ప్రకారం పరిష్కారాలను వివరించాను.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: ఇటువంటి సమాచారం మరియు అభిప్రాయాలు ప్రతి ప్రాంతం నుండీ తనకు చేరాలి. స్వేచ్ఛ (ఫ్రీడమ్) పేరుతో అనేక ప్రశ్నలు లేవనెత్తబడుతున్నాయి. అలాంటి ప్రశ్నలను కఠినంగా అణచివేస్తే సమస్యలు ఉత్పన్నమవుతాయి. దానికి బదులుగా ఇస్లాం బోధనలను జ్ఞానంతో, ప్రేమతో, ఆప్యాయతతో వివరించి వారికి అర్థమయ్యేలా చేయాలి.

హుజూర్ అన్వర్ ఒక సంఘటనను ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: మెల్‌బోర్న్ నుండి ఒక కుటుంబం తనను కలవడానికి వచ్చింది. ఆ కుటుంబంలోని భర్త జమాఅత్ కార్యక్రమాలకు హాజరు కావడం లేదని, అయితే అతని భార్య మరియు పిల్లలు మాత్రం వస్తున్నారని తెలిసింది. అతని ముఖాన్ని చూసి ఏదో బాధ ఉందని హుజూర్ గమనించారు. "ఏదైనా జమాఅత్ పదవి దారుడి ప్రవర్తన వల్ల మీకు బాధ కలిగిందా?" అని అడగగా, ఆ వ్యక్తి భావోద్వేగానికి లోనై ఏడవడం ప్రారంభించాడు. అప్పుడు నేను అతనికి ధైర్యం చెప్పి, సలహా ఇచ్చి ఓదార్చాను.

అయితే జమాఅత్ పదవిదారుల ప్రవర్తన ఆదర్శప్రాయంగా ఉండాలి. తమ పదవిదారుల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఎందుకంటే కొంతమంది వారి అనుచిత ప్రవర్తన వల్ల జమాఅత్‌కు దూరమవుతున్నారు. వ్యక్తిగత అహంకారాన్ని, మనస్పర్థలను పూర్తిగా తొలగించాలి. అల్లాహ్ ప్రసాదించిన సేవా అవకాశాన్ని ఒక గొప్ప దైవానుగ్రహంగా భావించాలి.

మజ్లిస్-ఎ-షూరా మరియు జమాఅత్ ఎన్నికలకు ముందు నేను ఒక జుమా ప్రసంగం ఇచ్చారు. జమాఅత్‌లోని ప్రతి పదవిదారుడు ఆ ఖుత్బాను వినాలి. అదే విధంగా యుకే షూరా సందర్భంగా చేసిన ప్రసంగాన్ని కూడా అందరూ వినాలి.

హుజూర్ అన్వర్ మరల ఇలా తెలిపారు: చౌధరీ జుహూర్ బాజ్వా సాహిబ్ నాకు ఒక విషయం చెప్పారు. హజ్రత్ మిర్జా షరీఫ్ అహ్మద్ సాహిబ్ నాజిర్ ఇస్లాహ్ వ ఇర్షాద్‌గా సేవలందిస్తున్న కాలంలో, మృతుడు జుహూర్ అహ్మద్ బాజ్వా సాహిబ్‌ను నాయిబ్ నాజిర్ ఇస్లాహ్ వ ఇర్షాద్ గా నియమించినప్పుడు, హజ్రత్ మిర్జా షరీఫ్ అహ్మద్ సాహిబ్ ఆయనకు ఈ విధంగా ఉపదేశించారు:

"ఇప్పుడు మీరు నాయిబ్ నాజిర్‌గా నియమితులయ్యారు. ఒక విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోండి. ఒక వ్యక్తిని అహ్మదీయత్‌లోకి తీసుకురావడం చాలా కష్టం. కానీ అతనిని దూరం చేయడం మాత్రం చాలా సులభం."

కావున జమాఅత్ పదవిదారులు తమ ప్రవర్తనను సరిదిద్దుకుని, ప్రతి ఒక్కరితో ప్రేమ, దయ, ఆప్యాయతతో వ్యవహరించాలి.

హుజూర్ అన్వర్ మరల ఇలా అన్నారు: ప్రతి జమాఅత్‌లోని తర్బియత్ కార్యదర్శులు తప్పనిసరిగా రిఫ్రెషర్ శిక్షణా కోర్సులు నిర్వహించాలి. తద్వారా వారికి తగిన శిక్షణ లభిస్తుంది. తమ బాధ్యతలను ఎలా నిర్వహించాలి, అందరినీ కలుపుకొని ఎలా ముందుకు సాగాలి, జ్ఞానంతో తర్బియత్ ఎలా చేయాలి, ప్రజలను జమాఅత్‌కు ఎలా దగ్గర చేయాలి, అలాగే దూరమైన వారిని మళ్లీ ఎలా కలుపుకోవాలి అనే విషయాలను వారు నేర్చుకోవాలి.

హుజూర్ అన్వర్ ఇలా అన్నారు: ఇటీవలి వ్యక్తిగత భేటీల (ములాఖాత్‌ల) సమయంలో తన ముందుకు ఇటువంటి ఐదు సంఘటనలు వచ్చాయి. హుజూర్ అన్వర్ గట్టిగా నొక్కిచెప్పిన విషయం ఏమిటంటే, ఎవరికైనా సంబంధించిన ఏ విషయమైనా సరే, మరొకరిని అపకీర్తిపాలు చేసే హక్కు ఎవరికీ లేదు. ఆరోపణ నిజమైనదైనా, ఆ వ్యక్తిని అవమానపరచడం లేదా అతని లోపాలను ప్రచారం చేయడం సమంజసం కాదు. లోపాలను కప్పిపుచ్చాలి.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా ఇలా తెలిపారు: "చూస్తుంటే హ్యూమానిటీ ఫస్ట్ వ్యవస్థపై మరీ ఎక్కువ ప్రభావం చూపుతున్నట్లుగా అనిపిస్తోంది. ఖుద్దామ్ మరియు అన్సార్ తమ తమ పేర్లతో స్వతంత్రంగా చారిటీ వాక్‌లను నిర్వహించాలి. వారి స్వంత గుర్తింపు ప్రజల ముందుకు రావాలి. అనంతరం సేకరించిన నిధులలో నుంచి హ్యూమానిటీ ఫస్ట్‌కు కూడా ఇవ్వవచ్చు. అలాగే ఇతర స్థానిక సేవా సంస్థలకు కూడా అందించవచ్చు. చెక్కులను అందించే కార్యక్రమాలను నిర్వహించినప్పుడు పత్రికా మరియు ఎలక్ట్రానిక్ మీడియాను కూడా ఆహ్వానించాలి. దీనివల్ల ఒకవైపు జమాఅత్ పరిచయం ప్రజలకు కలుగుతుంది; మరోవైపు రంగు, జాతి, మత భేదం లేకుండా ప్రతి ఒక్కరి సంక్షేమాన్ని బోధించి, అందరికీ సహాయం చేసే ఇస్లాం ఎంత అందమైన మతమో ఇతరులకు కూడా తెలుస్తుంది."

హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: "ఇలాంటి వివిధ కార్యక్రమాలను నిర్వహించండి. చారిటీ వాక్‌తో పాటు రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు, సంవత్సరం ప్రారంభంలో స్థానిక కౌన్సిల్‌తో కలిసి పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు, శ్రమదాన కార్యక్రమాలు వంటి వాటిని నిర్వహించండి. ఈ కార్యక్రమాలలో మీడియాను కూడా భాగస్వామ్యం చేయండి. తరచూ ప్రజల ముందుకు వస్తే జమాఅత్ గురించి మరింత అవగాహన ఏర్పడుతుంది. ఏయే పనుల ద్వారా సత్కార్యాలు వ్యాప్తి చెందుతాయో, ఇస్లాం యొక్క సౌందర్యం బహిర్గతమవుతుందో, అలాంటి పనులకు ప్రచారం కల్పించడం అవసరం."

హజ్రత్ అన్వర్ ప్రచురణ విభాగానికి సూచిస్తూ ఇలా అన్నారు:

"పుస్తకాల ధరలను తక్కువగా నిర్ణయించండి. లాభం కూడా తక్కువగా తీసుకోండి. అలా చేస్తే మీ పుస్తకాలు ఎక్కువ సంఖ్యలో విక్రయించబడుతాయి."

హజ్రత్ అన్వర్ ఇలా తెలిపారు:"హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని (రజి) ప్రారంభ కాలంలో రబ్వా పట్టణంలోని దుకాణ దారులకు లాభం తక్కువగా తీసుకోవాలని సూచించారు. దానివల్ల ఒకవైపు మీ వస్తువులు ఎక్కువగా విక్రయించ బడుతాయి, ఆదాయం కూడా బాగుంటుంది. మరోవైపు బయటి ప్రాంతాల నుంచి వస్తువులు, సరుకులు రబ్వాకు నిరంతరం వస్తూ ఉంటాయి. కానీ ఇప్పుడు ఎక్కువ లాభం తీసుకోవడం ప్రారంభించారు."

హజ్రత్ అన్వర్ ఇలా తెలిపారు: "ప్రచురణ విభాగం పని డబ్బు సంపాదించడం కాదు. వారి నిజమైన పురోగతి, విజయం ఏమిటనగా, 'మేము ఇంత మొత్తంలో లిటరేచర్‌ను విక్రయించాము, ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు మా పుస్తకాలను కొనుగోలు చేశారు' అని చెప్పగలగడం."

**(తదుపరి సంచికలో చదవగలరు)**

### 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్ఫలితాలు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

**( నజారత్ ఇస్లాహ్ ఇర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్ )**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz